ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-3-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 40 పేజీలు: 8+16 వెల: 6.50

గల్ఫ్ భారతీయుల్ని వెనక్కి తెస్తాం: ప్రధాని 5

ఇరాన్ సుప్రీం లీడర్ ఆచూకీ ఎక్కడ?

## వెలుగుమట్ల నిర్వాసితుల్లో అర్హులకు పట్టాలు, ఇళ్లు



311 మందికి భూదాన్ భూమిలో పట్టాతో పాటు ఇందిరమ్మ ఇళ్లు: డి. సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రతినిధి,ఖమ్మం:** డిసెంబర్ 9 న సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా వెలుగుమట్ల భూదాన్ భూముల లబ్ధిదారులు సామూహిక గృహప్రవేశం జరుపుకోవాలని, ఆ దిశగా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అవసరమైన చర్యలు చేపడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావులు వెలుగుమట్ల భూ నిర్వాసితుల్లో అర్హులకు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇండ్లు ఉండాలని నిర్ణయం తీసుకుని తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. హౌసింగ్ శాఖ ద్వారా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను 22 వేల 500 కోట్లతో మంజూరు చేశామన్నారు. వెలుగు మట్ల భూదాన్ భూములలో పేదలకు పంచగా మిగిలిన భూమిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, స్కూల్స్ పక్క భవనాలకు ఆ స్థలం ఉపయోగిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. వెలుగుమట్ల లబ్ధిదారులు నేటి నుంచి నిర్భయంగా ఉండాలని, మోడల్ కాలనీగా తయారు చేసి అందించే బాధ్యత తాము తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మార్చి 1, 2026 నాడు ఇచ్చిన మాట ప్రకారం నిరుపేదలైన లబ్ధిదారులకు సీఎం, కేబినెట్ సహచరుల సహకారంతో 311 మంది ఇంటి స్థలం లేని వారికి ఇండ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రం, సొంత ఊరిలో స్థలం ఉన్న మరో 101 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను ఎటువంటి భేషజాలు లేకుండా ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఫిబ్రవరి 24న వెలుగుమట్ల ఇండ్ల కూల్చివేతలు జరిగిన తర్వాత ప్రధాన ప్రతిపక్ష నాయకులు వచ్చి మొసలి కన్నీరు కార్చారని మంత్రి ఎద్దేవా చేశారు. చేనేత, జౌళీ శాఖల మంత్రితుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ.. పేదలను కొంత మంది ముఠాగా ఏర్పడి మోసం చేస్తే గత పాలకులు పట్టించుకోలేదన్నారు. తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు పేరిట ఇచ్చిన పత్రాలు బోగస్ అని, సిసిఎల్ఏ ఆ భూములు స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు.




# హాహాకారాలు

## గ్యాస్‌లేక ఘుమఘుమలు మాయమవుతున్న వంటిళ్లు

ధరలు పెంచినా, కృత్రిమ కొరత ఉన్నా కఠిన చర్యలని కేంద్ర సర్కార్ హెచ్చరిక

భారత్‌కు వస్తున్న 2 చమురు నౌకలు

**న్యూఢిల్లీ, మార్చి 11:** ఇజ్రాయెల్, అమెరికా -ఇరాన్ యుద్ధంతో ఒక్కసారిగా ముడిచమురు దిగుమతులు నిలిచిపోవడం, తీవ్ర స్థాయికి గ్యాస్ కొరత పెరిగిపోయింది వంటగ్యాస్‌కు ఇబ్బంది లేకపోయినా కమర్షియల్ గ్యాస్ కొరత కారణంగా కొన్ని నగరాల్లో హోటళ్లను సైతం మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఢిల్లీ,ముంబయి, బెంగళూరు, చెన్నై హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో ఆతిథ్య రంగంపై ఈ గ్యాస్ కొరత తీవ్రంగా ఉంది. హోటల్‌యజమానులు వాణిజ్యసిలిండర్లు పూర్తిగానిలిచిపోయాయని, పంపిణీదారులు చేతులెత్తేస్తున్నారని, కొన్నిచోట్ల కృత్రిమ >>2



బుధవారం లోక్‌భవన్‌లో కొత్త గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ప్రమాణం చేయిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేశ్ కుమార్. చిత్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

# కొత్త గవర్నర్ బాధ్యతలు

## తెలుగులో ప్రమాణం చేసిన శివప్రతాప్ శుక్లా

### 16 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి11:** తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం ఉదయం 11-30 గంటలకు రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ ఆయనతో ప్రమాణం చేయించారు. అయితే, ఉత్తరప్రదేశ్‌కు చెందిన శుక్లా అనూహ్యంగా తెలుగులో ప్రమాణం చేసి అక్కడున్న వారందరినీ ఆశ్చర్యపరిచారు. ఈయన తెలంగాణ రాష్ట్రానికి నాల్గవ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యారు. వీరితో పాటు హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ బి.శివధర్‌రెడ్డి తదితర >>2

## ఓంబిర్లాపై వీగిన అవిశ్వాసం

మూజువాణి ఓటుతో తిరస్కరణ

చర్చకు సమాధానమిచ్చిన కేంద్ర మంత్రి అమిత్ షా

విపక్ష నేతకు మాట్లాడే అవకాశమివ్వలేదు: రాహుల్



**న్యూఢిల్లీ, మార్చి 11:** లోక్‌సభ స్పీకర్‌పై కాంగ్రెస్ ప్రతిపాదించిన అవిశ్వాసం వీగిపోయింది. మూజువాణి ఓటుతో తీర్మానం తిరస్కరణకు గురైంది. స్పీకర్ ఓం బిర్లాపై కాంగ్రెస్ ప్రతిపాదించిన తీర్మానంపై మంగళవారం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ >>2

## దానం, కడియం అనర్హత



# పిటిషన్లు డిస్మిస్



### వారు పార్టీ మారినట్లు ఆధారాల్లేవన్న స్పీకర్ ప్రసాద్ కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి11:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంచలన తీర్పు ఇచ్చారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలపై వేసిన అనర్హత పిటిషన్లను స్పీకర్ డిస్మిస్ చేశారు. వీరు పార్టీ మారినట్లు ఆధారాల్లేవని.. ఎమ్మెల్యేలు దానం నాగేందర్,కడియం శ్రీహరి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా వారిద్దరూ బీఆర్ఎస్ పార్టీలో ఉన్నట్లుస్పీకర్ ప్రకటించారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన విషయం తెలిసిందే. ఆ తరువాత వారు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆరోపణలు వచ్చాయి. పార్టీ ఫిరాయింపుల చట్టానికి వ్యతిరేకంగా వీరు పని చేస్తున్నారని.. వీరి శాసనసభ సభ్యత్వంపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్, బీజేపీ నుంచి పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బుధవారం విచారణ చేపట్టారు. ఈ విచారణలో తాముఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, పార్టీ మారలేదని దానం నాగేందర్, కడియం శ్రీహరి స్పష్టం చేశారు. దానం, కడియం వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకున్న స్పీకర్.. వీరిద్దరినీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. అనర్హత వేటు పిటిషన్లను కొట్టేశారు. దీంతో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు ఊరట లభించినట్లయ్యింది. ఇదిలాఉంటే.. గురువారం సుప్రీంకోర్టులో పార్టీ >>2

### బిఆర్ఎస్‌లో ఉన్నా నాయకత్వానికి దూరం: కడియం శ్రీహరి

### ఎంపీగా పోటీ వ్యక్తిగతం: దానం



స్పీకర్ తీర్పు అత్యంత అప్రజాస్వామికం

నేర పూరిత ఆలోచన రాహుల్‌గాంధీదే: కెటిఆర్ 7

# కావూరి కన్నుమూత



కేంద్ర మంత్రిగా, ఐదుసార్లు ఎంపీగా సుదీర్ఘ రాజకీయ చరిత్ర

అస్వస్థతతో కొద్ది రోజులుగా చికిత్స

నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు

**జూబ్లీహిల్స్, మార్చి 11, ప్రభాతవార్త:** మాజీ కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు(82) కన్నుమూశారు. బంజారాహిల్స్‌లోని స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం ఉదయం 11.10 గంటలకు తుదిశ్వాస విడిచినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ విడుదల చేసిన బులిటెన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 6న నిద్రమత్తు, సరైన స్పందనలేకపోవడంతో కావూరి సాంబశివరావును కుటుంబ సభ్యులు స్టార్ ఆసుపత్రిలో చేర్చారు. పరీక్షల్లో భాగంగా ఆయన మెదడులో కుడి భాగంలో పెద్దమొత్తంలో రక్తస్రావం చేరినట్లు గుర్తించామని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఆసుపత్రిలో చేరే సమయానికి విషమ పరిస్థితిలో ఉన్నారన్నారు. ఈ క్రమంలోనే అతనికి న్యూరోసర్జరీ నిర్వహించి అనంతరం ఐసీయూలోకి మార్చి నిరంతర పర్యవేక్షణ కొనసాగించారు. చికిత్స కొనసాగుతున్నసమయంలోనే గుండె ఆగిపోవడం (కార్డియాక్ అరెస్ట్)తో మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. కాగా మచిలీపట్నం, >>2

# మూడు రోజులు మండిపోతుంది!



గరిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు

16 తర్వాత అకాల వర్షాలు!

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** తెలంగాణలో మార్చి తొలి వారంలోనే ఎండలు బెంబేలెత్తిస్తున్నాయి. ఇప్పటికే ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం, ములుగు, మంచిర్యాల, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 నుండి 41 డిగ్రీల మధ్య నమోదు అవుతున్నాయి. అయితే ఈ నెల 16 తర్వాత అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇక రాష్ట్రంలో రాబోయే మూడు రోజులు పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడించింది. దీనికి సంబంధించి వివిధ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కాగా ఉత్తర తెలంగాణలో ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది గరిష్ఠ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలో సాధారణం కన్నా మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రాగల మూడు రోజుల్లో >>2



బుధవారం రవాణా శాఖ సమీక్షలో సిఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి

## ప్రధాన జిల్లా కేంద్రాల్లో

# రింగు రోడ్లు!

### ప్రభుత్వాలు ఎలక్ట్రిక్ వాహనాలే కొనుగోలు చేయాలి: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి11:** ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా చూడడంతో పాటు సరకు రవాణా వాహనాలు వేగంగా వెళ్లేందుకు రింగు రోడ్లు ఉపయోగపడతాయని సీఎం అన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆర్ అండ్ బీ శాఖపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో రోడ్లు ఉంటే వాటిని అనుసంధానించి రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా జిల్లాకేంద్రాల నుంచి రింగురోడ్లకు అనుసంధానించేలా రేడియల్ రోడ్లు నిర్మించాలని సీఎం తెలిపారు. జాతీయ రహదారులకు రింగు రోడ్లను అనుసంధానించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే నుంచి నాగార్జున సాగర్ చేరేందుకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన నూతన ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బోధనాసుపత్రులు, ఇతర పెద్దాసుపత్రుల నిర్మాణలను త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో >>2

## 4 వారాల్లో విచారణ ముగించాలి

### ట్రయల్ కోర్టుకు 'సుప్రీం' ఆదేశం

వివేకా హత్యకేసు దర్యాప్తు ముగిసిందన్న సిబిఐ

నిందితుల బెయిలు రద్దు చేయాలన్న సునీత, సిబిఐ అధికారుల పిటిషన్లు డిస్మిస్



**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వివేకా హత్య దర్యాప్తు ముగిసిందని సిబిఐ పేర్కొనడంతో ఈ కేసు విచారణ నాలుగు వారాల్లో పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈకేసు విచారణ మంగళవారం హైదరాబాద్‌లోని సిబిఐ ప్రత్యేక కోర్టులో జరగడం తెలిసిందే. ఈ సందర్భంగా నిందితులు కోరినట్లుగా >>2

## 13 యేళ్లుగా కోమాలోనే..

ఓ యువకుడికి కారుణ్య మరణం..

సుప్రీం కోర్టు సంచలన తీర్పు 7



థాయ్ నౌకపై ఇరాన్ దాడి దృశ్యం

# దూసుకొస్తున్న క్షిపణులు, బాంబులు

### థాయ్ నౌకపై హార్ముజ్ జలసంధి వద్ద ఇరాన్ దాడి

### దుబాయ్ ఎయిర్‌పోర్టుపై మళ్లీ ఇరాన్ క్షిపణులు

### యుద్ధం ముగింపుదశకు వచ్చేసిందంటున్న ట్రంప్

**టెహ్రాన్, జెరూసలెం, మార్చి 11:** మధ్యప్రాచ్యంలో ఇరాన్‌పై యుద్ధం సెగలు తీవ్రతరం అయ్యాయి. టెహ్రాన్ ఇతర కీలక నగరాలపై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు బాంబుల వర్షం కురిపించాయి. ఇప్పటివరకూ 1300 మందికిపైగా చనిపోయినట్లు ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. సెంట్రల్ టెహ్రాన్‌పై వైమానిక, నావికా దళం దాడులు తీవ్రతరంచేసాయి. అలాగే ఇజ్రాయెల్ దక్షిణ లెబనాన్ హెజ్బొల్లా స్థావరాలపై జరిపిన దాడుల్లో 580 మంది చనిపోయినట్లు తేలింది. ఇజ్రాయెల్‌లో కూడా 12 మంది చనిపోగా అమెరికా సైనికులు ఏడుగురుచనిపోయారు. ఇరాన్ క్షిపణి, డ్రోన్ల దాడితో 140 మందికిపైగా అమెరికా సైనికులు తీవ్రంగా గాయపడినట్లు తేలింది. లెబనాన్‌లో దాడులకారణంగా 7.5 లక్షలమంది నిరాశ్రయులయ్యారని, ఇళ్లనువీడి ఇతరప్రాంతాలకు వెళ్లిపోయినట్లు ఇజ్రాయెల్‌ప్రకటించింది. ఇదిలా ఉంటే హార్ముజ్ జలసంధిని ఎలాగైన తమ అధీనంలోకి తెచ్చుకోవాలని అమెరికా భావిస్తుంటే ఇరాన్ వెనువెంటనే ఐఆర్‌జిసి దళాలను మోహరించింది. ఇప్పటికే హార్ముజ్ జలసంధినుంచి వస్తున్న మూడు నౌకలపై దాడులుచేయడంతో మళ్లీ రవాణా నిలిచిపోయినట్లు తేలింది. అమెరికా మాత్రం తాము 16 భారీ ఇరాన నౌకలను ధ్వంసంచేసినట్లు చెపుతోంది. హార్ముజ్ జలసంధి ప్రారంభం కాకపోతే ఇరాన్ మరింతగా నష్టపోవాల్సి వస్తుందని ట్రంప్ తన ట్రూత్ >>2



కేరళలోని ఎర్నాకుళంలో బుధవారం పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోడీకి జ్ఞాపికను అందజేస్తున్న కేంద్రమంత్రి సురేష్ గోపీ

# కావూరి కన్నుమూత

>> ఏలూరు నుంచి ఐదుసార్లు ఆయన ఎంపీగా గెలిచారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ ఉన్న సమయంలో ఆయన కేంద్ర మంత్రిగా పనిచేశారు. కావూరి పార్థివ దేహాన్ని బుధవారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి తరలించారు. ఆయన అంత్యక్రియలను ఈ నెల 12న జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో నిర్వహించనున్నట్లు ఆయన మనువడు, ఎంపీ శ్రీభరత్ తెలిపారు. కావూరి మృతి పట్ల తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు తమ సంతాపాన్ని ప్రకటించారు.
రాజకీయ కురువృద్ధుడు కావూరి సాంబశివరావు ప్రజాప్రతినిధిగా సుదీర్ఘకాలం సేవలు అందించారు. కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం దోసపాడు గ్రామంలో 1943లో సాంబశివరావు జన్మించారు. గుడివాడలోని ఏఎన్ఆర్ కళాశాలలో పీయూసీ వరకు చదువుకున్నారు. వరంగల్ ఎన్ఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పుష్కలంగా సాంబశివరావులో ఉండేవి. చదువుకునే రోజుల్లో విద్యార్థి సంఘం నాయకుడిగా పని చేశారు. ఆ తర్వాత నిర్మాణ రంగంలోనికి ప్రవేశించి పారిశ్రామికవేత్తగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కావూరి రెండో కుమార్తె తనయుడు శ్రీభరత్ ప్రస్తుతం విశాఖపట్నం ఎంపీగా ఉన్నారు. మచిలీపట్నం, ఏలూరు నుంచి సాంబశివరావు ఐదుసార్లు ఎంపీగా గెలిచారు. అలాగే మన్మోహన్ సింగ్ కేబినెట్లో కేంద్రమంత్రిగా పని చేశారు. 2014లో రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌కు కావూరు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. 1943లో ఏలూరులో జన్మించిన సాంబశివరావు, వరంగల్ ఆర్ఈసీ నుంచి ఇంజినీరింగ్ పట్టా పుచ్చుకున్నారు. 1980లో కాంగ్రెస్‌లో చేరిన కావూరి సాంబశివరావు ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు. తొలుత ఎమ్మెల్సీగా పోటీ చేసిన కావూరి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత మచిలీపట్నం పార్లమెంటు నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచారు. 8వ, 9వ, 12వ లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఏలూరు నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచారు.

# పిటిషన్లు డిస్మిస్

>> ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై విచారణ జరగనుంది. ఇప్పటికే పలుమార్లు విచారించిన అత్యున్నత న్యాయస్థానం.. కేసు మళ్లీ విచారణకు వచ్చేలోగా స్పీకర్ తన నిర్ణయం ప్రకటించాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం తీర్పు వెలువరించారు. దీంతో ఇప్పటి వరకు పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొన్న 10 మందికి స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. తమకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన పిటీషన్ చట్టబద్ధం కాదని పేర్కొన్నారు. స్పీకర్ తనకు క్లీన్ చిట్ ఇచ్చిన తర్వాత కడియం మీడియాతో మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీ నాకు ఎలాంటి నోటీసు ఇవ్వలేదు. కెసిఆర్ ఎప్పుడూ ప్రజల ముందుకు వచ్చి ఫిరాయింపులపై మాట్లాడలేదన్నారు. మేం శాసనసభలో ఆ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించలేదు. మేం బిఆర్ఎస్‌లోనే ఉన్నాం. ఆ పార్టీ నాయకత్వానికి దూరంగా ఉన్నాం. కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తీసుకున్నారని ప్రస్తావించారు. తాను ఎక్కడా అధికారికంగా కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. ఎంపీగా పోటీ చేయడం తన వ్యక్తిగత విషయమని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఏరోజు పనిచేయలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తనకు ఎప్పుడూ విప్ ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. శాసనసభలో పార్టీ విప్‌ను ఎప్పుడూ ఉల్లంఘించలేదని పేర్కొన్నారు. ఒకవేళ స్పీకర్ తీర్పు తనకు వ్యతిరేకంగా వచ్చినా యుద్ధ రంగం నుంచి వచ్చిన వాడిలా ఉప ఎన్నికల్లో గెలిచిచూపేవాడినని ధీమా వ్యక్తం చేశారు. స్పీకర్ పరిధిలో తానుఎక్కడా పోరపాటు చేయలేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు.

# జిల్లా కేంద్రాల్లో రింగు రోడ్లు!

>> రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. కాలుష్య రహిత రవాణాయే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇక నుంచి ప్రభుత్వంలోని ఏ శాఖైనా తప్పనిసరిగా ఎలక్ట్రిక్ వాహనాలనే కొనుగోలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో ప్రభుత్వ శాఖల పరిధిలో అద్దెలకు తీసుకునే వాహనాలు సైతం ఈవీలే ఉండాలని సీఎం తెలిపారు. రవాణా శాఖలోని మాన్యువల్ పద్ధతులకు స్వస్తి చెప్పాలని.. మొత్తం ఆన్‌లైన్‌లోనే కార్యకలాపాలు కొనసాగించాలని సీఎం ఆదేశించారు. ఆర్టీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని, వెంటనే సొంత భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచాలని... ఇందుకు షార్ట్ ఫిల్మ్‌లు ప్రదర్శించాలని సీఎం సూచించారు. శంషాబాద్ సమీపంలో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో అధునాతన బస్ టెర్మినల్‌కు స్థలం కేటాయిస్తామని.. అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 4 వారాల్లో విచారణ ముగించాలి

>> కేసు విచారణకు సంబంధించిన అన్ని ఫైళ్లు, వివరాలను సిబిఐ అధికారులు అందించడం విదితమే. ఇదే కేసుపై సుప్రీం కోర్టులో తాజాగా విచా రణ జరిగింది. ఈ సందర్భంగా సిబిఐ తరపున వాదనలు వినిపించిన న్యాయవాది కీలక ప్రకటన చేశారు. ఈ కేసులో ఇప్పటికే మూడవ అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేశామని, దీంతో తమ వైపు నుంచి దర్యాప్తు ప్రక్రియ పూర్తయ్యిందని న్యాయస్థానానికి వివరించారు. దీనిపై స్పందించిన సుప్రీం కోర్టు వివేకా హత్య హత్య కేసు విచారణ ముగిసిన నేపథ్యంలో నిందితుల బెయిల్ రద్దు చేయాలని కోరుతూ గతంలో గతంలో సిబిఐతో పాటు వివేకా కుమార్తె సునీతా రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ అవసరం లేదని సుప్రీం కోర్టు పేర్కొంటూ దీనిపై దాఖలైన పిటిషన్లను డిస్మిస్ చేసిం ది. అయితే ఇదే సమయంలో సునీతా రెడ్డి తరపు న్యాయవాది సుప్రీం కోర్టుకు కొన్ని ప్రశ్నలను సంధించారు. వివేకా హత్య కేసులో సిబిఐ దర్యాప్తు సరిగ్గా జరగలేదని తెలిపారు. దీనిపై కొన్ని వివరాలను ఆయన సుప్రీం కోర్టుకు అందించారు. దీనిపై స్పందించిన సుప్రీం ధర్మాసనం ఈ అంశాలను నేరుగా ట్ర యల్ కోర్టులో వెల్లడించాలని, అభ్యంతరాలు కూడా అక్కడే చెప్పాలని సూచించింది. సెక్షన్ 207 కింద ట్రయల్ కోర్టులో దాఖలైన అన్ని పిటిషన్లను పరిశీలించి విచారణను పూర్తి చేయాల ని సిబిఐని ఆదేశించింది. ఈ కేసులో జాప్యాన్ని నివారించేందుకు సుప్రీం కోర్టు కాలపరిమితిని వి ధించింది. ట్రయల్ కోర్టులో పెండింగ్‌లో వున్న అన్ని పిటిషన్లపై నాలుగు వారాల్లోగా విచారణ ముగించి తీర్పును వెలువరించాలని ఆదేశించింది.

## వారం - వర్జ్యం

12-03-2026, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
నవమి పూర్తి
మూల రా.12.42
వర్జ్యం : ఉ.11.13-12.59
దు.ఉ.10.19-11.07,
2) మ.3.06-3.54
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** ఓర్పు, నేర్పులతోనే కార్యసాధన అవుతుంది. సహనమునకు పరీక్షలు ఎదురవుతాయి. కాంట్రాక్టులు లభిస్తాయి.

**వృషభం:** మీకు రావలసిన ప్రతిఫలము కొద్దికొద్దిగా చేతికి అందుతుంది. మీ ఆంతర్యాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోతారు.

**మిథునం:** న్యాయబద్ధముగా రావలసిన ధనము వాయిదాల పద్ధతిలో డోనేషన్స్‌ను స్వీకరించినట్లుగా తీసుకోవలసివస్తుంది.

**కర్కాటకం:** విధుల నిర్వహణలో వ్యాపార రంగంలో అభివృద్ధి కనిపిస్తుంది. విదేశీయానాలు చేయాలనే ఆలోచనలు బలపడతాయి.

**సింహం:** అకౌంట్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసి ఉంటుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ధనలాభం.

**కన్య :** కార్యాలయంలో సహోద్యోగులు కొన్ని చికాకులు కల్పించినా వాటిని అధిగమిస్తారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**తుల :** బంధువర్గానికి ధనసహాయం చేయవలసి వస్తుంది. కొన్ని చర్చలు జరిపి కీలకమైన నిర్ణయాలు తీసుకుంటారు.

**వృశ్చికం:** స్టేషనరీ, ప్రింటింగ్ సంబంధిత వ్యాపారులకు సానుకూలం. వివాదాలకు దూరంగా వుండడం మంచిది.

**ధనుస్సు:** శారీరక, మానసిక శ్రమ అధికమవుతుంది. చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తిచేస్తారు. వాహనసౌఖ్యం.

**మకరం:** నిందలు, ఆరోపణలు, దుష్ప్రచారాలు ఇబ్బందిని కలిగిస్తాయి. అయితే అవి తాత్కాలికము మాత్రమే కనుక ధైర్యంగా ఉండండి.

**కుంభం:** అతి విలువైన డాక్యుమెంట్లు, ఉపయోగకరమైన పత్రములు లభ్యమయ్యే అవకాశం ఉంది. ఆరోగ్యవిషయం జాగ్రత్త.

**మీనం:** ఎంతోకాలంగా మీలో నిద్రాణమైన ప్రతిభ వెలుగు చూస్తుంది. ఉద్యోగాలలో మంచి మార్పులు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మూడు రోజులు మండిపోతుంది!

>> గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీల మేర పెరుగుతాయని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. అయితే రాష్ట్రంలో ఎండలు దంచికొడుతోన్న ఈ తరుణంలో అకాల వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు చల్లని కబురు చెప్పారు. ఈ నెల 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దాదాపు వారం రోజుల పాటు తెలంగాణ రాష్ట్రంలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.
ఉరుములతో కూడిన వడగళ్ల వర్షం పడనున్నట్లు తెలిపారు. రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్ నగర్, అదిలాబాద్, నల్గొండ లాంటి జిల్లాల్లో కొన్నిచోట్ల వడగండ్ల వర్షాలు పడనున్నట్లు సూచించారు. ఈ నెల చివరి దాకా ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతాయని తెలిపారు. ముఖ్యంగా ఏప్రిల్ మాసంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చు అని స్పష్టం చేశారు. మరోవైపు తెలంగాణలో ఈనెల 15వ తేదీ వరకు పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు 33 డిగ్రీల నుంచి 40 డిగ్రీల మధ్య నమోదు అవుతున్నాయి.

# ఓంబిర్లాపై వీగిన అవిశ్వాసం

>> రిజిజు చర్చను ప్రారంభించగా, బుధవారం కూడా కొనసాగింది. దాదాపు 10గంటలకు పైగా సాగిన చర్చ సాగింది. అవిశ్వాస తీర్మానంపై చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు అన్ని పార్టీల నేతలకూ అవకాశం కల్పించారు. స్పీకర్ పక్షపాతం వ్యవహరిస్తున్నారని, అధికార పక్షానికి వంతుపాడుతున్నారని కాంగ్రెస్, టిఎంసి, సమాజ్‌వాదీ పార్టీ సహా ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశం కూడా కల్పించడం లేదని విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు.
ఈ ఆరోపణలను అధికార పక్ష సభ్యులు తిప్పికొట్టారు. స్పీకర్ అందరివాడని, పార్టీలతో సంబంధం లేదని స్పష్టం చేశారు. అలాగే, స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ప్రతిపక్ష పార్టీల నేతల ప్రమేయం కూడా ఉందని కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు తదితరులంతా గుర్తుచేస్తూ, విపక్షాల ఆరోపణలను ఖండించారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ చర్చలో పాల్గొంటూ, స్పీకర్‌పై తమకెలాంటి అభిప్రాయం లేదని, అయితే, అధికార పక్షం ఒత్తిడి ఆయనపై ఉందని, అందుకే ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించడం లేదని పేర్కొన్నారు.
స్పీకర్‌పై ప్రతిపాదించిన అవిశ్వాసం తీర్మానంపై చర్చకు హోంమంత్రి అమిత్ షా సమాధానమిచ్చారు. స్పీకర్ సమగ్రత గురించి ప్రశ్నలు లేవనెత్తడం దేశ ప్రజాస్వామ్య సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తుందని ప్రతిపక్షాల తీరును తీవ్రంగా తప్పుపట్టారు. సుదీర్ఘ ఘర్షణకు కారణమయ్యే అసాధారణ సంఘటన ఏదీ లేదని, అయినప్పటికీ వివరణాత్మక చర్చ ఇప్పటికే జరిగిందని అమిత్ షా అన్నారు.
"అసాధారణ సంఘటన ఏదీ జరగలేదు, అయినప్పటికీ 10 గంటల చర్చ షెడ్యూల్ చేయబడింది. వాస్తవానికి, చర్చ దాదాపు 13 గంటల పాటు కొనసాగింది" అని పేర్కొన్నారు.
అధికార, ప్రతిపక్ష సభ్యులు 42 మందికి పైగా సభ్యులు చర్చలో పాల్గొన్నారని తెలిపారు. ప్రతి అభిప్రాయాన్ని వ్యక్తీకరించడానికి సభ తగినంత అవకాశాన్ని కల్పించిందని చెప్పారు. స్పీకర్ నిర్ణయాలకు సంబంధించి అభిప్రాయ భేదాలు ఉండవచ్చు, కానీ లోక్‌సభ నియమాలు స్పీకర్ తీర్పు తుది అని స్పష్టంగా చెబుతున్నాయని అమిత్ షా నొక్కిచెప్పారు. లోక్‌సభను దేశంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వేదికగా అభివర్ణించారు.

**'రాజీపడ్డారు' వ్యాఖ్యలపై మళ్లీ వాగ్వాదం**

ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాజీపడ్డారంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై అధికార, విపక్ష సభ్యుల మధ్య మళ్లీ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అలాగే బిజెపి సభ్యుడు రవిశంకర్ ప్రసాద్ చర్చలో పాల్గొంటూ, రాహుల్ వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యులు తమ వాదనలు సమర్థించుకుంటూ బల్లలు చరుస్తూ నినాదాలిచ్చారు. అధ్యక్షత వహించిన ఎంపి జగదాంబికా పాల్ సభ్యులకు సర్దిచెప్పి చర్చ సాగేలా చర్యలు తీసుకున్నారు.

# హాహాకారాలు

>> కొరత ఎదురవుతోందని వాపోతున్నారు. ఐఆర్‌టిసిలో వంటకాలను నిలిపివేయాలని, ఆహార సరఫరా నిలిపివేయాలని కూడా ఐఆర్‌టిసి ఆదేశించింది. కొన్ని చోట్ల వారం గడిచినా సరఫరా కావడంలేదని తెలుస్తోంది. గృహావసరాల సిలిండర్ల సరఫరాలోకూడా కేంద్రం స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసినా ఏజెన్సీలు మాత్రం బేఖాతరుచేస్తున్నట్లు తెలుస్తోంది. రోజుకు 30 సిలిండర్లు అవసరమైన సంస్థలకు కూడా అందడంలేదన్న ఫిర్యాదులు పెరిగాయి. ఇప్పటికే పాక్షికంగా మూతపడిన హోటళ్లు, రెస్టారెంట్లు ఇదేపరిస్థితి కొనసాగితే పూర్తిగా మూసివేయక తప్పదన్న ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పారిశ్రామిక యూనిట్లకు కూడా సరఫరా నిలిచిపోవడంతో గ్యాస్ ఆధారిత ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి.

**కృత్రిమ కొరతపై కేంద్రం సీరియస్**

ఇరాన్ యుద్ధం ఉద్రిక్తతలనేపథ్యంలో గ్యాస్‌సరఫరాపై వస్తున్న ఫిర్యాదులనుకేంద్రం తీవ్రంగా పరిగణించింది. గృహావసరాల సిలిండర్లు వాణిజ్య పారిశ్రామిక సంస్థలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఇంధనశాఖ హెచ్చరించింది. ప్రస్తుతం భారత్‌కు రెండునౌకల్లో గ్యాస్, ముడిచమురు వస్తోందని, అందువల్ల భవిష్యత్‌ప్రణాళికలో కూడా ఎలాంటి ఆటంకాలు ఉండవని చెపుతోంది. వాణిజ్య సిలిండర్లను బ్లాక్‌చేసి అధికధరల విక్రయాలపై తరచూ తనిఖీలుచేయాలని, ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని ఇంధన శాఖ మార్గదర్శకాలు జారీచేసింది.

**హార్మోజ్ నుంచే రెండు నౌకలు భారత్‌కు...**

భారతదేశంలో ఎల్పీజీ కొరతకు ముగింపు దశకు చేరుకున్నదని, భారీ స్థాయిలో గ్యాస్ వస్తున్నదని ఇంధనశాఖ జాయింట్ కార్యదర్శి సుజాతశర్మ బుధవారం ప్రకటించారు. ముడి చమురులో 75 శాతం భాగం హార్మూజ్ కాకుండా ఇతర మార్గాల ద్వారా కూడా వస్తుందని వెల్లడించారు ఎల్ఎన్‌జి దిగుమతి, సరఫరా సురక్షితంగా జరుగుతోందని దేశంలో ఎల్పీజీ కొరత మధ్య, సహజ వాయువు ఎల్ఎన్‌జి రెండు కార్గోలు దేశానికి వస్తున్నాయని ఆమెతెలిపారు. ప్రస్తుతం సరఫరా సాధారణ హార్మూజ్ మార్గం కంటే ఎక్కువగా ఉందని ఆమె చెప్పారు.

# రెండున్నర రోజుల వ్యవధిలోనే సిలిండర్ డెలివరి

## ఎల్‌పిజి ఉత్పత్తి 25 శాతం మేర పెంచుతూ ప్రకటన

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో వంట గ్యాస్‌కు తీవ్ర కొరత ఏర్పడనుందన్న ఆందోళనల నేపథ్యంలో సామాన్యుల భయాందోళనలను పటాపంచలు చేస్తూ కేంద్రం శుభవార్త చెప్పింది. ప్రస్తుతం నెలకొన్న కొరత తాత్కాలికమేనని, గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ప్రణాళికను సిద్ధం చేసినట్లు కేంద్రం పేర్కొంది. కేవలం రెండున్నర రోజుల వ్యవధిలోనే సిలిండర్ డెలివరీ చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. దీనివల్ల ప్రజలు గంటల తరబడి ఏజెన్సీల వద్ద వేచి ఉండాల్సిన అవసరం లేదు. డిమాండ్‌కు తగ్గట్టుగా ఎల్పీజీ ఉత్పత్తిని ఏకంగా 25 శాతం పెంచినట్లు కేంద్ర పెట్రోలియంశాఖ ప్రకటించి. కాగా.. కొద్ది రోజులుగా వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాలో అంతరాయం ఏర్పడటమే కాకుండా పంపిణీ ఆలస్యమవుతుండటంతో జనాల్లో ఆందోళన మొదలైంది. అంతర్జాతీయంగా చమురు సరఫరా మార్గాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయన్న వార్తలతో అసలు గ్యాస్ దొరుకుతుందా లేదా అన్న భయం జనాలకు గురిచేసింది. చాలా మంది ముందు జాగ్రత్తగా బుకింగ్‌లు చేసుకుంటూ గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చేసిన తాజా ప్రకటనతో గ్యాస్ నిల్వలు పుష్కలంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. దీనికి తోడు.. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చమురు దిగుమతులను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. హార్మూజ్ జలసంధి గుండా సరఫరా నిలిచిపోయినా ఆ రూట్‌తో సంబంధం లేని ఇతర మార్గాల ద్వారా అంతకుమించి చమురును సేకరిస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. భారత్‌కు అవసరమైన గ్యాస్ నిల్వలను సమకూర్చడానికి త్వరలోనే రెండు భారీ ఎల్ఎన్జీ కార్గోలు దేశానికి చేరనున్నట్లు కేంద్రం వెల్లడించింది. దీంతో పరిశ్రమలకు, గృహ అవసరాలకు సరిపడా గ్యాస్ అందుబాటులోకి రానుంది. అదే సమయంలో కృత్రిమ కొరత సృష్టించే వారిపై నిఘా ఉంచామని అధికారులు తెలిపారు.




బుధవారం పార్లమెంటు ప్రాంగణంలో 'ప్రధాని రాజీ పడ్డాడు'.. అని రాసి ఉన్న బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ఆందోళన చేస్తున్న ఎంపీలు ప్రియాంకా గాంధీ, హిబి ఈడెన్, మాణికం ఠాగూర్ తదితరులు

# కొత్త గవర్నర్ బాధ్యతలు

>> ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ శుక్లాకు ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఈ నెల 16వ తేదీ నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అదే రోజున ఉభయ సభలను ఉద్దేశించి కొత్త గవర్నర్ ప్రసంగించనున్నారు. గతవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న శుక్లాను తెలంగాణకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు తెలంగాణ గవర్నర్‌గా ఉన్న జిష్ణు దేవ్ వర్మను మహారాష్ట్రకు గవర్నర్‌గా నియమించారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లా రుద్రాపూర్‌లో 1952 ఏప్రిల్ 1న జన్మించిన శివప్రతాప్ శుక్లా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, యూపీ మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఇప్పటి వరకు హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా చేసిన శివప్రతాప్ శుక్లా తెలంగాణ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లా రుద్రాపుర్ గ్రామంలో 1952 ఏప్రిల్ 1న శుక్లా జన్మించారు. అదే గ్రామంలో పాఠశాల విద్యా పూర్తి చేసి, గోరఖ్‌పూర్‌లో కాలేజీ విద్యా పూర్తి చేశారు. ఆ తర్వాత న్యాయ శాస్త్రంలో డిగ్రీ పొందారు. ఇంతకముందు శివ పత్రాప్ శుక్లా కేంద్రంలోని మోదీ ప్రభుత్వంలో ఆర్థిక శాఖ సహాయమంత్రిగా పని చేశారు. ఈయన విద్యార్థిగా ఉన్నప్పుడే ఏబీవీపీ సంస్థాగత కార్యదర్శిగా పని చేశారు. ఆ తర్వాత 1983లో బీజేపీలో చేరారు. 1989లో మొదటిసారి గోరఖ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనతాపార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ తర్వాత మళ్లీ 1991లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. యూపీలో మొదటిసారి కల్యాణ్ సింగ్ నేతృత్వంలో ఏర్పడిన బీజేపీ ప్రభుత్వంలో విద్యాశాఖ సహాయమంత్రిగా స్వతంత్ర హోదాలో పని చేశారు. 1993, 1996లలో ఎమ్మెల్యేగా ఎన్నికై విధులు నిర్వహించారు. 1996లో కల్యాణ్‌సింగ్, రామ్ ప్రకాశ్ గుప్తా, రాజనాథ్‌సింగ్ ప్రభుత్వాలలో మంత్రిగా పని చేశారు. 20 ఏళ్ల తర్వాత 2016 జూన్ 10వ తేదీన యూపీ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎంపికయ్యారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రిగా మోదీ ప్రభుత్వంలో బాధ్యతలు తీసుకున్నారు. అలా ఎనిమిదేళ్లపాటు 2022 జులై 5 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. మూడేళ్ల కిందట 2023 ఫిబ్రవరి 18న హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఇప్పుడు అక్కడి నుంచి తెలంగాణకు బదిలీ అయ్యారు.

# తెలంగాణలో మూత పడుతున్న హోటళ్లు

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరత ప్రతికూల ప్రభావం బెంగళూరు, ముంబయి, కోల్‌కతా నగరాలతోపాటు తాజాగా తెలంగాణను కూడా తాకింది. రెండు రోజులుగా గ్యాస్ కొరత మూలంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో పలు హోటళ్లు మూతపడ్డాయి. ఇంకా కొన్ని హోటళ్లు రోజువారి మెనూను కుదించి ధరలను పెంచే ప్రయత్నంలో ఉన్నాయి. చిన్నచిన్న టిఫిన్ బండ్లతో పాటు పెద్దపెద్ద స్టార్ హోటళ్ల దాకా వంటలు చేయడానికి గ్యాస్ తప్పనిసరి కావడంతో ఆయా హోటల్స్‌లో గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నంతవరకు మాత్రమే హోటల్స్ నడిపే అవకాశం ఉందని ఆయా వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తమవద్ద ఉన్న సిలిండర్లు ఒకట్రెండు రోజులకు మించి నడపలేమని, పరిస్థితి ఇలాగే ఉంటే మూసివేయడం తప్ప మరో మార్గం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. తాత్కాలికంగా టీ, కాఫీలను నిలిపివేస్తున్నట్లు హైదరాబాద్ ఐటీ కారిడార్ హోటళ్ల అసోసియేషన్ ప్రకటించింది. నగరంలో గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా కట్టెల పొయ్యిలు లేదా ఎలక్ట్రిక్ ఇండక్షన్ స్టవ్‌లను ఏర్పాటు చేసుకునే అవకాశం లేదని హోటళ్ల యజమానులు చెబుతున్నాయి. మరోవైపు, ఎల్పీజీ గ్యాస్ కొరత కారణంగా హైదరాబాద్ హాస్టల్ యాజమాన్యాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. బుధవారం నుంచి నుంచి కేవలం ముఖ్యమైన ఆహార పదార్థాలు మాత్రమే సరఫరా చేస్తామని, ఎక్కువ టైమ్ తీసుకునే చపాతీ, పూరి లాంటి వంటకాలు ఉండవని, కొన్ని కూరలు, ఎక్స్‌ట్రా ఫుడ్ ఐటమ్స్ బంద్, సొంతంగా వంట చేసుకోవడానికి వీల్లేదంటూ హైదరాబాద్ ఐటి కారిడార్ హాస్టల్ యాజమాన్యాలు నోటీసు విడుదల చేసింది. ఇవేకాక వండేందుకు ఎక్కువ సమయం పట్టడం, ఎక్కువ నూనె వినియోగమయ్యే చపాతి, దోసె, పూరీ వంటి వంటకాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అసోసియేషన్ స్పష్టం చేసింది. ఇక హైదరాబాద్‌లోని పలు పిజి హాస్టళ్లు, మెస్‌లలో వంటలు చేయడానికి ఎక్కువగా గ్యాస్‌నే వినియోగిస్తారు. గత రెండు రోజులుగా వాణిజ్య గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో ఆయా హాస్టళ్లలో మెనూలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఎక్కువసేపు వండే వంటలను తగ్గించి కేవలం అన్నం, సాంబారు, పప్పు, రసం వంటివాటికే పరిమితం చేశారు. రెండు, మూడురోజుల హాస్టళ్ల వరకు గ్యాస్ సరఫరా అందుబాటులోకి రాకపోతే హాస్టళ్లను తాత్కాలికంగా మూసివేయడం తప్పదని హాస్టల్ నిర్వాహకులు తేల్చిచెబుతున్నారు.
హైదరాబాద్ నగర వ్యాప్తంగా వందలాది హాస్టళ్లు ఉన్నాయి. ఉద్యోగులు, విద్యార్థులు, కోచింగ్ తీసుకోవడానికి వచ్చేవారితో హాస్టళ్లలో కనీసం 20 నుంచి 100 మంది వరకు వసతి పొందుతున్నారు. ఎస్సార్‌నగర్, అమీర్‌పేట, కెపిహెచ్‌బి, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్లు మూసివేతకు చేరువవుతున్నాయి. దీంతో విద్యార్థులు, ఉద్యోగాల కోసం శిక్షణ తీసుకుంటున్న నిరుద్యోగులపై తీవ్రప్రభావం పడనుంది. ముఖ్యంగా ప్రస్తుతం పలు పరీక్షలు జరుగుతుండగా వారిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది.

# క్షిపణులు, బాంబులు

>> సోషల్‌మీడియాలో హెచ్చరికలుచేసారు. ఇరాన్‌లో మిలిటరీపరిస్థితులు మరింతఘోరంగా ఉంటాయని హెచ్చరించారు. ఓమన్, ఇరాన్‌లమీదుగా ఉన్న హర్మూజ్ జలసంధిమీదుగానే ఐదోవంతు చమురు, గ్యాస్‌లు రవాణా అవుతుంటాయి. అయితే భారత్‌కు వస్తున్న థాయ్‌నౌకపై దాడిజరగడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఇప్పటివరకూ జలసంధిమీదుగా వస్తున్న నౌకలు 14వరకూ దెబ్బతిన్నట్లు తేలింది. థాయిలాండ్, జపాన్, మార్షల్ ఐలాండ్స్ నౌకలే ఎక్కువ ఉన్నాయి.

**దుబాయి ఎయిర్‌పోర్టుపై దాడులు**

ఇరాన్ అమెరికా బేస్‌స్థావరాలపై దాడులుచేయడంతోపాటు గల్ఫ్‌దేశాల్లోని కీలక స్థావరాలు కూడా లక్ష్యంగాచేసుకుంది. ఆయా దేశాల్లోని ఎయిర్‌బేస్‌లతోపాటు యుఎస్ దౌత్యకార్యాలయాలను కూడా టార్గెట్‌చేసాయి. కువైట్‌లోని యుఎస్ ఎంబసీతోపాటు నార్వేరాజధాని ఓస్లోలోని యుఎస్ ఎంబసీపైనా ఇవే దాడులు జరిగాయి. ఇక గల్ఫ్‌దేశాల్లో కువైట్, సౌదీ, యుఎఇ చమురుశుద్ధి కేంద్రాలపై ఇరాన్ దాడులు తీవ్రతరంచేసింది. ముమ్మరదాడులకారణంగా యుఎఇలోని అతిపెద్ద చమురుశుద్ధికేంద్రం కార్యకలాపాలు నిలిపివేసింది. కువైట్‌నేషనల్‌గార్డ్ మాత్రం తాము ఎనిమిది డ్రోన్లను కూల్చివేసామని ప్రకటించింది.

**ఇప్పటికైనా చైతన్యం కండి..ఇరాన్‌ప్రజలకు నెతన్యాహు పిలుపు**

యుద్ధం ముగింపుదశకు వచ్చిందని, ఇక టార్గెట్లు ఏమీలేవని, ఇరాన్‌లోని మతపరమైన పాలనను అంతంచేసేందుకు ఇరాన్‌ప్రజలు సిద్ధంకావాలని ఇజ్రాయెల్‌ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పిలుపునిచ్చారు. ఇప్పటికే ఇరాన్‌పెద్దలు పరారవుతున్నారని, మిలిటరీ, ఎయిర్‌బేస్ నేవల్ అన్నీ టార్గెట్లు ఛేదించామని ఇజ్రాయెల్‌ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌సైతం ఇరాన్‌లో ఇక టార్గెట్లు అంటూ ఏమీలేవని, అన్నింటినీ ధ్వంసంచేసామని, ఇరాన్ ఇదే తీరు కొనసాగిస్తే ప్రపంచ చిత్రపటంలో ఇరాన్ కనుమరుగవుతుందని హెచ్చరించారు. ఇరాన్‌లో నిరంకుశపాలనకు ముగింపు పలికామని, ఇక ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు.



## నేను ఎక్కడా సభ్యత్వం తీసుకోలేదు

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

**జూబ్లీహిల్స్, మార్చి 11, ప్రభాతవార్త:** తాను ఎక్కడ సభ్యత్వం తీసుకోలేదని, తనపై శాసనసభలో ఎక్కడ విప్ జారీ కాలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిపై బీఆర్ఎస్, బీజేపీ వేసిన అనర్హత పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ డిస్మిస్ చేశారు. ఈ నేపథ్యంలోనే దానం నాగేందర్ నివాసం వద్ద కాంగ్రెస్ నేతలు బంజారాహిల్స్ డివిజన్ అధ్యక్షుడు రాములు చౌహాన్, దేశం శ్రీనివాస్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒకటేనని మరోసారి స్పష్టమైందని, తనపై బీజేపీ ఎందుకు ఫిర్యాదు చేసింది అంటూ ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వమించిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశానికి తనను ఎందుకు పిలవలేదు అంటూ ప్రశ్నించారు. కేసీఆర్‌కు ముఖ్యమంత్రి కాలేదని ఎలాంటి ఇబ్బంది లేదని, కాని కేటీఆర్‌కు చాలా ఇబ్బంది ఉందన్నారు. తాను ఎంపీగా గెలిచిఉంటే ఈ పంచాయితీ ఉండేది కాదని, తాను ఎంపీగా ఓడటానికి బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్ర చేశాయన్నారు. వారి అపవిత్ర కలయికనే ఇందుకు కారణమన్నారు. తాను ఎంపీగా గెలిచి ఉంటే ఈ సమస్య ఉండేది కాదన్నారు. పార్టీకి వ్యతిరేకంగా తాను ఎక్కడ పనిచేయలేదని, తాను యద్దరంగం నుంచి వచ్చానని అన్నారు.

## వంటింటిపైనా యుద్ధ ప్రభావం!

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ప్రభావం తెలంగాణలోని వంటింటిపైనా పడింది. వంట నూనెలతోపాటు పప్పు దినుసులు, తదితర నిత్యావసర సరుకుల ధరలు బాగా పెరుగుతున్నాయి. ఉగాది, రంజాన్ పండగ నేపథ్యంలో వంట నూనెలు, నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరాన్, ఆఫ్టనిస్థాన్ నుంచి వచ్చే బాదం, పిస్తా, ఖర్జూరా, కివి తదితర ఎండుపళ్ల సరఫరా కూడా నిలిచిపోయింది.

## యాదాద్రీశుని ఆలయంలో అపచారం!

- జాతాశౌచంతో బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ప్రధానార్చకులు
- విషయం వ్యాపించకుండా కప్పిపుచ్చిన అధికారులు
- ఆధ్యాత్మిక వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన వివాదం



**మార్చ్ 11, ప్రభాతవార్త:** ప్రసిద్ధ దేవాలయం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నారసింహ స్వామి దేవస్థానంలో రానురాను సంప్రదాయ పరిస్థితులు అడగంటి పోతున్నాయేమో అనిపిస్తుంది. ఫిబ్రవరి 18 నుంచి 28వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగాయి. అయితే ఆలయ ప్రధానర్చకులకు 25 నుంచి 5వ తేదీ వరకు జాతాశౌచం ఉందని ఆలయ అర్చకులు తెలిపారు. ఇందులో ఉత్సవాల సందర్భంగా ఆగమ శాస్త్రాలకు విరుద్ధంగా జరిగిన ఘటన ఆలయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించే ఈ పవిత్రమైన బ్రహ్మోత్సవాల సమయంలో ఆలయ ప్రధాన అర్చకులకు జాతాశౌచం (పురుడు) ఉన్నప్పటికీ ఆయన పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారనే సమాచారం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో భక్తులు, అర్చక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆలయ సంప్రదాయాలకు విరుద్ధంగా జరిగిన ఈ ఘటనను అధికారులు పట్టించుకోలేదని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. హిందూ ఆగమ శాస్త్రాల ప్రకారం దేవాలయాల్లో జరిగే నిత్యనైవేద్యాలు, ప్రత్యేక పూజలు, ఉత్సవాల నిర్వహణలో అర్చకులు కచ్చితంగా శుద్ధి నియమాలను పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా జాతాశౌచం (పురుడు) లేదా మృతాశోచం (సూతకం) ఉన్న సమయంలో అర్చకులు దేవాలయ పూజలకు, ఉత్సవాలకు దూరంగా ఉండాలని ఆగమ నియమ నిబంధనలు స్పష్టంగా పేర్కొంటాయి. ఈ కాలాన్ని సంప్రదాయంగా అశౌచంగా భావిస్తారు. ఈ సమయంలో దేవాలయ సేవలు చేయడం శాస్త్ర విరుద్ధంగా భావిస్తారు. ముఖ్యంగా బ్రహ్మోత్సవాలు వంటి అత్యంత పవిత్రమైన వేడుకల్లో ఇలాంటి నియమాలను మరింత కట్టుదిట్టంగా పాటించాల్సిన అవసరం ఉందని ఆగమ పండితులు చెబుతున్నారు. ఉదయం నుంచి రాత్రివరకు జరిగే ఈ కార్యక్రమాలను వేలాది మంది భక్తులు దర్శించడానికి వస్తుంటారు. అలాంటి పవిత్రమైన వేడుకల్లో ప్రతి చిన్న ఆచారాన్ని కూడా అత్యంత జాగ్రత్తగా పాటించడం ఆలయ పరంపరలో భాగంగా ఉంటుంది. అయితే ఇటీవల జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఆలయ ప్రధాన అర్చకులకు జాతాశౌచం ఉన్నప్పటికీ వారు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారని తోటి అర్చకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని కొందరు అర్చకులు మొదట్లో అంతర్గతంగా చర్చించుకున్నప్పటికీ తరువాత అది ఆలయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసిందని సమాచారం. కొంతమంది అర్చకులు ఈ విషయాన్ని ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**ఏఈఓ రఘు వివరణ:** అటువంటిదీ ఏమి లేదు. నాకు విషయం తెలియదు అన్ని విషయాలు కనుక్కొని విచారణ చేయించి చర్యలుచేపడతామన్నారు.

**ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు వివరణ:** నాకు అప్పటికి విషయం తెలియదు. అందునా నాకు ఉత్సవాల కంకణం కట్టిన తర్వాత అటువంటివి ఏమి వచ్చిన పట్టించుకోవద్దని శాస్త్రం చెబుతుంది.. 28వ తేదీ తరువాత ఆలయలోకి రాలేదు విగ్రహాలు ముట్టుకోలేదు. తాకలేదు. అని వివరణ ఇచ్చారు.




## ప్రకృతి సేద్యానికి పది లక్షల మంది రైతులు

### - రైతు సాధికార సంస్థ సిఇఓ రామారావు

గుంటూరు, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతం చేసే లక్ష్యంతో ఈ ఏడాది 10 లక్షల మంది రైతులను ఎస్ టు ఎస్ (విత్తనం నుంచి విత్తనం వరకు) రైతులుగా చేయడమే ప్రధాన లక్ష్యమని రైతు సాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రామారావు పేర్కొన్నారు. బుధవారం గుంటూరులోని ఎం.హెచ్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహించిన రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 నుండి ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ద్వారా రాష్ట్రంలో ఇప్పటివరకు 40 లక్షల మంది రైతులను ఈ సాగు పద్ధతిలోకి తీసుకువచ్చామని తెలిపారు. 2026 సంవత్సరాన్ని ఎస్ టు ఎస్ సంవత్సరంగా ప్రకటిస్తున్నామని, ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలోని సిబ్బంది, ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 365 రోజుల పాటు భూమిని పచ్చదనంతో కప్పి ఉంచే ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిని ప్రతి రైతుకూ చేరువ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డి.డి.ఏ. కళ్యాణ్ కుమార్, డి.డి.హెచ్. ప్రభాకర్, రైతు సాధికార సంస్థ అధికారులు రామచంద్రరావు, చంద్రశేఖర్, చక్రవర్తి, గోపీచంద్, రాజేశ్వరరావు, హేమ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## చత్తీస్‌గఢ్‌లో 108 మంది మావోయిస్టుల లొంగుబాటు

### భారీ డంప్ లభ్యం

**చర్ల, మార్చి 11 ప్రభాతవార్త:** చత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో మావోయిస్టు రహిత ప్రాంతంగా మారనుంది. మార్చి 31 నాటి గడువుకు ముందే సాధ్యమయ్యే పరిస్తితులు కనిపిస్తున్నాయి. మావోయిస్టు దంపులో ఎకె 47, ఇన్సాస్ ఎల్ఎంజి బిజిఎల్ సహా 101 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. దేశంలో మొదటి సారిగా మావోయిస్టుల భారీ డంప్‌ను స్వాధీనం చేసుకోవడంలో భద్రతా బలగాలు భారీ విజయాన్ని సాధించాయని చత్తీస్‌గఢ్ డిజిపి అరుణ్ దేవ్ గౌతం అన్నారు. ఆయన మాట్లాడుతూ గడిసిన 26 నెలల్లో ఇప్పటి వరకు 2714 మంది హింసా మార్గాన్ని విడిచిపెట్టి జనజీవం వైపు అడుగులు వేసారని అన్నారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలోని ముఖ్యులైన రాహుల్ ఓయం పాండ్రు కొవ్వాసి జిత్రు ఓయం రాంధర్ ఆలియాస్ బీరు మల్లేస్ వంటి వారు ఉన్నారని పేర్కొన్నారు. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపట్టిన పునారాస విధానం మావోయిస్టుల అణిచివేతకు చేపట్టిన వివిధ కార్యక్రమాల ద్వారా ఈ పక్రియ వేగవంతం అయ్యిందని ఇప్పటికే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు అభివృద్ధి పథంలో దూసుకు పోతున్నారు. ఆదివాసీ గ్రామాల ప్రజలకు కావాల్సిన మౌళిక సదుపాయాలను అందించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని పునర్ఘాటించారు.

## గ్యాస్ సిలిండర్ల సంక్షోభంపై సైబర్ నేరగాళ్ల పంజా

### అమాయకులను బురిడీ కొట్టించేందుకు ఎత్తుగడలు

**హైదరాబాద్, మార్చి 11 ప్రభాతవార్త:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం నేపథ్యంలో భారత్‌లో ఎల్‌పిజి గ్యాస్ సంక్షోభాన్ని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలచుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్న విషయాన్ని సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. గ్యాస్ సిలిండర్ల కోసం ఆయా ప్రాంతాల ప్రజలు క్యూ లైన్‌లో నిలుచున్న ఫోటోలు మీడియాలో రావడం తెలిసిందే. గ్యాస్ సరఫరా లేని కారణంగా అనేక హోటళ్లు మూతపడడం విదితమే. గృహావసరాలకు సరఫరా అయ్యే గ్యాస్ సైతం సవ్యంగా అందకపోవడాన్ని నేరగాళ్లు సొమ్ము చేసుకునేందుకు రంగంలో దిగారు. ఈ క్రమంలో గ్యాస్ సిలిండర్ల కోసం ఎదురుచూసే వారికి, అదనపు సిలిండర్లు కావాలను కునే వారికి మెసేజ్‌లు పంపుతూ లింకులు ఓపెన్ చేయాలని సైబర్ నేరగాళ్లు కోరుతున్నారు. నేరగాళ్ల ఎత్తుగడలపై క్రైం పోలీసులు ప్రజలను అప్రమత్తం చేశారు. తాము పంపిన లింకులను క్లిక్ చేస్తే నిమిషాల వ్యవధిలో గ్యాస్ సిలిండర్లు డెలివరి చేస్తామని నమ్మబలుకుతున్నారని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు. అయితే వీటిని ఎవరైనా నమ్మి లింకులను క్లిక్ చేస్తే బ్యాంకులో వున్న నగదును నేరగాళ్లు క్షణాల్లో కాజేస్తారని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్లను వాడుతున్నారని, గ్యాస్ కంపెనీల పేరిట నకిలీ చిరునామాలను ఉపయోగిస్తున్నారని పోలీసులు తెలిపారు.

## కేంద్రం నిర్లక్ష్యమే గ్యాస్ కొరత: బల్మూరి వెంకట్

**హైదరాబాద్, మార్చి11 ప్రభాతవార్త:** గ్యాస్ కొరతకు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమనీ, ప్రధాని నరేంద్ర మోడీ ఇజ్రాయిల్‌తో అనుసరించిన దౌత్య విధానమే ఈ రోజు చమురు దేశాలు మనకు ఇంధన సరఫరా నిలిపివేశాయనీ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. బుధవారం ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ గ్యాస్ కొరత, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, రాష్ట్రంలో సమస్యపై,హైదరాబాద్‌లో సివిల్ సప్లయి కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. విలేఖరులతో మాట్లాడుతూ చమురు ఉత్పత్తి దేశాలు తటస్థంగా ఉన్న దేశాలకు మాత్రమే ఇంధన సరఫరా చేస్తున్నాయనీ ఆవేదన చెందారు. ఆ దేశాల్లో సమస్య అంత తీవ్రంగా లేదనీ, ఇలాంటి పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం ముందుగా అంచనా వేయకుండా నిరక్ష ్యం చేసిందనీ విమర్శించారు. యుద్ధ సంక్షోభం కొనసాగిన మనకు ఇబ్బంది లేదు, 74 రోజుల పాటు సరిపోయే నిల్వలు ఉన్నాయని చెప్పిన కేంద్రం ఇప్పుడు మాట మార్చిందని ఎద్దేవా చేశారు. దేశంలో గ్యాస్ నిల్వలు లేవని, కమర్షియల్ సరఫరా నిలిపివేసి, డొమెస్టిక్ సప్లయి మాత్రమే కొనసాగించాలని, ఉత్తర్వులు జారీ చేసిందనీ ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్యాస్ కొరత విషయంలో కేంద్రం రాష్ట్రాలను ఇబ్బందుల్లోకి నెట్టుతోందని అన్నారు. కేంద్రం అప్రమత్తంగా వ్యవహరించకపోతే డొమెస్టిక్ వినియోగదారులు ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందనీ వివరించారు.

## రాజధాని అమరావతిలో అగ్నికీలలు

గుంటూరు, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమ రావతిలో భారీ అగ్నిప్రమాదం జరి గింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వెలగపూడి సీడ్ యాక్సిస్ రెడ్డులోని ఎన్9 జంక్షన్ వద్ద అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఎల్అండ్‌టీ సంస్థకు చెందిన ప్లాస్టిక్ పైపులు భారీ శబ్దంతో తగలబడిపోయాయి. పెద్దఎత్తున మంటలు చెలరేగి దట్టమైన పొగ విస్తరించటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆరు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ పైపుల విలువ కోటి రూపాయల పైనే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

**విచారణకు ఆదేశించిన హోం మంత్రి:** రాజధానిలో అగ్నిప్రమాద ఘటనపై హోంమంత్రి అనిత విచారణకు ఆదేశించారు. పైపులకు మంటలు ప్రమాదవశాత్తా అంటుకున్నాయా లేక ఎవరిదైన హస్తం వుందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టనున్నారు. పైపులకు మంట సమీప పొలంలో నుంచి వచ్చిందని ఎల్అండ్‌టీ ప్రతినిధులు అంటున్నారు. పొలంలో నుంచి పైపుల వరకూ గడ్డి పేర్చి నిప్పు పెట్టిన ఆనవాళ్లను సంస్థ ప్రతినిధులు చూపించారు రెండు రోజుల క్రితం పైపులు నిల్వ చేసిన ప్రాంతంలో అధికారులు చెత్తాచెదారాన్ని తొలగించారు. అయినా అగ్నిప్రమాదం జరగడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది రాజధాని నిర్మాణ పనుల శంకుస్థాపనకు ప్రధాని వచ్చిన సమయంలోను ఇదే తరహాలో అగ్నిప్రమాదం జరిగింది.



## కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమా!?

### - భూమన కరుణాకర్‌రెడ్డికి భానుప్రకాశ్‌రెడ్డి సవాల్

తిరుపతి, మార్చి 11 ప్రభాతవార్త: టిటిడి ఛైర్మన్‌గా ఎంత అవినీతికి పాల్పడ్డారో భక్తులకు తెలుసని, అవినీతికి పాల్పడలేదని కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమా? అని భానుప్రకాశ్‌రెడ్డి భూమనకు సవాల్ విసిరారు. అవినీతి జరగలేదని తడిబట్టలతో తాను ప్రమాణం చేస్తానని, కమీషన్లు తీసుకోలేదని ప్రమాణం చేస్తావా? అని కరుణాకర్‌రెడ్డికి సవాల్ విసిరారు. కరుణాకర్‌రెడ్డి కాదు, ఆయన జేమ్స్ బాండ్ 007 అని టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తిరుమలలో ఎప్పుడో జరిగిన విషయాన్ని నేడు జరిగినట్లు సృష్టించే వ్యక్తి, 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పి, రాజకీయ నిరుద్యోగులుగా మార్చినా ఉనికికోసం అబద్దాలు ప్రచారం చేస్తున్నారన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకే వైసీపీ నాయకులు తిరుమల చుట్టూ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ అనకొండలు తిరుమలపై రాజకీయం చేస్తే, ఆది శేషుని దెబ్బ మరోమారు రుచి చూస్తారని ఘాటుగా స్పందించారు. ఒక్కసారి ఆదిశేషుడు తోకతో కొడితేనే 11 సీట్లకు పరిమితం అయ్యారని న్నారు. రవికుమార్‌ను విచారించిన వివరాలను భూమన బయట పెట్టాలని, రవికుమార్ దొంగతనం చేసిన సమయంలో సీసీటీవీ విజువల్స్ ఎందుకు లేవో వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్రమంతటా జనసేన ఆవిర్భావ వేడుకలు

విజయవాడ, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 14న అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, నగరాలు, పంచాయతీల్లో ఘనంగా నిర్వహించాలని పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. పార్టీ పతాకాన్ని జనసైనికులు, వీరమహిళలు, నాయకులు, సభ్యత్వం పొందిన వారి సమక్షంలో ఎగురవేయాలి. సైద్ధాంతిక బలంతో, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఏ విధంగా జనసేన ముందుకు వెళ్తుందో పార్టీ శ్రేణులకు, ప్రజలకు నాయకులు వివరించాలి. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్త దాన శిబిరాలు, ఆహార వితరణ, పర్యావరణ సంబంధిత కార్యక్రమాలను చేపట్టాలి అని పవన్ కల్యాణ్ ఆదేశిం చారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ దఫా రాష్ట్ర స్థాయిలో పిఠాపురంలో నిర్వహించాలని తొలుత నిర్ణయిం చారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉంటాయనే నివేదికను పరిగణనలోకి తీసుకుని అందుకు అనుగుణంగా వేడుకల నిర్వహణ స్వరూపాన్ని మార్చినట్లు జనసేన పార్టీ ఓ ప్రకటనలో పేర్కొంది.

రాష్ట్ర స్థాయి కార్యక్రమం కాకుండా రాష్ట్రమంతటా నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. జనసేన పార్టీ ఉద్యమ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మార్చి 17 వరకు పొడిగించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. సభ్యత్వ నమోదు గడువు పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, పార్టీ ఎమ్మెల్యేలు కోరిన మీదట మార్చి 17 వరకు పొడిగించినట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది.

## రెండు దశల్లో ఐపిఎల్ 28న ప్రారంభం

- బెంగళూరు, హైదరాబాద్ మధ్య తొలి మ్యాచ్ • ఫైనల్ మ్యాచ్ మే 31



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 మేళాకు నగారా మోగింది. క్రికెట్ లవర్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీ ఎల్ 19వ సీజన్ షెడ్యూల్ వచ్చేసింది. బెంగళూరు లోని చిన్నస్వామి స్టేడియంలో జరగబోయే తొలి పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజ ర్స్ బెంగళూరు, పటిష్టమైన సన్ రైజర్స్ హైదరా బాద్ జట్లు తలపడనున్నాయి. ఐపీఎల్ 2026 సీజన్ ఈ నెల 28న అట్టహాసంగా ప్రారంభం కానుంది. గతంలో మార్చి 26నే మొదలవుతుందని వార్తలు వచ్చినప్పటికీ, రెండు రోజులు అటు ఇటుగా ఈ నెల 28ని ఖరారు చేసింది. ఇక ఈ మెగా టోర్నీ ఫైనల్ మ్యాచ్ మే 31న జరగనుంది. సుమారు రెండు నెలల పాటు సాగే ఈ క్రికెట్ జాతరలో మొత్తం 10 జట్లు హోరాహోరీగా తలపడనున్నాయి. అయితే తాజాగా ఐపీఎల్ మొదటి దశ షెడ్యూల్ విడుదలైంది. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కేవలం మొదటి 20 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే ప్రకటించింది. ఎన్నికల తేదీలు ఖరారైన వెంటనే పూర్తి స్థాయి షెడ్యూల్ విడుదల కానుంది. ఈసారి ఐపీఎల్ సీజన్ ఏకంగా 84 మ్యాచ్‌లతో రెండు నెలల పాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించనుంది. మూడు రాష్ట్రాల ఎన్నికల తేదీలు ప్రకటించిన తర్వాత ఐపీఎల్ పూర్తి షెడ్యూల్‌ను వెలువరిస్తామని భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) స్పష్టం చేసింది.

## బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విజయవాడ, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దురాక్రమణ దాడి తర్వాత లాభాపేక్షతో బడా వ్యాపారస్తులు సాగిస్తున్న బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టి సరసమైన ధరలకు వంట గ్యాస్, ఇతర సరుకులు అందించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. వంట గ్యాస్ ధర పెరగడంతో పాటు బ్లాక్ మార్కెటింగ్ వల్ల సిలిండర్లు దొరకని కారణంగా దేశమంతటా నగరాలు, పట్టణాల్లో హోటళ్లు మూతపడడం లేదా కొన్ని రకాల వంటకాలు లభించడం లేదు అని పేర్కొన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే సాధారణమైన తోపుడుబండ్లు, చిన్న చిన్న కాకా హోటళ్ల నిర్వాహకుల బతుకులు బజారున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటిత కార్మికులు, చిరుద్యోగులకు లభించే టీ, టిఫిన్, భోజనం సరసమైన ధరకు దొరక్కుండా పోయే ప్రమాదం ఏర్పడుతుందని, ఈలోగా వాటి ధరలు అమాంతం పెరిగిపోతాయన్నారు. వంట గ్యాస్ కొరత మూలంగా ఆహార లభ్యత మొదలు ఉపాధి వరకు వివిధ రూపాల్లో సమాజంపై దుష్ప్రభావం పడుతుందన్నారు. ఇప్పటికే గృహ వినియోగదారులు సిలిండర్ కోసం బుక్ చేస్తుంటే తగిన స్పందన ఉండడం లేదని తెలిపారు. ఇంతకుముందు బుక్ చేసిన వారికి కూడా ఐదారు రోజులైనా గ్యాస్ బండ రావడం లేదు అని చెప్పారు. ఇళ్లలో, మార్కెట్లలో ఇలాంటి సమస్యలు ఏర్పడుతుండగా వ్యవసాయ రంగానికి కూడా ఎరువుల లభ్యత సమస్యగా మారనుందని వివరించారు. గ్యాస్ కొరత రాకుండా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టాలని శ్రీనివాసరావు కోరారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్ర పండుగగా మొల్ల జయంతి

- రేపు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహణ • విజయవాడలో రాష్ట్ర స్థాయి జయంత్యుత్సవం • బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడి



విజయవాడ, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: మొట్టమొదటి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్ల (మొల్ల మాంబ) జయంతిని ఈ నెల 13న రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వ హించనున్నట్లు మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె వెల్లడించారు. కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ(మొల్ల) తెలుగుజాతి గర్వించదగ్గ రచయిత్రి అని కొనియాడారు. నన్నయ్య ఆదికవి అయితే ఆది కవయిత్రి మొల్ల అని కీర్తించారు. సంస్కృతంలోని వాల్మీకి రామాయణాన్ని తెలుగు భాషలోకి అనువదించారన్నారు. మొల్ల రచించిన ఆ రామాయణం మొల్ల రామాయణంగా ప్రఖ్యాతిగాంచిందన్నారు. మొల్ల స్వస్థలం కడప జిల్లా గోపవరం గ్రామవాసి అని తెలిపారు. 16వ శతాబ్దానికి చెందిన మొల్ల సామాన్యమైన కుమ్మరి కుటుంబంలో జన్మించారన్నారు. తెలుగు సాహిత్యానికి మొల్ల చేసిన సేవలు అభినందనీయమన్నారు. మొల్ల రాష్ట్ర స్థాయి జయంతిని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలోనూ మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వుల్లో కూటమి ప్రభుత్వం పేర్కొందన్నారు. మొల్ల జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్‌కు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

**మంత్రి సవితకు ఆహ్వానం:** ఈ నెల 13న మొల్లమాంబ రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రం నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయి మొల్ల జయంతి కార్యక్రమంలో హాజరుకావాలంటూ మంత్రి ఎస్.సవితను రాష్ట్ర కుమ్మరి, శాలివాహన డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పేరేపి ఈశ్వర్ ఆహ్వానించారు. ఈ మేరకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి ఆయన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలు

- సనాతన ధర్మం ఏ ఒక్కరూ తీసుకురాలేదు • శృంగేరిపీఠాధిపతి విధు శేఖర భారతీ స్వామి

శ్రీకాళహస్తి, మార్చి 11 ప్రభాతవార్త: దేవాలయాలు ఆధ్యాత్మిక నిలయాలని, అయితే నేడు వాటిని కొందరు భక్తిభావం మర్మంతెలియక విహార కేంద్రాలుగా మలచుకుంటున్నారని శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర్ భారతీ స్వామి ఆవేదన వ్యక్తం చేసారు. ధర్మ ఆచరణ అంటే భగవంతుని ఆరాధన చేయటంతో పాటు పరోపకారం ధార్మికతను కల్గి ఉండాలన్నారు. ధర్మానికి పుణ్యక్షేత్రాలు శక్తి కేంద్రాలని ఆ క్షేత్రాల పవిత్రతను కాపాడే విధంగా పాలకులు, అధికారులు, అర్చకులు ఆగమ శాస్త్రాలకు సంప్రదాయాలకు పెద్ద పీట వేయాలని స్వామి పిలుపు నిచ్చారు. బుధవారం ఆయన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని భరద్వాజతీర్థంలోని గంగా సదన్‌లో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ్‌నారాయణ రెడ్డితో కొంత సేపు పలు అంశాలకు సంబంధించి చర్చించారు. అంతకు ముందు శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని సందర్శించారు.

వార్త

ఒక సమాజం దాని నైతిక విలువలను కోల్పోతే అది సర్వస్వం కోల్పోయినట్లే.

- డ్రాయిడెన్

# వంటింటికి 'వార్' దెబ్బ!

పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వంటింటిపై పడింది. యుద్ధ ప్రభావ తీవ్రత పరాకాష్ఠకు చేరింది. దేశవ్యాప్తంగా వంట గ్యాస్‌కు తీవ్ర కొరత ఏర్పడింది. రెండు రోజుల క్రితమే కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరపెంచింది. ఒకపక్క క్రూడా యిల్ బ్యారెల్ ధర పెరిగి అన్ని చమురు ఉత్పత్తుల ధరలు పెరిగాయి. రవాణారంగంపై పెట్రోలు, డీసెల్ ధరల తాకిడి వలన ఆటోలు, టాక్సీలు, రవాణా వాహనాలన్నిటిపై ఛార్జీలు పెంచేశారు. అంతర్జాతీయ విపణిలో బ్యారెల్ 120 డాలర్లు ఉంటే ఇరాన్ ఆధీనంలోని హర్మూజ్ జలసంధి మూసివేయడంలో అక్కడే ఆగివున్న నౌకలు తిరుగుముఖం పట్టాయి. ఇరాన్ చమురు కేంద్రాలపై ఇజ్రాయెల్ విరుచుకుపడడం వల్ల కూడా చమురు ధరలకు రెక్కలొచ్చాయి. తమపై దాడులు ఇలాగే కొనసాగితే బ్యారెల్ చమురును 200 డాలర్లకు పెంచేస్తామని ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇప్పటికే గల్ఫ్ దేశాలకు హెచ్చరిక జారీ చేసింది. కేవలం చమురు రంగమే కాదు చమురు వినియోగంపై ఆధారపడి ఉన్న అని పరిశ్రమలపై యుద్ధ ప్రభావం పడింది. వైరి యుద్ధాల పక్షాల సవాళ్ల పరిస్థితి ఏమోగానీ ఇప్పటికీ మానవ సమాజఅవసరాలు స్తంభించిపోయాయి. భారత దేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ మీద, సాధారణ గృహావసరాల మీద పెద్ద దెబ్బే పడింది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధ సమయంలో కూడా న్యూస్ ప్రింట్, తదితర ఉత్పత్తుల మీద కాస్తంత భారం పడినా అది కేవలం ఆ రంగానికే పరిమితమైంది. అప్పట్లో గృహవినియోగ వస్తువుల మీద చెప్పుకోదగిన ప్రభావం ఏమీలేదు కనుక సామాన్యులు బతికిపోయారు. ఈసారలా కాదు. అమెరికా దూరాలోచన లేని దురాలోచన వల్ల యుద్ధసన్నద్ధత, లేకుండానే ఇరాన్ మీద విరుచుకుపడిన ప్రయత్నం బెడిసికొట్టింది. యుద్ధంలో విజేతలెవరు, పరాజితులెవరో తేలేముందరే సామాన్య ప్రజానీకాన్ని చావుదెబ్బ కొట్టారు. వంటగ్యాస్ తయారీ పరిశ్రమ కుదేలవడంతో గతంలో సిలిండర్ బుకింగ్ వ్యవధి21 రోజులుండగా తాజాగా 25 రోజులకి పెంచారు. దేశంలో పెట్రోల్, డిజిల్ ధరలు అప్రకటితంగా పెరిగాయి. ఇప్పట్లో వాటి ధరలను పెంచబోమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మార్కెట్‌లో ఒడుదొడుకులు కారణంగా పరోక్షంగా చెల్లింపులు పెరగవనే గ్యారెంటీ ఏమీ లేదు. వినియోగదారులు ఇలాంటి భారాన్నుంచి తప్పించుకోలేరు. ఇప్పటికే పప్పుదినుసులు, నూనెగింజలు, వంట నూనెలధరలు పెరగడంతో వంటిళ్లన్నీ ఖాళీ అయిపోయాయి. ఫిబ్రవరి 28న యుద్ధఛాయలు కమ్ముకోగానే ఇరాన్, హర్మూజ్‌ల బంధం తెలిసిన కార్పొరేట్ వ్యాపారులు వారి మాల్స్‌లో ధరలను దాచేయడం, లేదా ఆయిల్ తదితర సరుకుల్లేవని బోర్డులు పెట్టేశారు. వాటిని వెలికి తీసి అమ్మించడంలో ప్రభుత్వం తక్షణ చర్యల్ని చేపట్టడానికి ఆలస్యమైంది. నెల జీతాలు చేతికందేసరికి నిత్యావసర వస్తువుల రేట్లుబాగాపెరిగాయి. 'నో స్టాక్' బోర్డులతో కృత్రిమ కొరత మార్కెట్‌లో తాండవిస్తోంది. హోల్‌సేల్ మార్కెట్‌లకు కూడా ఎలాంటి మినహాయింపు లేదు. ఎల్పీజిస్టాక్ లేక గ్యాస్ కంపెనీలు చేతులెత్తేసే పరిస్థితి కనుచూపు మేరలో కనపడుతోంది. ఇప్పటికే బొంబయి, బెంగళూరు,కోల్‌కతా, చెన్నైవంటి ప్రధాన నగరాల్లో కమర్షియల్ ఎల్పిజి సిలిండర్ల సరఫరా నిలిచిపోయింది. కొన్ని హోటళ్లను తినుబండారాలు ప్రస్తుత ధరలకు అందించలేక మూతబడ్డాయి. ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ఎల్పిజి సిలెండర్లకిచ్చారు. ప్రస్తుతం ఉన్న స్టాక్ అయిపోతే గృహ వినియోగదారుల పరిస్థితి ఇరకాటమే. ఖతార్ నుంచి ఎల్ఎన్‌జి సరఫరా ఆగిపోవడంలో భారతదేశ గృహ వినియోగంపై పెద్ద దెబ్బ తగిలింది. దాదాపు 88శాతం దేశీయ ఇంధన అవసరాలు గల్ఫ్‌దేశాల మీదనే ఆధారపడ్డాయి. మరో ప్రత్యామ్నాయమేదీ కనపడదు. దేశంలోని ముడిచమురు, పెట్రోలియం, ఉత్పత్తులు ఆరువారాల వరకు వస్తాయని కేంద్రమే ప్రకటించింది. కేంద్రం వాణిజ్య సిలిండర్లపై తీసుకున్న నిర్ణయంతో చిన్నమధ్యతరగతి రెస్టారెంట్లు, మెస్‌లు,టిఫిన్ సెంటర్లకు గ్యాస్ బండల కొరత ఏర్పడింది. పెద్దపెద్ద నగరాల్లో 25శాతం హోటళ్లు మూసేసిన వాటిలో ఉంటాయని అంచనా. డొమెస్టిక్ సిలెండర్లకు కొరత రానీకుండా చూడగలమని ప్రభుత్వం ఎంతో ధీమాలో ఉంది. సహజవాయువు దేశీయంగా కొంత తయారవుతుంది. వాటి సరఫరాకు ప్రభుత్వం రేషన్‌పెట్టింది. ప్రభుత్వ ఆదేశాలమేరకు చమురు శుద్ధికర్మాగారాలు ఎల్పీజీ ఉత్పత్తిని 10శాతం పెంచాయి. గ్యాస్ సిలిండర్లు పక్కదారి పట్టకుండా కృత్రిమకొరత సృష్టించే వారిపై అత్యవసర సేవల నిర్వహణ చట్టాన్ని (ఎస్మా)అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కార్పొరేట్ కల్చర్ ఉన్నప్రధాన నగరాల్లో హాస్టళ్లు గ్యాస్ సిలిండర్ల సమస్యను ఎదుర్కొంటున్నాయి. విద్యార్థులకు పూర్తిస్థాయి ఆహార పదార్థాలను అందించలేక విలవిల్లాడుతున్నాయి. దేశంలో రూ.6.6 లక్షల కోట్ల విలువైన హోటల్ పరిశ్రమపై, వంటగ్యాస్ కొరత వలన పరోక్షంగా ఆ రంగానికి చెందిన ఉద్యోగులు ఉపాధి కోల్పోతారని రెస్టారెంట్ల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనదేశంలో 3.1 కోట్ల టన్నుల ఎల్పిజి అవసరముంది. ఇందులో 87 శాతం గృహోపయోగం కోసమే. మిగిలిన వాణిజ్య గ్యాస్ అవసరాలపై కేంద్రం నిషేధం పెట్టడంతో ఆతిథ్యరంగం మూలన పడింది. ఆ అవసరాలపై కోత పెట్టకుండా ఉంటే బాగుండేది. యుద్ధం ఆగినా ఆగకున్నా వంటింటి సెగ ఇప్పట్లో ఆరిపోయేది, ఆగిపోయేది కాదు.

> మీరు తప్ప మీకు శాంతిని ఎవరూ ప్రసాదించలేరు. సిద్ధాంతాలు పాలనలో విజయాన్ని సాధించినప్పుడే, మీకు మానసిక శాంతి లభిస్తుంది.




ఎమర్సన్

> అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.



ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు



### చౌకబారు వ్యాఖ్యలు

మోడీ చాలా రోజుల క్రితమే దేశంలో ముస్లిం జనాభా పెరిగిపోతుంది. అందువలన హిందువులు కూడా ఎక్కువ మందిని కనండి అనిచెప్పాడు. ఆవారసత్వాన్ని చంద్రబాబు పుచ్చుకున్నట్లుగా కనిపిస్తోంది. అది మంచి ఆలోచన కాదు. పిల్లలను ఎక్కువ మందిని కనండి, అవసరమయితే త్రిబుల్ బెడ్‌రూం ఉన్న ఇల్లు కట్టిస్తాం, బియ్యం కోటాఎక్కువ ఇస్తాం, ఒక్కోపిల్లలకు 25 వేలు ఇస్తాం అని చంద్రబాబుగారు నిన్న చెప్పటం ఆయనహుందాను తగ్గించేవిగాఉన్నాయి. ఒకరిద్దరిని కన్నవారేసరిగా చదివించలేక మధ్యలోనే చదువులాపేస్తున్నారు. ఆర్థికభారంతో ఆస్తులు అమ్ముకుంటున్నారు. పూర్వం ఉమ్మడి కుటుంబాలుండేవి. ఆరోజుల్లో పరిస్థితులు వేరు. నలభై సంవత్సరాల క్రితమే ఒకరు లేక ఇద్దరుచాలు అని కుటుంబనియంత్రణ పాటించమని ప్రభుత్వం చెప్పింది. జనాభా పెరిగితే సమస్యలు పెరుగుతాయి. దీనిపై ఆలోచించాలి.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశంజిల్లా

### గిరిజన ఫ్రీడమ్ స్కూల్స్?

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గిరిజన ఫ్రిడమ్స్ స్కూల్స్‌ను మరింతగా అభివృద్ధిచేయవలసిన అవసరంఉంది. బడ్జెట్ లోప్రత్యేకంగానిధులుకేటాయించాలి. విద్యార్థులకు ఆటలు, పాటలు, డ్రాయింగ్, మ్యూజిక్, సంస్కృతిక కార్యక్రమంలు ఏర్పాటు చేయాలి. చారిత్రాత్మకమైన ప్రదేశాలను సందర్శించే విధంగా నామమాత్రపు ఫీజుతో విహారయాత్రలు ఏర్పాటుచేయాలి. గిరిజన విద్యార్థులకుసంస్కృతి, సాంప్రదాయాలు మొదటగా నేర్పి విద్యవైపు వారి దృష్టి మళ్లించే విధంగా చూడాలి.

-రాపాక రవీందర్, జనగాం

### డబుల్ బెడ్‌రూమ్స్ కేటాయించాలి

ప్రస్తుతంమున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేటి వరకైనా గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇప్పుడు ప్రస్తుతంఉన్నప్రభుత్వం ఇవ్వటానికేఅభ్యంతరం ఏమిటి? ఓట్ బ్యాంకింగ్ తప్ప మరోటి లేదా అయినా లబ్ధిదారులకు కేటాయించాల్సిన కేటాయిస్తే తమకేమి నష్టం వాటిల్లుందోఅర్థం కావటంలేదు. ప్రజలను ఒక రకమైన ఆందోళనకు గురి చేస్తున్నారు. గతప్రభుత్వంలో డబుల్ బెడ్రూం లోనిర్మించి ఇంతవరకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు.

- సి. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### భారత్‌కు కొత్త సవాళ్లు

**భారతదేశం** శతాబ్దాలుగా వివిధ సంస్కృతులు, భిన్న ప్రజల సమ్మేళనంగా నిలిచింది. ప్రపంచంలో ఎక్కడైనాసంక్షోభం వచ్చినప్పుడు మానవతా దృక్పథంతో ఆశ్రయం కల్పించిన దేశంగా భారత్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అయితే ఇటీవల ఈశాన్య భారతంలో మయన్మార్, మణిపూర్ ప్రాంతాల నుంచి వచ్చిన శరణార్థుల పరిస్థితి మాత్రం అనిశ్చితితో నిండినదిగా మారింది. వారి జీవితం భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న మధ్యలో నిలిచిపోయినట్లుగా కనిపిస్తోంది. మయన్మార్‌లో రాజకీయ అస్థిరత, సైనిక పాలన, అంతర్గత ఘర్షణలు తీవ్రంగా పెరగడంతో వేలాది మంది ప్రజలు సురక్షితమైన ఆశ్రయం కోసం పొరుగు దేశాల వైపు తరలివచ్చారు. భారతదేశంలోని మిజోరాం, మణిపూర్, నాగాలాండ్ వంటి ఈశాన్యరాష్ట్రాలు భౌగోళికంగా మయన్మార్‌కు సమీపంలో ఉండటంతో అక్కడికి శరణార్థుల ప్రవాహం పెరిగింది. మరోవైపు మణిపూర్‌లో గత కొంతకాలంగా కొనసాగుతున్న జాతి ఘర్షణలు కూడా అనేక కుటుంబాలను తమ ఇళ్లను విడిచిపెట్టే పరిస్థితికి నెట్టాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### హెల్మెట్ తప్పనిసరి

**ఇటీవల** సంభవిస్తున్న రోడ్‌ప్రమాదాల్లో హెచ్చుశాతం మోటార్ వాహన చోదకులు సరైన హెల్మెట్ ధరించక, లేక ఉన్నప్పటికీ ఎదుటి వాహనాన్ని ఢీకొట్టడం వల్ల తలభాగం మరణానికి కారణమవుతుంది. ఇది ఒక రక్షణకు ముఖ్య వస్తువు, దాన్ని ధరించడం తప్పనిసరి చేయాలి. అందరూ విధిగా చేస్తే ట్రాఫిక్ పోలీసులు లేని వారికి తనిఖీ అవసరమే లేదు. తిరుపతిలో దీన్ని ప్రత్యేకంగా ప్రచార భాగంలో ప్రత్యేకంగా తయారుచేసిన హెల్మెట్లను బంక్ ద్వారా అమ్మకం చేశారు. ఇదిరెండు లాభాలు ఇస్తుంది. మిగిలినజిల్లాల్లో కూడా ఇదేచేస్తే దాన్నేకొని ధరిస్తారు.

- బొల్లోజు మేఘానాథం, విశాఖపట్నం

### సమాజానికి కొత్త సవాలు

**నేటికాలంలో** సోషల్ మీడియా మన జీవితాల్లో భాగమైపోయింది. సమాచారం పంచుకోవడం, వ్యక్తిగత అభిరుచులను వ్యక్తపరచడం, ప్రపంచంతో మమేకం కావడం వంటి అనేక ప్రయోజనాలను ఇది అందిస్తోంది. అయితే అదే సమయంలో దీనిదుర్వినియోగం సమాజానికి తీవ్రమైన ప్రమాదాలను కూడా సృష్టిస్తోంది. ముఖ్యంగా వదంతులు, అబద్ధపు వార్తలు వేగంగా వ్యాప్తి చెందడానికి సోషల్ మీడియా వేదిక అవుతోంది..

- కె.రామారావు, నల్గొండజిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రాణాంతకంగా మారుతున్న 'ఫైర్‌వర్క్స్'!

**చాలా సంవత్సరాల క్రిందట, దీపావళి మందులషాపులు ఊరికి దూరంగా ఉండేవి. పొరపాటున ప్రమాదాలు సంభవిస్తే నష్టాలు తక్కువగా ఉండే విధంగా జాగ్రత్త చర్యలు అవలంబిస్తున్నారని అర్థమయ్యేది. పోలీసులు ఆ షాపుల దగ్గర ఎక్కువ సంఖ్యలో కనపడుతూ వ్యాపారస్థులు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారా లేదా అని తని ఖీలు మాటిమాటికి చేస్తుండేవారు. టైం ప్రకారం షాపులు తెరవటం, మూసివేయటం జరిగేది. షాపు, షాపుకు మధ్య ఎంత మంది దీపావళి సామాగ్రిని కొనుక్కోటానికి వచ్చినా తిరగటానికీ, అవసరమొస్తే వెంటనే వెళ్లి పోవటానికి వీలుగా ఏర్పాట్లు ఉండేవి. ప్రస్తుతం ఎక్కువ దుకాణాలు రద్దీగా ఉన్న స్థలాల్లో కరువవుతున్నాయి. ఈ ప్రేలుడు పదార్థాలు తయారీ చేసే యూనిట్లు కూడా ఊళ్లకు దూరంగా ఉండటం తో ప్రమాదాలు జరిగినా నష్టం తక్కువగా ఉండేది. ఫైర్ ఇంజన్లు అందుబాటులో ఉండేవి. సంతోషం కోసం ఉండే టపాసులు, షాపులూ, సంతాపాన్ని కలిగించని రీతిలో ఉండటం అవశ్యం అని అనుభవాలు చెప్తున్నాయి.**



రావులపాటి సీతారాంరావు

టపాసులు ప్రాణాంతకంగా మారాయి. రక్షణకు సంబంధించిన నియమాలు పాటించకుండా బజారు దుకాణాల్లో అమ్మేసరుకుల్లా, ప్రతిచోటా, దీపావళి పేరుతో వచ్చే మందులూ, ఫైర్‌వర్క్స్, టపాసులూ తయారు చేయడానికి సాంకేతికంగా నిపుణతలేని మామూలు పనివారితో, పేదవారితో పబ్బంగడుపుకుంటూ వ్యాపారం చేస్తున్న వారిని తక్షణం నియంత్రించకపోతే ఈ ప్రమాదాల్లో పెక్కుమంది ప్రాణాలు కోల్పోయే అవకాశం రోజురోజుకూ పెరుగుతున్నది. జాగ్రత్తలు తీసుకోవటమనేది లేని వ్యాపారంగా ఈ ప్రమాదకరమైన బాణాసంచా తయారీ – తయారయింది. 'హై రిస్క్ ఇండస్ట్రీగా మారిన ఈ బాణా సంచా వ్యాపారాన్ని నియంత్రించకపోతే, అగ్ని ప్రమాదాల సంఖ్యతో పాటు ప్రాణాలు కోల్పోయే వారిసంఖ్య రోజురోజుకూ పెరగక తప్పదు. అక్టోబర్ నెల 2025 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లాలో గ్రాండ్‌ఫైర్ వర్క్స్ పెద్ద విస్ఫోటనకు గురై పదిమంది ప్రాణాలను బలిగొంది. శ్రీ సూర్యా ఫైర్ క్రాకర్స్ వేటపాలెం గ్రామంలో ప్రేలిపోవటం వల్ల అక్కడున్న ఇరవైమంది ప్రాణాలు నిష్కారణంగా కోల్పోయారు. ఈరెండు యూనిట్లు ఒకే వ్యక్తికి చెందినవని తర్వాత గుర్తించారు. నిజానికి వేటపాలెం యూనిట్‌ను ఆపివేయమని జనవరి నెలలోనే ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా పండగ ఆర్డర్లతో మునిగితేలుతున్న ఈ సంస్థవల్ల మరో గండం ప్రాణాంతకంగా మారటం శోచనీయం. దీపావళి మందులు ఎవరికైనా అమిత ఇష్టాన్ని కలుగచేస్తాయి. కానీ గడిచిన రోజుల్లో ప్రేలుడు పదార్థాలను ఈ మందులలో చాలా తక్కువగా వాడటం వల్ల ఆపద కలగని పరిస్థితులుండేవి. కాకరపువ్వొత్తులు, వెన్నెల మడుగులు, బొంగరాలు, సీమటపాకాయలతో ఏ వీధి చూసినా ఆ రోజులో సందడి సందడిగా ఉండటంతోపాటు పండగలంటే అమిత ఆనందాన్ని ముఖ్యంగా పిల్లలకు కలిగించేవి. మహారాష్ట్రలోని నాగపూర్, తమిళనాడులోని శివకాశీ ఈ ఫైర్‌వర్క్‌కు ప్రసిద్ధి. ఆ రోజుల్లో పెద్దగా 'సేఫ్టీ' నియమాలు పాటించకపోయినా, ప్రేలుడు పదార్థాల వాడకం ఈ ఫైర్‌వర్క్ తయారీలో తక్కువ పాళ్లలో ఉండటం చేత ప్రమాదాలు పెద్దస్థాయిలో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయే రీతిలో ఉండకపోయేవి! కొన్ని జరిగినా, మీడియా ఆ రోజుల్లో ఈ ప్రమాదాలకు ఇచ్చే ప్రచారంవల్ల, ప్రాణనష్టం, ఆస్తినష్టం, సంభవిస్తాయన్న ఎరుకతో ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకొనేవి. అప్పుడు ఈ ఫైర్‌వర్క్స్ మీద నిఘా వేసే అధికారులు కూడా బాధ్యతగా వ్యవహరించి చర్యలు తగు రీతిలోఎప్పటికప్పుడు తీసుకుంటుండేవారు. ఈ రోజుల్లో జరిగే ప్రమాదాలను తల్చుకుంటేనే వొళ్లు గగుర్పొడుస్తుంది. నాగపూర్‌లో ఈ మధ్య ఈ యస్.బి.ఎల్



ఎనర్జీ ఫ్యాక్టరీలో జరిగిన ప్రేలుడు ప్రమాదంలో 90 మంది పనిచేసేవారు మరణించారు. అందులో చాలా మంది మహిళలు! యూనిట్లలోనే గత రెండు సంవత్సరాలలో జరిగిన ప్రమాదాలలో ఇరవై మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు! ఇద్దరు సోలార్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో కూడా చనిపోయిన సంగతి కూడా గుర్తుకు తెచ్చుకోవాలి. ఈ సోలార్ యూనిట్ చాలా పెద్దది. దీని అధిపతికి పద్మశ్రీ పురస్కారం కూడా లభించింది. అక్కడి స్థానికులు ఈ పురస్కారం సంగతి చెబుతూ, దాన్నిబట్టే తెలుస్తుంది. ఎలాంటి రాజకీయ మూలాలున్నాయో ఆ అధిపతికి అని ఎగతాళిగా మాట్లాడుతారు. ఈ రాజకీయ సంబంధాల వల్ల ఇలాంటివన్నీ చట్టాలను అమలు చేసే అధికారులు, చూసీచూడనట్లు ఉండటం అలవాటు అయిపోయింది. దానివల్ల అలాంటి యూనిట్లలో పనిచేసే ఉద్యోగస్థులకు రక్షణ కరువయిపోయింది. ప్రభుత్వాలు పట్టించుకున్నా ప్రమాదాలు తగ్గుమొహం పట్టడం లేదన్నది స్థానికుల బాధ. తగురీతిలో రక్షణ చర్యలతోపాటు యూనిట్ల అధిపతుల మీద చట్టప్రకారం చర్యలు తీసుకోకపోవటం వల్ల ప్రమాదాల దారి ప్రమాదాలదీ, వ్యాపారాల దారి, వ్యాపారాలదీ అవుతున్నదని ప్రజలు వాపోతున్నారు. నిజానికి నాగపూర్‌లోనే పెట్రోలియం, ప్రేలుడుకు సంబంధించిన రక్షణ చర్యలు తీసుకొనే సేఫ్టీ ఆర్గనైజేషన్ ఉంది. ఈ సంస్థలో పనిచేసే వారి నిర్వాకానికి ఫలితంగా ఎంతో మందిపై సిబిఐ విచారణలు కూడా జరిగాయి. లైసెన్సులు, లంచాలు తీసుకొని జారీ చేస్తున్నారనే అభియోగంతో పి.ఇ.యస్.ఓ అధికారుల మీద ఇలాంటి విచారణలు జరిగినా, ఆశించిన రీతిలో ప్రేలుళ్లు, ప్రాణనష్టం ఆగటంలేదు. చేయాల్సింది రక్షణచర్యల విధానాల గురించి సమగ్రంగా సమీక్షించటంతోపాటు, ఇలాంటి సంస్థలలోని పై అధికారులు ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారనే విషయాన్ని కూడా లోతుగా అధ్యయనం చేసి కావల్సిన రీతిలో గైడ్‌లైన్స్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బిజినెస్ చేసే వారు ఏ విధంగా శ్రద్ధపెట్టి రక్షణ నిమిత్తం సౌకర్యవంతమైన ప్రమాదరహితమైన వాతావరణాన్ని కల్పిస్తున్నారో కూడా విచారణలలో తేల్చి తగు సూచనలతోపాటు, ఉల్లంఘించిన వ్యాపారస్థులపై లైసెన్సులు రద్దు చేయడంతోపాటు క్రిమినల్ చర్యలు కూడా తీసుకున్నప్పుడే ఈ ప్రేలుళ్లకు సంబంధించిన ప్రాణనష్టం, ఆస్తినష్టం ఆగదు. శివకాసిలో ఇలాంటి ప్రమాదాలు జరిగే యూనిట్లలో బాలకార్మికులు పనిచేయకుండా చూడటంతోపాటు ప్రమాదాల నివారణ నిమిత్తం కఠినమైన చర్యలు ప్రభుత్వాలు తీసుకోవడంతో, ప్రేలుళ్ల సంఖ్యతగ్గి, ప్రాణనష్టం కూడా ఈ మధ్యన తగ్గిపోవటం చెప్పుకోవాల్సిన అవసరం ఉంది. చాలా సంవత్సరాల క్రిందట, దీపావళి మందులషాపులు ఊరికి దూరంగా ఉండేవి. పొరపాటున ప్రమాదాలు సంభవిస్తే నష్టాలు తక్కువగా ఉండే విధంగా జాగ్రత్త చర్యలు అవలంబిస్తున్నారని అర్థమయ్యేది. పోలీసులు ఆ షాపులదగ్గర ఎక్కువ సంఖ్యలో కనపడుతూ వ్యాపారస్థులు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారా లేదా అని తనిఖీలు మాటిమాటికి చేస్తుండేవారు. టైం ప్రకారం షాపులు తెరవటం, మూసివేయటం జరిగేది. షాపు, షాపుకు మధ్య ఎంత మంది దీపావళి సామాగ్రిని కొనుక్కోటానికి వచ్చినా తిరగటానికీ, అవసరమొస్తే వెంటనే వెళ్లిపోవటానికి వీలుగా ఏర్పాట్లు ఉండేవి. ప్రస్తుతం ఎక్కువ దుకాణాలు రద్దీగా ఉన్న స్థలాల్లో కరువవుతున్నాయి. ఈ ప్రేలుడు పదార్థాలు తయారీ చేసే యూనిట్లు కూడా ఊళ్లకు దూరంగా ఉండటంతో ప్రమాదాలు జరిగినా నష్టం తక్కువగా ఉండేది. ఫైర్ ఇంజన్లు అందుబాటులో ఉండేవి. సంతోషం కోసం ఉండే టపాసులు, షాపులూ, సంతాపాన్ని కలిగించని రీతిలో ఉండటం అవశ్యం అని అనుభవాలు చెప్తున్నాయి. •

# సమయాన్ని హరించేస్తున్న సోషల్ మీడియా!

తరిగోపుల నారాయణస్వామి

ఇప్పటి ఆధునిక కాలంలో మనిషి జీవన విధానాన్ని అత్యంత వేగంగా మార్చిన పరిణామాలలో ఒకటి సామాజిక మాధ్యమాల విస్తరణ. చేతిలో చిన్న మొబైల్ ఫోన్ ఉంటే ప్రపంచం మొత్తం మన ముందే ఉన్నట్లు అనిపించే స్థితి ఏర్పడింది. ఒకప్పుడు వార్తలు తెలుసుకోవడానికి పత్రికలు చదవడం, పెద్దలతో చర్చించడం, పుస్తకాలు పరిశీలించడం వంటి పద్ధతులు ఉండేవి. ఇప్పుడు అనేక విషయాలు కొన్ని క్షణాల్లోనే మన చేతిలోకి చేరుతున్నాయి. ఈ మార్పు మనిషికి అనేక సౌకర్యాలను అందించినప్పటికీ అదే సమయంలో కొత్త సమస్యలను కూడా తీసుకొచ్చింది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలపై ఎక్కువగా ఆధారపడటం వల్ల మన జీవన శైలి క్రమంగా మారిపోతున్నది. సామాజిక మాధ్యమాలు మొదట్లో మనుషుల మధ్య సంబంధాలను బలపరచడానికి ఉపయోగపడే సాధనాలుగా కనిపించాయి. దూర ప్రాంతాల్లో ఉన్న స్నేహితులు, బంధువులు సులభంగా ఒకరితో ఒకరు మాట్లాడుకునే అవకాశం ఏర్పడింది. సమాజంలో జరుగుతున్న విషయాలను వెంటనే తెలుసుకునే అవకాశం కూడా కలిగింది. విద్యార్థులకు కూడా కొత్త విషయాలను తెలుసుకోవడానికి విస్తృత అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. కానీ కాలక్రమేణా ఈ సౌకర్యం అలవాటుగా మారి, కొందరికి వ్యసనంగా మారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పుడు చాలా మంది ఉదయం లేవగానే ముందుగా మొబైల్ ఫోన్ వైపు చూస్తున్నారు. రాత్రి పడుకునే వరకు కూడా అదే అలవాటు కొనసాగుతోంది. రోజులో ఎంత సమయం గడిచిపోయిందో కూడా తెలియకుండా సామాజిక మాధ్యమాలలో మునిగిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా యువతలో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. చదువుకు కేటాయించాల్సిన సమయం, కుటుంబంతో గడపాల్సిన సమయం, విశ్రాంతి తీసుకోవాల్సిన సమయం అన్నీకూడా కొన్నిసార్లు ఈమాధ్యమాలకే వెచ్చించబడుతున్నాయి. ఈ పరిస్థితి మన ఆరోగ్యం పైనా ప్రభావం చూపుతోంది. ఎక్కువసేపు మొబైల్ స్క్రీన్ వైపు చూడడం వల్ల కళ్లకు ఇబ్బందులు కలుగుతున్నాయి. శారీరక కదలికలు తగ్గిపోవడం వల్ల అలసట, నిద్రలేమివంటి సమస్యలు కూడా వస్తున్నాయి. అంతేకాదు ఇతరుల జీవితాలను నిరంతరం చూసి మన జీవితాన్ని పోల్చుకోవడం వల్ల మానసిక ఒత్తిడి కూడా పెరుగుతోంది. కొన్నిసార్లు అసత్య సమాచారం వేగంగా వ్యాపించి సమాజంలో అపోహలు కలిగించే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల నుండి కొంతకాలం దూరంగా ఉండడం అనే ఆలోచన ప్రాధాన్యం పొందుతోంది. దీనినే సామాజిక మాధ్యమాల విశ్రాంతి అని చెప్పవచ్చు. అంటే రోజులో కొంత సమయం లేదా కొన్నిరోజులు పూర్తిగా ఈ మాధ్యమాల నుండి దూరంగా గడపడం. ఇలా చేయడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. మన చుట్టూ ఉన్న నిజమైన ప్రపంచాన్ని మరింతగా అనుభవించే అవకాశంకలుగుతుంది. సామాజిక మాధ్యమాల నుండి కొంత దూరంగా ఉన్నప్పుడు మనకు కొత్త అనుభవాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా మాట్లాడుకునే అవకాశం పెరుగుతుంది. పుస్తకాలు చదవడానికి సమయం దొరుకుతుంది. ప్రకృతి మధ్యలో నడవడం, ఆలోచనలు చేసుకోవడం, సృజనాత్మక పనులు చేయడం వంటి అలవాట్లు పెరుగుతాయి. ముఖ్యంగా విద్యార్థులకు ఇది ఎంతో ప్రయోజనకరం. వారు చదువుపై మరింత ఏకాగ్రత సాధించగలుగుతారు. ఇంకా ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే మనుషుల మధ్య ప్రత్యక్ష సంబంధాలు బలపడతాయి. ఒకప్పుడు పల్లెల్లో, పట్టణాల్లో ప్రజలు ఒకరితో ఒకరు కలుసుకుని మాట్లాడుకునే సంస్కృతి ఉండేది. ఇప్పుడు ఆ సంస్కృతి కొంత తగ్గిపోయింది. సామాజిక మాధ్యమాల విశ్రాంతి తీసుకోవడం ద్వారా మళ్లీ ఆ ఆత్మీయత పెరిగే అవకాశం ఉంది. అయితే సామాజిక మాధ్యమాలను పూర్తిగా వదిలేయడం అవసరం లేదు. అవి సరైన విధంగా ఉపయోగిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. ముఖ్యమైనది సమయ నియంత్రణ. రోజులో ఎంత సమయం వినియోగించాలి అనే విషయం ప్రతి ఒక్కరూ నిర్ణయించుకోవాలి. అవసరం లేని విషయాలపై ఎక్కువ సమయం గడపకుండా జాగ్రత్త పడాలి. ముఖ్యంగా పిల్లలు, యువత ఈ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి సరైన మార్గదర్శనం ఇవ్వాలి. సాంకేతిక అభివృద్ధి మనిషి జీవితాన్ని సులభతరం చేయడానికి వచ్చినదే కానీ మన జీవితాన్ని పూర్తిగా ఆక్రమించడానికి కాదు అనే విషయం గుర్తుంచుకోవాలి. మన చేతిలో ఉన్న సాధనాలను మనమే నియంత్రించాలి కానీ అవి మనలను నియంత్రించే పరిస్థితి రాకూడదు. అందుకే అప్పుడప్పుడు సామాజిక మాధ్యమాల నుండి కొంతవిశ్రాంతి తీసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరం. అది మన ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా మన ఆలోచనలను కూడా మరింత స్పష్టంగా మార్చుతుంది. మన సమయాన్ని సార్థకంగా వినియోగించడం మన చేతుల్లోనే ఉంది. కుటుంబం, సమాజం, ప్రకృతి, పుస్తకాలు ఇవన్నీ మన జీవితాన్ని సంపన్నం చేసే అంశాలు. వాటికి తగిన సమయం కేటాయించినప్పుడే మన జీవితం సమతుల్యంగా ఉంటుంది. అందువల్ల సాంకేతిక సాధనాలను జాగ్రత్తగా ఉపయోగిస్తూ, అప్పుడప్పుడు వాటి నుండి దూరంగా ఉండే అలవాటు పెంపొందించుకోవడం ద్వారా మన జీవితం మరింత ఆరోగ్యకరంగా సంతోషకరంగా మారుతుంది. •

# స్వచ్ఛమైన 'మంచినీరు' మనకు లభించదా?

ముద్దం నరసింహ స్వామి

ప్రకృతిలోని ప్రతి జీవికి నీరు ప్రాణాధారం. కానీకోట్లాది ప్రజలు నివసించే ఆధునిక సమాజాల్లో కూడా స్వచ్ఛమైన తాగునీరు అందించడం ఇంకా పెద్ద సవాలుగానే మిగిలింది. గ్రామాల నుంచి మహానగరాల వరకు పరిశుభ్రమైన నీటి సరఫరా వ్యవస్థలు పలు చోట్ల విఫలమవుతున్నాయి. అధిక జనాభా, బలహీనమైన మౌలిక వసతులు, పరిపాలనా నిర్లక్ష్యం కలిసి ఈసమస్యను తీవ్రమైనప్రజారోగ్య సంక్షోభంగా మారుస్తున్నాయి. స్వచ్ఛమైన తాగునీటిని పొందడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని భారత అత్యున్నత న్యాయస్థానం పలుమార్లు స్పష్టం చేసింది. జీవించే హక్కులో పరిశుభ్రమైన పరిసరాలు, ఆరోగ్యకర వాతావరణం అంతర్భాగమని కూడా పేర్కొంది. అయితే ఈ గొప్ప మాటలు చాలా వరకు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ప్రభుత్వాల స్థానిక సంస్థల అలసత్వం, పర్యవేక్షణ లోపాలు కలిసి తాగునీటిని విషతుల్యంగా మార్చుతున్నాయి. దేశవ్యాప్తంగా తరచూ వెలుగుచూస్తున్న డయేరియా, కలరా, లెప్టోస్పిరోసిస్ వంటివ్యాధుల కేసులు ఈ వైఫల్యానికి నిలుస్తున్నాయి. వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ సమస్య మరింత తీవ్రతరమవుతోంది. బెంగళూరు, గాంధీనగర్, గ్రేటర్ నోయిడా వంటి మహానగరాల నుంచి హైదరాబాద్, ఆదిలాబాద్, విజయవాడ, గుంటూరు, ఆళ్లగడ్డ వంటి పట్టణాల వరకు తాగునీటి కాలుష్యం ప్రజారోగ్యాన్ని సంక్షోభంలోకి నెడుతోంది. మలిన జలాల కారణంగా విజయనగరం జిల్లాలో డయేరియా విజృంభించగా, తాజాగా శ్రీకాకుళం జిల్లాలో కలకలం రేపుతోంది. దేశంలోని అనేక ప్రాంతాల్లో పాతబడిన పైప్‌లైన్లు పగుళ్లబారిపోయి డ్రైనేజీల్లోంచి వెళ్తున్నాయి. దీంతో మురుగు నీరు తాగునీటిలో కలవడం సాధారణమైపోయింది. బోర్ల చుట్టూ చెత్త పేరుకుపోవడం, నీటి ట్యాంకులు శుభ్రం చేయకపోవడం, క్లోరినేషన్ సక్రమంగా జరగకపోవడం వంటి నిర్లక్ష్యాలు ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్నాయి. గణాంకాలు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టంగా తెలియజేస్తున్నాయి. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా దాదాపు 1.54 కోట్ల డయేరియా కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 3.95 లక్షలు, తెలంగాణలో 3.29 లక్షల కేసులు నమోదవడం ఆందోళనకరం. 2021లో 217కలరా కేసులు నమోదవగా, గత ఏడాదికి అవి 22 రెట్లుపెరగడం పరిస్థితి నియంత్రణలో లేదని సూచిస్తోంది. లెప్టో స్పైరోసిస్ కేసులు కూడా గణనీయంగా పెరిగాయి. అపరిశుభ్రమైననీటి వల్ల ఏటా కోట్లాది మంది అనారోగ్యానికి గురవుతున్నారని అంచనాలు చెబుతున్నాయి. ప్రతి ఇంటికీ శుద్ధమైన నీరు అందిస్తే లక్షలాది అర్ధాంతర మరణాలను నివారించవచ్చని



ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే హెచ్చరించింది. అయినప్పటికీ పాలకుల అలక్ష్యం మారడం లేదు. వేసవి కాలంలో బ్యాక్టీరియా వేగంగా వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నీటి శుద్ధిచర్యలు మరింత కట్టుదిట్టంగా ఉండాలి. కానీ అనేక ప్రాంతాల్లో నీటినమూనాల పరీక్షలు కూడా సక్రమంగాజరగడం లేదు. ఇటీవల నిర్వహించిన సర్వేలోగృహాలకు సరఫరా అవుతున్న నీటిలోదాదాపు 24శాతం నమూనాలు ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. 485 పట్టణాల్లో కేవలం 46ప్రాంతాల్లో మాత్రమే నాణ్యమైన నీరు అందుతున్నట్లు వెల్లడైంది. ఒకవైపు దేశం అంతరిక్ష రంగంలో విజయాలను సాధిస్తోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో కీలక స్థానాన్ని సంపాదిస్తోంది. కానీ అదే సమయంలో ప్రాథమికమైన తాగునీటి భద్రతను నిర్ధారించలేకపోవడం అభివృద్ధిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. సాంకేతికంగా ముందంజలో ఉన్న దేశం ప్రజలకు సురక్షిత తాగునీరు అందించలేకపోతే ఆ పురోగతికి అర్థమేంటి? ఈ సమస్యకు పరిష్కారం అసాధ్యం కాదు. నీటి సరఫరా వ్యవస్థలను సమగ్రంగా పునరుద్ధరించడం అత్యవసరం. పాతపైప్‌లైన్లను తక్షణమే మార్చాలి. డ్రైనేజీ, మంచినీటి లైన్లను వేరు చేసి సాంకేతికంగా బలోపేతం చేయాలి. నీటి ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్, నాణ్యత పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలి. ప్రతిమునిసిపాలిటీ, పంచాయతీ స్థాయిలో నీటి నాణ్యత పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసి పరీక్షా ఫలితాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించా లి. గ్రామీణ ప్రాంతాల్లో బోర్లచుట్టూ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి. స్వచ్ఛతా కార్యక్రమాలకు పెట్టే ప్రతిరూపాయి ఆరోగ్య వ్యయాలను తగ్గించి సమాజానికి అనేక రెట్లులాభం చేకూరుస్తుందని అంచనాలు చెబుతున్నాయి. అంటే ఇది ఖర్చుకాదు దీర్ఘకాలిక పెట్టుబడి. ప్రజారోగ్యంపై పెట్టుబడి పెట్టడం ద్వారా వైద్య ఖర్చులు తగ్గుతాయి. పనిదినాల నష్టం తగ్గుతుంది, ఉత్పాదకత పెరుగుతుంది. దేశ ఆర్థికాభివృద్ధికీ ఇదికీలకం. ఇదే సమయంలో జల వనరుల సంరక్షణ కూడా సమానంగా ముఖ్యమైనది. పూడుకుపోయిన కుంటలు, చెరువులను పునరుద్ధరించడం, అడవులను పెంచడం, వాన నీటి సంరక్షణను తప్పనిసరి చేయడం వంటి చర్యలు చేపట్టాలి. నగరాల్లో కురిసే వాన నీరు డ్రైనేజీల్లోకిపోకుండా భూగర్భంలోకి ఇంకేలా వ్యవస్థలు ఏర్పాటు చేయాలి. గ్రామస్థాయిలో నీటి కుంటలు, చెరువుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. సేంద్రియ వ్యవసాయం వంటి పద్ధతుల ద్వారా నీటి వినియోగాన్ని కూడా సమతుల్యం చేయాలి. స్వచ్ఛమైన నీరు కేవలం ఒక సేవ కాదు, అది జీవనాధారం. దాన్నిఅందించడం ప్రభుత్వాల రాజ్యాంగబద్ధ కర్తవ్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నిధులు, సాంకేతిక సహకారం అందించాలి. స్థానికసంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రజలు కూడా నీటివనరుల సంరక్షణలో భాగస్వాములు కావాలి. సాంకేతికంగా గానీ, పలురంగాల్లో గానీ అభివృద్ధి ఎంత సాధిస్తున్నా, తాగునీరు కలుషితమై ప్రజలు ప్రాణాలు కోల్పోతే ఆ పురోగతికి విలువ ఉండదు. జీవించే హక్కు సజీవ సత్యంగా నిలవాలంటే ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందాలి. అదే నిజమైన అభివృద్ధి. •

# గల్ఫ్ భారతీయుల్ని వెనక్కి తెస్తాం



## గల్ఫ్‌లోని రాయబార కార్యాలయాలను అలర్ట్ చేశాం
## ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది
## కోచి బహిరంగసభలో ప్రధాని మోడీ

**కోచి, మార్చి 11:** ప్రస్తుత సంక్షోభ సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని ఇండియాకు తీసుకొస్తామని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని మోదీ విమర్శించారు. బుధవారం కేరళంలోని కోచిలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయే కూటమి నిర్వహించిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. త్వరలో కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ అక్కడి కార్యక్రమానికి హాజరయ్యారు. విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని వదిలిపెట్టబోం. వారిని ఇండియాకు తీసుకొస్తాం. పశ్చిమాసియా సంక్షోభంలో మిగిలిపోయిన భారతీయులకు తగిన సాయం అందిస్తున్నాం. వాళ్ల క్షేమం, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. గల్ఫ్ కంట్రీస్‌లో ఉన్న భారతీయుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్న అక్కడి ప్రభుత్వాలకు కృతజ్ఞతలు. మనవారి సేవలు గుర్తించి, తగిన సహాయం అందిస్తున్నాయి అక్కడి ప్రభుత్వాలు. ఆయా దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు కూడా నిరంతరం పని చేస్తున్నాయి. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ దీనిపై రాజకీయం చేస్తోంది. రెచ్చగొట్టేలా, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారతీయుల విషయంలో రాజకీయం చేయడం తగదు. ఒకవైపు ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంటే ఈ అంశంలో రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. డ్రోన్ల తయారీలో దేశ యువత సాధిస్తున్న విజయాల గురించి కాంగ్రెస్ యువరాజు (రాహుల్ గాంధీ)కి అవగాహన లేదు. కేరళ సహా అనేక రాష్ట్రాల్లోని స్టార్టప్‌లు డ్రోన్లు తయారు చేస్తున్నాయి. సంకుచిత మనస్తత్వం గలవారు ఇలాంటి దేశ ప్రగతిని చూడలేరు. బిజెపి ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికి కేరళలో ఒక్కసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తాం. రాష్ట్రం పేరును కేరళ నుంచి కేరళంనకు మార్చినందుకు ఆనందంగా ఉంది. గత ప్రభుత్వాలు కేరళకు ఏమీ చేయలేదు.

**ఖతార్‌నుంచి 1000 మంది భారతీయులు రాక**



**దోహా, మార్చి 11:** పశ్చిమాసియాలో నెలకొన్న భద్రతా పరిస్థితుల నేపథ్యంలో ఖతార్‌లో చిక్కుకుపోయిన సుమారు 1000 మంది భారతీయ ప్రయాణికులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. న్యూఢిల్లీ, ముంబై, కొచ్చి నగరాలకు తరలించినట్లు దోహాలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ప్రయాణికుల తరలింపు ప్రక్రియను సులభతరం చేసేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఎంబసీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పంచుకున్న వివరాల ప్రకారం నిన్న ఖతార్ ఎయిర్‌వేస్‌కు చెందిన విమానాల్లో ఈ ప్రయాణికులు భారత్‌కు చేరుకున్నారు. చిక్కుకుపోయిన భారతీయుల ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు, ముఖ్యంగా మానవతా దృక్పథంతో అత్యవసర కేసులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు ఖతార్ ఎయిర్‌వేస్‌తో సమన్వయం చేసుకున్నట్లు పేర్కొంది. వారి సహకారానికి ఎంబసీ కృతజ్ఞతలు తెలిపింది. ఇవాళ న్యూఢిల్లీకి మరో విమానం షెడ్యూల్ అయినట్లు కూడా వెల్లడించింది. విమాన ప్రయాణంతో పాటు రోడ్డు మార్గంలో ప్రయాణించే వారికి కూడా ఎంబసీ సహాయపడుతోంది. సౌదీ అరేబియాలోని సల్వా సరిహద్దు గుండా ప్రయాణించడానికి వీలుగా భారతీయులకు 96 గంటల వ్యాలిడిటీతో తాత్కాలిక ట్రాన్సిట్ వీసాలను జారీ చేస్తున్నట్లు వివరించింది. ఇదే మార్గంలో, ఖతార్‌లో చిక్కుకుపోయిన భారత బాస్కెట్‌బాల్ జట్టు కూడా సౌదీ అరేబియా నుంచి విమానాల్లో స్వదేశానికి చేరుకుందని తెలిపింది. ఈ విషయంలో సహకరించిన సౌదీ అరేబియా, ఖతార్ అధికారులకు ఎంబసీ ధన్యవాదాలు తెలియజేసింది. సహాయం కోసం ఎంబసీలో 24/7 కంట్రోల్ రూమ్ పనిచేస్తోందని, దీంతో పాటు భారతీయ కమ్యూనిటీ సంస్థలైన ఐసీసీ, ఐసీబీఎఫ్‌కు చెందిన హెల్ప్ లైన్‌లు కూడా అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే.. బహ్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం జారీచేసిన ప్రకటనలో పొరుగు దేశాలకు ప్రయాణ ఏర్పాట్లు చేస్తున్నట్లు కొన్ని ప్రైవేట్ వ్యాపార బృందాలు చేస్తున్న ప్రచారంతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ప్రైవేట్ పార్టీలు చేసే రవాణా ఏర్పాట్లకు ఎంబసీ బాధ్యత వహించదని, ఈ విషయాన్ని అందరూ గమనించాలని సూచించింది.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇరాన్ సుప్రీం లీడర్ ఆచూకీ ఎక్కడ?



**టెహ్రాన్, మార్చి 11:** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ ఆచూకీపై తీవ్ర గందరగోళం నెలకొంది. ఆయన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారి కూడా ప్రజల ముందుకు రాకపోవడం, కనీసం ఒక ప్రకటన కూడా విడుదల చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కొనసాగుతున్న యుద్ధంలో ఆయన గాయపడ్డారని వార్తలు వస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుంచి స్పష్టత కొరవడటంతో ఆయన పరిస్థితిపై రకరకాల ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ మొజ్తబా గాయపడినట్లు అంగీకరించింది. ఆయన్ను 'జాన్‌బాజ్ ఆఫ్ రంజాన్' (గాయపడిన యుద్ధ వీరుడు) అని అభివర్ణించింది. ఈ గాయం ఎప్పుడు, ఎక్కడ, ఎలా తగిలింది, దాని తీవ్రత ఎంత అనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఈ గాయం కారణంగా ఆయన తన అధికారిక బాధ్యతలను నిర్వర్తించగలుగుతున్నారా లేదా అనే విషయంపై కూడా స్పష్టత ఇవ్వలేదు. దీంతో మిస్టరీ మరింత పెరిగింది. జెరూసలేం పోస్ట్ తన కథనం ప్రకారం అంతర్గత వర్గాల సమాచారం మేరకు మొజ్తబా యుద్ధంలో గాయపడింది నిజమే అయినప్పటికీ, ఆయన దేశ వ్యవహారాలను చక్కదిద్దే స్థితిలోనే ఉన్నారని తెలుస్తోంది. అయినప్పటికీ, నాయకత్వ మార్పు సజావుగా జరిగిందని ప్రభుత్వ అధికారులు చెబుతున్నా, ఇప్పటివరకు మొజ్తబాకు సంబంధించిన ఒక్క కొత్త ఫోటో గానీ, వీడియో గానీ విడుదల కాలేదు.

## ఇరాక్‌లో యుఎస్ కేంద్రంపై డ్రోన్ దాడి

**బాగ్దాద్, మార్చి 11:** ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ కూటమి మధ్య యుద్ధం 12వ రోజుకు చేరుకుంది. బుధవారం తెల్లవారుజామున ఇరాక్ రాజధాని బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని అమెరికా దౌత్య మద్దతు కేంద్రం పై డ్రోన్ల దాడి జరిగింది. మొత్తం ఆరు డ్రోన్లు ఈ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకోగా, ఐదింటిని అమెరికా రక్షణ వ్యవస్థలు గాలిలోనే కూల్చివేశాయి. అయితే, ఒక డ్రోన్ మాత్రం కార్యాలయ ప్రాంగణాన్ని తాకడంతో స్వల్ప నష్టం వాటిల్లింది. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని ప్రాథమిక సమాచారం. బుధవారం సూర్యోదయానికి ముందే ఇరాన్ తన క్షిపణిని ప్రయోగించింది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, హైఫా నగరాలను లక్ష్యంగా చేసుకుని భారీగా క్షిపణులను ప్రయోగించింది. బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నావికా దళానికి చెందిన స్థావరంపై కూడా ఇరాన్ దాడులు చేసినట్లు అక్కడి మీడియా వెల్లడించింది. దీనికి ప్రతిగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్ అంతటా భీకరమైన వైమానిక దాడులను కొనసాగిస్తున్నాయి. యుద్ధం ఆపకపోతే గల్ఫ్ నుంచి ప్రపంచ దేశాలకు వెళ్లే చమురు రవాణాను పూర్తిగా అడ్డుకుంటామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధిలో మైన్లను (మందుపాతరలు) అమర్చి షిప్పింగ్‌ను నిలిపివేసేందుకు ఇరాన్ యత్నిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఒకవేళ చమురు సరఫరాను ఇరాన్ అడ్డుకుంటే, ఎన్నడూ చూడని రీతిలో ప్రతీకారం ఉంటుందని హెచ్చరించారు.

## ఆర్థికసంస్థలు, బ్యాంకులపైనా దాడులు: ఇరాన్ సెంట్రల్ కమాండ్



**టెహ్రాన్, మార్చి 11:** ఇరాన్ ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమై 12వ రోజుకు చేరుకుంది. ఇదే సమయంలో యుద్ధాన్ని మరింత తీవ్రం చేసేందుకు సిద్ధమని ఇరాన్ ప్రకటించింది. ఇకపై అమె రికా, ఇజ్రాయెల్‌కు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ సెంట్రల్ ఆపరేషనల్ కమాండ్ ఖాటమ్ అల్ అన్బియా ప్రకటించారు. ప్రజలు ఈ సంస్థలు, బ్యాంకులకు దూరంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. తాజాగా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఒక కీలక బ్యాంకుపై ఇజ్రాయెల్ అర్ధరాత్రి దాడి చేసింది. ఈ ఘటనలో చాలా మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై తాము కూడా అమెరికా, ఇజ్రాయెల్‌లకు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులపై దాడి చేస్తామని, అక్కడి ప్రజలు ఆ ప్రదేశాలకు దూరంగా ఉండాలని ఇరాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్ తమ బ్యాంకులపై దాడి చేయడం ద్వారా తాము కూడా అలాంటి సంస్థలపై దాడులు చేసేందుకు తగిన కారణాన్ని ఇచ్చిందని ఇరాన్ తెలిపింది. ఈ నేపథ్యంలో అమెరికన్ సంస్థల టార్గెట్ లిస్టును ఇరాన్ ప్రకటించింది. ఇందులో ప్రముఖ అమెరికన్ టెక్ కంపెనీలు, ఇన్‌ఫ్రా కంపెనీలున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, పాలంటిర్, నివి డియా, ఒరాకిల్ వంటి సంస్థలున్నాయి. ఈ సంస్థలు గల్ఫ్ కంట్రీస్‌లో, ఇజ్రాయెల్‌లలో పలు ఆఫీసుల నుంచి తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి.

## థాయిలాండ్, వియత్నాంలో ఇంధన అత్యవసర పరిస్థితి

**బ్యాంకాక్, మార్చి 11:** హర్మోజ్ జలసంధిలో రాజుకున్న ఉద్రిక్తతలు పశ్చిమాసియా సరిహద్దులు దాటి ఆగ్నేయాసియా దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇరాన్ అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు ఆటంకాలు ఏర్పడటంతో, థాయ్‌లాండ్, వియత్నాం ప్రభుత్వాలు తమ దేశాల్లో ఇంధన అత్యవసర పరిస్థితి తరహా చర్యలకు శ్రీకారం చుట్టాయి. చమురు ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకోవడంతో, ప్రభుత్వ యంత్రాంగాలు ఇంధన పొదుపు మంత్రాన్ని పఠిస్తున్నాయి. వియత్నాంలో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఫిబ్రవరి చివరి వారం నుంచి అక్కడ పెట్రోల్ ధరలు 32 శాతం పెరగ్గా డీజిల్, కిరోసిన్ ధరలు ఏకంగా 56 నుండి 80 శాతం వరకు ఎగబాకాయి. ఈ భారాన్ని తగ్గించుకోవడానికి వియత్నాం ప్రధాని ఫామ్ మిన్ మిన్ స్వయంగా రంగంలోకి దిగి కువైట్, ఖతార్ వంటి దేశాలతో చర్చలు జరుపుతున్నారు. మరోవైపు, రాజధాని హనోయిలోని వీధుల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిని అదుపు చేసేందుకు పారిశ్రామిక, వాణిజ్య శాఖ అధికారులు ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్‌హోమ్ వెసులుబాటు కల్పించాలని స్థానిక సంస్థలకు కీలక సూచనలు చేశారు. అటు థాయ్‌లాండ్ ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి వారానికి కేవలం నాలుగు రోజులు మాత్రమే పనిదినాలను అమలు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. అత్యవసర సేవలకు మినహాయింపు ఇస్తూనే, మిగిలిన విభాగాల సిబ్బందిని ఇంటి నుండే విధులు నిర్వర్తించాలని ఆదేశించింది. సొంత వాహనాల వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించి, సైకిళ్లు లేదా ప్రజా రవాణాను ఆశ్రయించాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది. అధికారుల విదేశీ పర్యటనలపై ఆంక్షలు విధిస్తూనే, కార్‌పూలింగ్ వంటి పద్ధతులను ప్రోత్సహిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు అదుపులోకి వచ్చే వరకు ఈ కఠిన నిబంధనలు పాటించక తప్పదని ఇరు దేశాల ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు.

## యుద్ధ నిబంధనలు అతిక్రమించిన ఇజ్రాయెల్,అమెరికా
### ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసిన ఇరాన్ ప్రతినిధి

**టెహ్రాన్, మార్చి 11:** అమెరికా, ఇజ్రాయెల్ కలిసి తమ దేశంపై జరుపుతున్న సైనిక దాడుల్లో భారీగా పౌర మరణాలు సంభవిస్తున్నాయని ఇరాన్ తీవ్ర ఆరోపణలు చేసింది. గతనెల 28 నుంచి జరిగిన ఈ దాడుల్లో 1300 మందికి పైగా సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయారని, సుమారు 9,669 పౌర ప్రాంతాలు ధ్వంసమయ్యాయని ఐక్యరాజ్యసమితికి ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయీద్ ఇరవానీ ఫిర్యాదుచేసారు. ధ్వంసమైన వాటిలో 7,943 నివాస గృహాలు, 1,617 వాణిజ్య కేంద్రాలు, 65 పాఠశాలలు, 32 వైద్య సదుపాయాలు ఉన్నాయని ఇరవానీ వివరించారు. అమెరికా, ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగా మా పౌరులను, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. అంతర్జాతీయ చట్టాలకు ఎలాంటి గౌరవం ఇవ్వకుండా ఈ నేరాలకు పాల్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. టెహ్రాన్‌లోని ఇంధన నిల్వ కేంద్రాలు, మెహ్రాబాద్ విమానాశ్రయం, క్వెష్మ్ ద్వీపంలోని మంచినీటి శుద్ధి ప్లాంట్‌పై జరిగిన దాడులను ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ దాడుల వల్ల తీవ్రమైన వాయు కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, లెబనాన్‌లోని బీరుట్‌లో ఆదివారం జరిగిన ఉగ్రదాడిలో నలుగురు ఇరాన్ దౌత్యవేత్తలు మరణించారని ఇరవానీ తెలిపారు. మరో దేశంలో దౌత్యవేత్తలను లక్ష్యంగా చేసుకుని చంపడం యుద్ధ నేరమని, తీవ్రమైన ఉగ్రవాద చర్య అని అభివర్ణించారు. ఇరాన్ ప్రజలపై జరుగుతున్న ఈ దాడులను అంతర్జాతీయ సమాజం తక్షణమే ఆపాలని, తమ ప్రజలను, భూభాగాన్ని కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# 12 నెలలు, 13 రీఛార్జ్‌లు

### వ్యాలిడిటీ 28 రోజులకే పరిమితమేంటి?
### నెల అంటే 30రోజులు కాదా?
### ఇదో పెద్ద కుంభకోణం!
### టెలికాం కంపెనీల నయా దోపిడీ
### రీఛార్జ్ ముగిస్తే ఇన్‌కమింగ్ కాల్స్ ఎందుకు ఆపేస్తారు?
### రాజ్యసభలో ఎండగట్టిన ఆప్ ఎంపి రాఘవ్ చద్దా

**న్యూఢిల్లీ, మార్చి 11:** పార్లమెంట్ వేదికగా టెలికం కంపెనీలు సాగిస్తున్న దోపిడీని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపి రాఘవ్ చద్దా ఎండగట్టారు. ప్రిపెయిడ్ మొబైల్ రీచార్జ్ పద్ధతులపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత వ్యవస్థ వినియోగదారులపై అన్యాయమైన భారాన్ని మోపుతున్నదని ఆరోపించారు. టెలికం కంపెనీలు ఉపయోగించే 28 రోజుల రీచార్జ్ సైకిల్‌తోపాటు ప్లాన్‌లు గడువు ముగిసిన తర్వాత వినియోగదారులపై విధించిన ఆంక్షలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. మొబైల్ వినియోగదారులు విస్తృతంగా ఉపయోగించే 28 రోజుల రీఛార్జ్ సైకిల్‌ను రాఘవ్ చద్దా తీవ్రంగా విమర్శించారు, దీనిని "స్కామ్" అని పిలిచారు. "28 రోజుల రీఛార్జ్ ప్లాన్ ఒక మోసపూరితమైనది. సంవత్సరంలో 12 నెలలు ఉంటాయి, కానీ మీరు 13 సార్లు రీఛార్జ్ చేసుకోవాలి (28 రోజులు, 13 సార్లు = 364 రోజులు)" అని ఆయన అన్నారు. రీఛార్జ్ చెల్లుబాటును 30 లేదా 31 రోజుల క్యాలెండర్ నెలలతో సమలేఖనం చేయాలని ఆయన అన్నారు. ప్రస్తుత వ్యవస్థ వినియోగదారులను ప్రతి సంవత్సరం అదనపు రీఛార్జ్ కోసం చెల్లించమని సమర్థవంతంగా బలవంతం చేస్తున్నదని ఆరోపించారు. "నేటి కాలంలో, మొబైల్ ఇకపై విలాసవంతమైనది కాదు, కానీ సాధారణ పౌరుడికి ఇది అవసరంగా మారింది," అని చద్దా అన్నారు, టెలికం కంపెనీలు వినియోగదారుల పట్ల న్యాయమైన, పారదర్శక విధానాన్ని అవలంబించాలని కోరారు.



**రీఛార్జ్ ముగిసినా ఇన్ కమింగ్ ఆపొద్దు: ఎంపి చద్దా**

మొబైల్ యూజర్లసమస్యలపై ఆప్ ఎపి రాఘవ్ చద్దా పార్లమెంటులో గళమెత్తారు. మంత్లీ ప్లాన్స్ పేరిట 28 రోజుల రీఛార్జ్ సంస్థలు ఏటా 13సార్లురీఛార్జ్ చేయించుకుంటూ దండుకుంటున్నా యని విమర్శించారు. రీఛార్జ్ ముగిసినా ఏడాది పాటు ఇన్కమింగ్ కాల్స్, ఒటిపిలు ఆపకూడదని, మూడేళ్ల వరకు నంబర్ డీయాక్టివేట్ చేయవద్దని డిమాండ్ చేశారు. ఇప్పుడు మొబైల్ విలాసం కాదని, సామాన్యుడి ప్రాణాధారమని ఆయన స్పష్టం చేశారు.

## భార్యను చంపిన భర్త ఆచూకీ కోసం ఎఫ్‌బిఐ భారీ రివార్డు

**న్యూయార్కు, మార్చి 11:** అమెరికాలో 11 ఏళ్ల క్రితం భార్యను దారుణంగా హత్య చేసి పరారీలో ఉన్న భద్రేశ్‌కుమార్ చేతన్‌భాయ్ పటేల్ అనే భారతీయుడిపై అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) భారీరివార్డు ప్రకటించింది. అతని ఆచూకీ తెలిపిన వారికి ఇచ్చే రివార్డును 2,50,000 డాలర్ల నుంచి ఏకంగా 1 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 9.18 కోట్లు) పెంచుతున్నట్లు ప్రకటించింది. ఎఫ్‌బీఐ టాప్ 10 మోస్ట్ వాంటెడ్ జాబితాలో భద్రేశ్‌కుమార్ ఉన్నాడు. 2015 ఏప్రిల్ 12న మేరీల్యాండ్‌లోని హానోవర్‌లో ఉన్న ఓ డంకిన్ డోనట్ షాపులో భద్రేశ్‌కుమార్, అతని భార్య పాలక్ పటేల్ (21) నైట్ షిఫ్ట్‌లో పనిచేస్తున్నారు. ఈ సమయంలోనే భార్యను దారుణంగా హత్య చేసినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. షాపులోని సీసీటీవీ ఫుటేజీలో ఇద్దరూ కిచెన్ వైపు వెళ్లడం రికార్డయింది. ఆ తర్వాత కొంతసేపటికి కస్టమర్లు వచ్చి పిలిచినా ఎవరూ స్పందించకపోవడంతో అనుమానం



వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి చూడగా, కిచెన్‌లో పాలక్ మృతదేహం లభ్యమైంది. దర్యాప్తు ప్రకారం భారత్‌కు తిరిగి వెళ్లిపోవాలని పాలక్ కోరుకోవడం, దీనికి భద్రేశ్‌కుమార్ అంగీకరించకపోవడంతో ఇద్దరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఘటన జరిగిన రోజు పాలక్ తన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు ఈ వాగ్వాదం పెరిగి హత్యకు దారితీసిందని ఎఫ్‌బీఐ అధికారులు తెలిపారు. హత్య తర్వాత, దగ్గరలోని తమ అపార్ట్‌మెంట్‌కు వెళ్లి కొన్ని వస్తువులు, నగదు తీసుకుని ట్యాక్సీలో న్యూజెర్సీలోని నెవార్క్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని ఓహోటల్‌కు వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం అక్కడి నుంచి నెవార్క్ పెన్ స్టేషన్‌కు వెళ్లి అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ లభ్యం కాలేదు. గత 11 ఏళ్లలో 300కు పైగా ఆధారాలు లభించినప్పటికీ, భద్రేశ్‌కుమార్‌ను పట్టుకోలేకపోయామని అధికారులు చెబుతున్నారు. ఈ 1 మిలియన్ డాలర్ల రివార్డు ప్రకటనతో మా అన్వేషణకు మరింత ప్రచారం లభించి, పాలక్‌కు న్యాయం చేయడానికి అవసరమైన సమాచారం వస్తుందని ఆశిస్తున్నామని ఎఫ్‌బీఐ బాల్టిమోర్ ఫీల్డ్ ఆఫీస్ స్పెషల్ ఏజెంట్ జిమ్మీ పాల్ తెలిపారు. టీచర్ కావాలని కలలు కన్న పాలక్‌ను ఆమె కుటుంబం ఎంతగానో మిస్ అవుతోందని, నిందితుడిని పట్టుకోవడానికి ప్రజల సహాయం కీలకమని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## నౌకాదళ రహస్యాలు లీక్: ఆదర్శ్‌కుమార్ అరెస్ట్

**లక్నో, మార్చి 11:** భారత నౌకాదళానికి సంబంధించిన అత్యంత కీలక సమాచారాన్ని పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్‌ఐకి చేరవేస్తున్న ఒక నేవీ ఉద్యోగిని ఉత్తరప్రదేశ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అరెస్ట్ చేసింది. దేశ భద్రతకు ముప్పు కలిగించేలా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలపై లాన్స్ నాయక్ హోదాలో పనిచేస్తున్న ఆదర్శ్ కుమార్ అలియాస్ లక్కీని అదుపులోకి తీసుకున్నారు. యూపీలోని ఆగ్రాకు చెందిన ఆదర్శ్ కుమార్ కేరళలోని కొచ్చిలో ఉన్న సదరన్ నేవల్ కమాండ్‌లో లాన్స్ నాయక్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా అతడు పాకిస్థాన్‌కు చెందిన ఒక ఐఎస్ఐ ఏజెంట్‌తో నిరంతరం టచ్‌లో ఉన్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఎలక్ట్రానిక్, ఫిజికల్ సర్వైలెన్స్ ద్వారా ఇతడి కదలికలను గమనించిన ఏటీఎస్ పక్కా ఆధారాలతో లక్నోలో అరెస్ట్ చేసింది.

## మహిళా ఆర్థికసాయం పథకం విస్మరించిన ఆప్
### పంజాబ్ అసెంబ్లీలో ఆప్, కాంగ్రెస్‌ల మధ్య వాగ్వాదం

**అమృత్‌సర్, మార్చి 11:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మహిళా ఆర్థిక సహాయ పథకంపై పంజాబ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటుచేసుకుంది. అసెంబ్లీ సాక్షిగా ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకోవడంతో సభ దద్దరిల్లింది. 2022 ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.1000 ఇస్తామని హామీ ఇచ్చిన ఆప్ నాలుగేళ్ల పాటు మౌనంగా ఉండి ఇప్పుడు ఎన్నికల ముందు ఈ పథకాన్ని తీసుకురావడాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ నేత ప్రతాప్ సింగ్ బాజ్వా తప్పుబట్టారు. మహిళలకు ఇవ్వాల్సిన పాత బకాయిలు రూ.48,000 సంగతేంటి కేవలం ఓట్ల కోసమే ఈ జిమ్మిక్కులు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. దీనికి స్పందించిన సీఎం భగవంత్ మాన్ మేము ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాం, ప్రతి మహిళా అకౌంట్‌లో డబ్బులు జమ చేస్తామని దీటుగా సమాధాన మిచ్చారు. ఈ చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే సుఖ్‌పాల్ సింగ్ ఖైరా చేసిన కొన్ని వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. మహిళా మంత్రులపై, పథకం అమలుపై ఆయన చేసిన వ్యాఖ్యలు మహిళలను అవమానించేలా ఉన్నాయని అధికార పక్షం ఆరోపించింది. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుంటూ కాంగ్రెస్ నాయకులకు మహిళల పట్ల గౌరవం లేదు. సభలో మహిళా మంత్రులను కించపరచడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, రాష్ట్ర ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా ఈ పథకం కోసం రూ. 9,300 కోట్లు కేటాయించినట్లు ప్రకటించగా రాష్ట్ర అప్పులు రూ. 4.5 లక్షల కోట్లకు చేరాయని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. కేవలం అంకెలు మార్చి ప్రజలను మోసం చేస్తున్నారని పర్గత్‌సింగ్ వంటి కాంగ్రెస్ నేతలు విమర్శించారు. సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో స్పీకర్ సభ్యులను శాంతింపజేయడానికి తీవ్రంగా ప్రయత్నించాల్సి వచ్చింది.



## మాంసాహారం తిన్నాడని పూజారిని చితకబాదిన గ్రామస్తులు

**కాన్పూర్, మార్చి 11:** యూపీలోని కాన్పూర్‌కు చెందిన ఓ పూజారి మాంసాన్ని సేవించినట్లు ఫోటో వైరల్ కావడంతో అతన్ని గుడి విధుల నుంచి తొలగించారు. కేశవపురంలోని శ్రీ భూతేశ్వర్ ధామ్ ఆలయంలో ఈ ఘటన జరిగింది. ఆ గుడిలోనే ప్రధాన పూజారిగా ఉన్న అతని తండ్రి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఫోటోలో ఉన్న వ్యక్తి తన కుమారుడు ప్రశాంత్ గిరి అని తండ్రి సంతోష్ గిరి గుర్తించాడు. పూజారిగా ఉంటూ మాంసం తిన్న ప్రశాంత్ గిరిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఊరేగింపు సమయంలో గుడి వద్ద ఆ వ్యక్తిని బయటకు లాగి చితకబాదారు. ఆ తర్వాత ఆ పూజారీ ఆచూకీ లేదు. నా భార్య, కోడలు ఆపేప్రయత్నం చేసినా స్థానికులు వారిపై కూడా దాడి చేసినట్లు సంతోష్ గిరి తెలిపాడు. పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## అమ్మా...తిరిగొస్తానో లేదో..
### యుఎఇకి వెళ్లిన యువ పైలట్ తల్లికి సందేశం

**చండీగఢ్, మార్చి 11:** ఇరాన్‌వార్‌లో భారతీయులను స్వదేశానికి తరలిస్తున్న క్రమంలో ఒక యువ మహిళా పైలట్ తన తల్లితో ఉద్వేగంతో చెప్పిన మాటలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ రెస్క్యూ మిషన్‌కు ముందు తాను తిరిగి వస్తానో లేదోనని తన తల్లితో ఆమె అన్నది. హర్యానాలోని ఫరీదాబాద్‌కు చెందిన 23 ఏళ్ల దీపిక అధానా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లో పైలట్. ఈనెల 6న ఉదయం 10:15 గంటల సమయంలో రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా యూఏఈలోని రాస్ అల్ ఖైమాకు వెళ్లాలని అకస్మాత్తుగా ఆమెకు ఆదేశాలు వచ్చాయి. వాస్తవానికి ఆమె సహోద్యోగి ఆ విధులు చేపట్టాల్సి ఉన్నది. ఆ పైలట్ అందుబాటులో లేకపోవడంతో టేకాఫ్‌కు కేవలం రెండు గంటల ముందు ఆ బాధ్యత చేపట్టాలని దీపికకు ఆదేశాలు అందాయి. విమాన సిబ్బందికి తగిన సూచనలు చేయడంతో పాటు భద్రతకు భరోసా ఇచ్చారు. రెస్క్యూ మిషన్‌కు ముందు పైలట్ దీపిక తన తల్లితో మాట్లాడింది. అమ్మా నేను తిరిగి వస్తానో లేదో తెలియదు. బై బై అని చెప్పింది. కెప్టెన్ జస్వీందర్ కౌర్, పైలట్ దీపికాతో సహా మరో నలుగురితో కూడిన పూర్తి మహిళా సిబ్బందితో ఆ విమానం టేకాఫ్ అయ్యింది. 6న మధ్యాహ్నం 2:00గంటలకు యూఏఈలోని రాస్ అల్ ఖైమా ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ఇండియా విమానం ల్యాండ్ అయింది. విమాన సిబ్బందికి అక్కడ అసాధారణ వాతావరణం కనిపించింది. మరోవైపు గంట తర్వాత 169 మంది భారతీయ ప్రయాణికులు విమానం ఎక్కారు. మధ్యాహ్నం 3:30 గంటలకు ఢిల్లీకి బయలుదేరింది. యుద్ధ పరిస్థితి నేపథ్యంలో టేకాఫ్ సమయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)తో సంబంధాలు క్లుప్తంగా తెగిపోయాయి. ఆ తర్వాత నెట్‌వర్క్ సాధారణ పరిస్థితికి వచ్చింది. సాయంత్రానికి ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. యూఏఈలో చిక్కుకున్న 169 మంది భారతీయులను సురక్షితంగా దేశానికి తీసుకువచ్చింది. యూఏఈలో చిక్కుకున్న తమను సురక్షితంగా భారత్‌కు తీసుకువచ్చినందుకు ప్రయాణికులు ఆ విమాన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. యువ పైలట్ దీపిక కూడా క్షేమంగా తిరిగి రావడంతో ఆమె కుటుంబం ఊరట చెందింది.



## ఎయిరిండియాకు తృటిలో తప్పిన ప్రమాదం



**పుకెట్, మార్చి 11:** ఎయిరిండియాకు చెందిన ఎక్స్‌ప్రెస్ జెట్ విమానం థాయ్‌లాండ్లో హార్డ్ ల్యాండింగ్ అయింది. దీంతో ఎయిర్‌పోర్ట్ పరిధిలో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. ఈ ఘటనతో ఎయిర్‌పోర్ట్ రన్‌వేను అక్కడి అధికారులు మూసేశారు. ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 737-800 అనే విమానం బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ ఐలాండ్ బయల్దేరింది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 11.40 గంటలకు విమానం ఫుకెట్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అవ్వాలి. అంతకంటే ముందుగా 11.24 గంటలకు విమానంఎయిర్‌పోర్ట్‌లో హార్డ్ ల్యాండ్ అయింది. ప్రయాణికులు అంతా క్షేమంగానే ఉన్నారని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. ఈ ఘటనలో విమానం గేర్ భాగం కొద్దిగా దెబ్బతింది.

## కుమార్తెకు విషమిచ్చి చంపిన తల్లి
### ప్రియుడిని ఇరికించేందుకు యత్నించి అరెస్టు

**లక్నో, మార్చి 11:** ఒక మహిళ తన కుమారుడితో కలిసి కుమార్తెకు విషం ఇచ్చి చంపి కుమార్తె ప్రియుడిని ఈ కేసులో ఇరికించేందుకు యత్నించిన కేసులో పోలీసులు అసలు నిందితులను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్ జిల్లాలో గాజీపూర్ ప్రాంతానికి చెందిన 19 యేళ్ల ఫర్జానాకు గత ఏడాది అక్టోబర్‌లో సోషల్ మీడియా ద్వారా సునీల్ యాదవ్‌తో పరిచయం ఏర్పడింది. పెళ్లి పేరుతో అతడు ఆమెను లోబర్చుకున్నాడు. ఈ నేపథ్యంలో ఫర్జానా గర్భం దాల్చింది. సునీల్ ఆమెకు అబార్షన్ చేయించాడు. పెళ్లి చేసుకునేందుకు నిరాకరించాడు. అబార్షన్ వల్ల ఫర్జానా అనారోగ్యం చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె తల్లి 48 ఏళ్ల అఫ్సానా కుమార్తెను ఇంటి నుంచి వెళ్లగొట్టింది. ఫర్జానా ఈ విషయాన్ని సునీల్‌కు చెప్పింది. దీంతో ఆమెను ఐదు రోజుల పాటు తన వద్ద ఉంచుకున్నాడు. అయితే తన కుమార్తె కనిపించడం లేదని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి వెతికారు. మరోవైపు గతనెల 26న ఫతేపూర్ రైల్వే స్టేషన్‌లో ఫర్జానా అపస్మారక స్థితిలో కనిపించింది. జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు ఆ యువతిని జిల్లా ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. ఆమె గురించి అడగ్గా ప్రియుడు సునీల్ పరిచయం, అతడి ద్వారా గర్భం దాల్చడం, అబార్షన్ తర్వాత తనను రైల్వే స్టేషన్ వద్ద వదిలేసి వెళ్లినట్లు ఆమె ఆరోపించింది. సునీల్‌పై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఫర్జానాకు చికిత్స తర్వాత ఆమె స్టేట్‌మెంట్ రికార్డ్ చేసేందుకు పోలీసులు సిద్ధమవుతుండగా కుటుంబీకులు ఆమెను ఆసుపత్రి నుంచి ఇంటికి తరలించారు. మార్చి 1న అర్ధరాత్రి వేళ సునీల్ పొలానికి ఫర్జానాను ఆమె తల్లి,సోదరుడు తీసుకెళ్లారు. అక్కడ బలవంతంగా సల్ఫోస్ పౌడర్ తినిపించగా ఆమె మరణించింది. ప్రియుడు సునీల్ తన కుమార్తెను హత్య చేసినట్లు తల్లి అఫ్సానాపోలీసులకు ఫిర్యాదు చేసింది. మరోవైపు ఫర్జానా మృతదేహానికి పోలీసులు పోస్ట్‌మార్టం నిర్వహించి దర్యాప్తు చేశారు. సీసీటీవీ ఫుటేజ్, ఫోన్ కాల్స్ వంటి ఆధారాలు పరిశీలించారు. అఫ్సానా, తన కుమారుడైన 26ఏళ్ల అఫ్సర్‌తో కలిసి బలవంతంగా విషం తినిపించి కుమార్తెను చంపినట్లు దర్యాప్తులో తెలిసింది.

## ఎస్సీ విద్యార్థులకు రూ.374 కోట్ల స్కాలర్‌షిప్పులు

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** పోస్ట్‌మెట్రిక్ స్కాలర్షిప్ కింద ఎస్సీ విద్యార్థులకు బోధనా రుసుములు (ట్యూషన్ ఫీజు), నిర్వహణ చార్జీలకు సంబంధించి రూ.374 కోట్లను విడుదల చేసినట్లు ఎస్సిల అభివృద్ధిశాఖ ప్రకటించింది. ఈ నిధులను రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన 83,239 మంది ఎస్సీ విద్యార్థుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు వెల్లడించింది. ఇందులో రాష్ట్రప్రభుత్వం తన వాటా కింద రూ.173.00 కోట్లు విడుదల చేయగా కేంద్రప్రభుత్వం రూ. 201.00 కోట్లు విడుదల చేసిందని తెలిపింది. విద్యార్థులు తమకు చెందిన కాస్మోటిక్ మొత్తాలను మినహాయించుకుని, బోధానా రుసుమును (ట్యూషన్ ఫీజు) కళాశాలకు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.

## ఎన్‌పీపీ తెలంగాణ అధ్యక్షుడిగా గవ్వల భరత్ కుమార్

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** నేషనల్ పీపుల్స్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా గవ్వల భరత్ కుమార్‌ను పార్టీ జాతీయ నాయకత్వం నియమిం చింది. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆయన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ కార్యకలా పాలను మరింత విస్తరించి ప్రజలకు చేరువ చేయడంలో గవ్వల భరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తారని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గవ్వల భరత్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆదివాసి ఏజన్సీలపై దాడుల్ని అడ్డుకొందాం

- బిజెపి, బిఆర్‌ఎస్ హయాంలో ఎస్టీలకు తీరని అన్యాయం
- రాహుల్ గాంధీ ప్రభుత్వంలోనే గిరిజన సమస్యలకు పరిష్కారం
- పంచాయతీరాజ్, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క
- ఎస్టీ సమాజానికి అత్యధికంగా డైరెక్టర్ పోస్టులు : టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్,మార్చి 11,ప్రభాతవార్త:** ఆదివాసి ఏజన్సీలపై కార్పొరేట్ సంస్థ దాడులను అడ్డుకోవడానికి రాహుల్ గాంధీనాయకత్వంలో గిరిజనలు ఐక్యంగా పోరాటం చేయాలనీ పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. బుధవారం ఇందిరా భవన్‌లో నిర్వహించిన తెలంగాణ ఆదివాసి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి సీతక్కతోపాటు టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఆల్ ఇండియా ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ ఎమ్మెల్యే విక్రాంత్ బూర్యా, ఆల్ ఇండియా ఆదివాసి కాంగ్రెస్ వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆదివాసి ఎంపిలు, ఎమ్మెల్యేలు పార్టీ నేతలు హాజరయ్యారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి పాలకపక్షం అండతో మన అటవీ సంపదను, కొండలను గుట్టలను మైనింగ్ పేరుతో కొల్లగొడుతున్నారనీ గిరిజనుల భూములు లాగేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు మొదటి నుంచి ఎస్సీ, ఎస్టీలకు అణగారిన వర్గాలకు అండగా నిలిచాయనీ, రాజ్యాంగంలో ఫిఫ్త్ షెడ్యూల్, సిక్స్త్ షెడ్యూల్, పెస చట్టాలు తెచ్చి ఎస్టిలకు రక్షణ కవచంగా కాంగ్రెస్ నిలిచిందనీ గుర్తుచేశారు. ఆదివాసి గిరిజనులకు కాంగ్రెస్ పార్టీ శ్రీరామరక్ష అని,తొలి ప్రధాని నెహ్రూ మొదలుకొని నేటి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వరకు ఎస్టీల అభివృద్ధి కోసం పనిచేస్తున్నారనీ కొనియాడారు. టిఆర్‌ఎస్ బిజెపి పాలనలో ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందనీ నేటికి బిజెపి కారణంగా అన్యాయం జరుగుతోందని ఆమె ఆవేదన చెందారు. మన ప్రాంతాల మీద నిత్యం దాడులు పెరిగాయని మన చట్టాలను ఉల్లంఘించారనీ సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేశారనీ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే గిరిజనులకు సంక్షేమం లభిస్తోందనీ, అట్టడుగు వర్గాల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలనీ ఆకాంక్షను వ్యక్తంచేశారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే మన సమస్యలు పరిష్కారం అవుతాయనీ, రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే ఈ దేశం బాగుపడుతుందనీ ఆమెజోస్యం చెప్పారు. రాష్ట్రంలో కులగణన చేపట్టి సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్నామనీ వివరించారు. కార్పొరేట్ల సంస్థలకు ఏజెన్సీ ప్రాంతాలను బిజెపి కట్టబెడుతుందనీ బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్, ప్రధాని మోడీ ప్రోద్బలంతోనే అంబానీ వంటి కార్పొరేషత్తులు మన వనరులను మన అడవులను దోచుకుంటున్నాయనీ సీతక్క విమర్శించారు. పంచాయతీరాజ్ మంత్రిగా గిరిజన ఆదివాసి ప్రాంతాల అభివృద్ధి కోసం గిరిజన గ్రామ పంచాయతీల్లో మౌళిక వసతుల కల్పన కోసం చేస్తానని హామీ ఇచ్చారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బహుజనకులాల హితం కోసం పనిచేస్తుందని రాజకీయంగా నాయకత్వం ఎదగడానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎస్‌సి ఎస్టీ,బిసిలకు కలిపి 70 శాతం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను నియామకం చేశామని తెలిపారు.అందులో భాగంగా ఐదుగురు ఎస్‌టి నేతలకు డిసిసి అధ్యక్ష పదవులు ఇచ్చామనీ, రాహుల్ గాంధీ ఆకాంక్షించిన సామాజిక న్యాయాన్ని అగ్రవర్ణానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థంగా అమలు చేస్తున్నారనీ వివరించారు. త్వరలోనే ఎస్టీ సమాజానికి మెజార్టీగా డైరక్టర్ పోస్టులు ఇవ్వబోతున్నామనీ చెప్పారు.. ఆదివాసుల అభివృద్ధి, అటవీ హక్కులు, భూమి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడిన పార్టీ కాంగ్రెస్ మాత్రమే అని ఆయన చెప్పారు. లంబాడీలు ఎక్కువగా ఉన్న తన స్వగ్రామంలో పాఠశాల నిర్మాణం కోసం 11 ఎకరాల భూమిని ఇచ్చాననీ ఆయన ప్రకటించారు. చదువుకుంటే జీవితం కలర్ టీవీలా రంగులమయం అవుతుందనీ ఆయన చెప్పారు.

## ప్రజాస్వామ్యాన్ని అత్యంత పాశవికంగా హత్య చేసింది బిఆర్‌ఎస్: ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, మార్చి 11,ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యాన్ని అత్యంత పాశవికంగా హత్యచేసిన చేతులు బిఆర్‌ఎస్‌వి మాత్రమే అనీ దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పిటిషన్ల పైన స్పీకర్ తీర్పు పైన కెటిఆర్ తెగ ఎగిరెగిరి పడుతూ చీకటిరోజు అని, ప్రజల తీర్పును అవమానించడమని, ప్రజాస్వామ్య విలువ లని చాలా పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నాడనీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ గురువింద గింజ కెటిఆర్ పదేళ్ళ పాలనలో నీ కింద ఉన్న నలుపు ను ఒక సారి చూసుకో అని హితవు చెప్పారు. ప్రతిపక్షాలకు, ప్రజా సంఘాలకు, ప్రజలకు నీ పదేళ్ల పాలన ప్రతి రోజు చీకటి రోజే అని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య విలువలు అనే పదం ఉచ్చరించడానికే మీ కుటుంబానికి అర్హత లేదనీ ఆది దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రాజ్ భవన్ సాక్షిగా ఖూనీ చేసి ప్రతిపక్ష ఎంఎల్ ఏ లకు మంత్రి పదవి ఇచ్చింది మీరు కాదా..? అని ఆయన ప్రశ్నించారు. పదేళ్లలో నీ ఫిరాయింపులకు నిలువెత్తు సాక్షాలు 39 మంది ఎమ్మెల్యేలు అని ఆయన అన్నారు. నీ ఫిరాయింపుల దాహానికి ఆ నాడే అంతే లేకుండా పోయిందని చరిత్రను నెమరేసుకొన్నారు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ అధ్యక్షులు, చివరకు వార్డు మెంబర్లను ఎవరిని మీరు వదిలి పెట్టలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమి గుండ్రంగా ఉంటుందన్నట్లు మీకు అనుభవం వచ్చిందని ఎకసెక్కాలు చేశారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు కుల్వకుంట్ల కుటుంబం ఎంత కాకిగోల పెట్టినా వినేవారెవ్వరు లేరనీ అన్నారు.

## తెలంగాణలో ఫిరాయింపులు మొదలు పెట్టింది కెసిఆర్: అద్దంకి దయాకర్

**హైదరాబాద్, మార్చి 11,ప్రభాతవార్త:** తెలంగాణలో పార్టీ ఫిరాయింపులు మొదలు పెట్టింది కెసిఆర్ అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. గాంధీ భవన్‌లో అద్దంకి దయాకర్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీని విమర్శి స్తూ మాట్లాడుతున్న కెటిఆర్ నీ స్థాయి ఏంటో తెలుసుకోకుండా మాట్లాడు తున్నావు అంటూ దుయ్యబట్టారు. కెటిఆర్ భాషలో చెప్పాలి అంటే నువ్వు ఇడియా ట్రిక్‌లీడర్ కెటిఆర్ మీ అయ్యానే బయటికి రావటం లేదు ఎక్కడో ఉన్న రాహుల్ గాంధీ ముచ్చట నీకు ఎందుకు అని అన్నారు. బిఆర్‌ఎస్‌కు దూరంగా ఉన్న పది మంది ఎమ్మెల్యేలను పిలువు అని కెటిఆర్‌కు సలహా ఇచ్చారు కడియం ఆడనా! మగనా! అంటున్నవ్ నువ్వు ఎవరు? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలను చేర్చుకొని ఏకంగా మంత్రులను చేసిన మీరేం అవుతారు అని ఆయన ప్రశ్నించారు. కెటిఆర్ నీ నాయకత్వం నచ్చకనే పది మంది ఎమ్మెల్యేలు బయటికి వచ్చారనీ భాష్యం చెప్పారు.

## పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు నిశ్శబ్దం అణగారిన గొంతు నొక్కడమే: మల్లు రవి

**హైదరాబాద్, మార్చి 11,ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో ప్రతిపక్షాలను నిశ్శబ్దంగా ఉంచాలనుకొంటే అణగారిన వర్గాల గొంతు నొక్కడమే అని నాగర్‌కర్నూల్ ఎంపి తెలంగాణ ఎంపిల ఫోరం చైర్మన్ మల్లురవి అన్నారు. బుధవారం లోక్ సభలో స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలని కోరుతూ తీర్మానంపై చర్చ సందర్భంగా మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పలువురు ప్రతిపక్ష సభ్యులకు సభలో మాట్లాడే అవకాశాలను పదే పదే తిరస్కరించడంపై డాక్టర్ మల్లు రవి తన ప్రసంగంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గ్రంథాలయం వలే పార్లమెంటు నిశ్శబ్దం మీద కాదు, చర్చల మీద నడుస్తుందని ఆయన చెప్పారు. ప్రతిపక్షాన్ని నిశ్శబ్దం చేయడం అంటే లక్షలాది మంది పౌరుల గొంతులను నిశ్శబ్దం చేయడమేనని ఆయన నొక్కి చెప్పారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూపై చేసిన అవమానకరమైన వ్యాఖ్యలను కూడా ఆయన తీవ్రంగా ఖండించారు, నెహ్రూ స్వాతంత్ర్య పోరాటంలో తొమ్మిది సంవత్సరాలకు పైగా (3,259 రోజులు) బ్రిటిష్ జైళ్లలో గడిపారని. ఆధునిక భారతదేశ నిర్మాతగా చారిత్రాత్మక పాత్ర పోషించారని సభకు గుర్తు చేశారు. ప్రజాస్వామ్య పార్లమెంటరీ పనితీరుకు న్యాయం, నిష్పాక్షి కత, భిన్నాభిప్రాయంను గౌరవించడం అవసరమని పేర్కొన్నారు. ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్‌ను రద్దు చేయాలని డాక్టర్ మల్లు రవి డిమాండ్ చేశారు.

## తెలంగాణ, ఆంధ్ర అప్పులు రూ.1.25 లక్షల కోట్లు

### తొమ్మిది నెలల్లో అప్పుల వివరాలు వెల్లడించిన కేంద్రం

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు భారీ స్థాయిలో అప్పులు చేసినట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారికంగా వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరంలోని మొదటి మూడు క్వార్టర్లలో ఈ రెండు రాష్ట్రాలు రూ.1.25 లక్షల కోట్ల రుణ సమీకరణ చేసినట్టు తెలిపింది. ఓపెన్ మార్కెట్ బారోయింగ్స్ ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు వేల కోట్ల రుణాలు సేకరించినట్టు స్పష్టం చేసింది.ఇక మహారాష్ట్ర రూ. 99,000 కోట్ల రుణ సమీకరణతో దేశంలోనే మొదటిస్థానంలో నిలిచింది. దక్షి ణాదిలో అత్యధికంగా అప్పులు చేసిన రాష్ట్రంగా తమిళనాడు రూ.95,300 కోట్లతో నిలిచింది. ఆ తర్వాత ఎక్కువగా అప్పులు చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. కర్ణాటక రూ.12,000 కోట్లు, కేరళ రూ.36,338 కోట్లు చొప్పున రుణాలను సమీకరణ చేశాయి. రాజ్యసభలో వైఎస్సార్సీపీ ఎంపీ గొల్ల బాబూరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం గత తొమ్మిది నెలల్లో రూ.69,300 కోట్లు, ఆంధ్రప్రదేశ్ సర్కార్ రూ.56,072 కోట్ల అప్పు సేకరించించినట్టు గణాంకాలు వెల్లడించారు. 2025-26లో తెలంగాణ ప్రభుత్వం మొదటి మూడు నెలల్లో రూ.17,400 కోట్లు, రెండో త్రైమాసికంలో రూ.32,500 కోట్లు, మూడో త్రైమాసికంలో రూ.19,400 కోట్లు చొప్పున తొమ్మిది నెలల్లో రూ.69,300 కోట్ల అప్పులు చేసినట్టు వివరించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదటి మూడు క్వార్టర్లకు సంబంధించి తొలి క్వార్టర్‌లో రూ.26,572 కోట్లు, రెండో క్వార్టర్‌లో రూ.17,600 కోట్లు, మూడో త్రైమాసికంలో రూ.11,900 కోట్లు ఇలా తొమ్మిది నెలల్లో రూ.56,072 కోట్ల రుణ సమీకణ చేసినట్టు వివరించారు. అయితే, రాష్ట్రాలు చేస్తున్న ఈ అప్పుల్లో ప్రధాన భాగం పాత అప్పుల చెల్లింపుల కోసమే మళ్లిస్తున్నట్టు పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరుబాట: కూనంనేని

- 24న చలో అసెంబ్లి
- పార్టీ బలోపేతంపై సిపిఐ రాష్ట్ర కౌన్సిల్‌లో చర్చ



**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** పేదలకు ఇళ్ల, ఇళ్ల స్థలాలు, ఖమ్మం, హైదరాబాద్, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మార్చి 24న చలో అసెంబ్లి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. ఇరాన్‌పై యుద్ధం చేస్తున్న అమెరికా, ఇరాన్‌ల సామ్రాజ్యవాద కాంక్షను వ్యతిరేకంగా, పెరిగిన గ్యాస్, నిత్యావసరాల ధరలను అదుపు చేయటంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా ఈ నెల 16న రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ పెద్ద ఎత్తున ఉద్యమించబోతోందని స్పష్టం చేశారు. తమతో మిత్రధర్మం పాటించే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తేల్చుకుంటామని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో రెండు రోజుల పాటు సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, ఇ.టి.నరసింహ, కార్యదర్శి వర్గ సభ్యులు కళవేన శంకర్, బాల నర్సింహ్మలతో కలిసి బుధ వారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని సాంబశివరావు రాష్ట్ర సమితి నిర్ణయాలను వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర ఏళ్ల కావొస్తున్నా ప్రజా సమస్యలు పరిష్కారంలో జాప్యం కారణంగా రాష్ట్రంలో పూర్తిగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్కరి సమస్యలను పట్టనట్లుగా వ్యవహరిస్తోందని, ఇక మీదట అది చెల్లబోదన్నారు. రైతు భరోసాకు సంబంధించిన నిధులు ఇప్పటికే ఒక దఫా పెండింగ్‌లో ఉండగా, రెండవ దఫా సమయం కూడ మించి పోయిందన్నారు. ప్రభుత్వం అసలు రైతు భరోసా ఇస్తుందా లేదా..? స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి అంశంపై పూర్తి సమాచారం స్పష్టం చేయాల్సిందేనని పేర్కొన్నారు. తెలంగాణకు గుండెకాయలాంటి సింగరేణి సంస్థను అసలు ఆసంస్థలో ఏమి జరుగుతోందో తెలియని పరిస్థితినెలకొందని కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. లాభాల్లో ఉంటే సింగరేణి సంస్థ పాలకులు అనాలోచిత నిర్ణయాలు మీతిమిరిన రాజకీయ జోక్యంతో నష్టాల్లోకి నెట్టివేస్తున్నారన్నారు.

# టోల్‌ప్లాజాలో సెన్సార్‌లతో కూడిన వే బ్రిడ్జిలు

- బరువు ఆధారిత టోల్ చార్జీలకు సన్నాహాలు
- ప్రమాదాలు,రోడ్లు దెబ్బతినకుండా వాహనాల అధికలోడ్ నియంత్రణ

**హైదరాబాద్, మార్చి 10,ప్రభాతవార్త:** జాతీయ రహదారులపై అధికలోడ్ వాహనాలను నియంత్రణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ టోల్ ప్లాజాల వద్ద వే బ్రిడ్జిలను నిర్మించేందుకు సన్నాహాలు చేపట్టింది. సెన్సార్ల సహాయంతో లారీలు, ట్రక్కుల్లో తీసుకెళ్తున్న సరకు బరువు వేస్తున్నప్పటికీ ఉజ్జాయింపుగానే బరువు వివరాలు సేకరణ చేస్తున్నారు. వే బ్రిడ్జిల ఏర్పాటుతో జాతీయ రహదారులపై వెళ్లే లారీలు, ట్రక్కుల్లో తీసుకెళ్తున్న సరకు బరువును కచ్చితంగా నిర్ధారణచేస్తారు. అనుమతించిన పరిమితిని మించి బరువు తీసుకెళ్తున్న వాహనాలను గుర్తించి చర్యలు తీసుకునే అవకాశముంటుంది. ఎన్‌హెచ్‌ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా కచ్చిత వివరాలు సేకరించడానికి వే బ్రిడ్జిలు నిర్మాణానికి దేశంలోని అతి పొడుగున రహదారి శ్రీనగర్- కన్యాకుమారి అనుసంధానం చేసే 44 నెంబరు జాతీయ రహదారుల నిర్వహణ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై భారీ వాహనాల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. లారీలు, ట్రక్కుల్లో అనుమతి కన్నా ఎక్కువగా బరువు సరకులు రవాణా చేస్తుండటంతో ప్రమాదాలు జరగడంతోపాటు ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. అధికలోడుతో వెళ్ళే వాహనాలు నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రహదారులు దెబ్బతినడంతోపాటు ప్రభుత్వం ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. రాష్ట్రంలో జాతీయ రహదారి 44 మొదలయ్యే ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలలో టోల్‌ప్లాజ వద్ద వే బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు. సోన్ మండలం గంజాల్, ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలం పిప్పర్వాడ, నేరడిగొండ మండలం రోల్‌మామడ వద్ద టోల్ ప్లాజాల వద్ద వే బ్రిడ్జి నిర్మాణ చేపట్టారు. వేబ్రిడ్జిలు వినియోగంలోకి రాగానే టోల్ ప్లాజాలోకే కాదు ప్రభుత్వంకు కూడా ఆదాయం పెరగడంతో ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. వే బ్రిడ్జి సౌజన్యంతో బ్రేక్ వ్యవస్థపై అధికలోడ్ కారణంగా నియంత్రణ కోల్పోయే వాహనాలను ముందుగానే గుర్తించే వీలుండటంతో ప్రమాదాలు తగ్గుతాయి. జాతీయ రహదారులపై కూడా రోజుకు ఎన్ని వాహనాలు, ఎంత బరువు రవాణా అవుతుందో తెలుసు కోవచ్చు. ఈ సమాచారం భవిష్యత్తులో రహదా రుల అభివృద్ధి, రవాణా ప్రణాళిక కోసం ఉపయోగపడుతుంది..

## ఉద్యాన పంటల సాగుపై రైతులకు సాంకేతిక సలహాలు

### ప్రత్యేకంగా టెక్నాలజీ సమాచార కేంద్రం ఏర్పాటు డాక్టర్ డి. రాజిరెడ్డి

**హైదరాబాద్, మార్చి 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యాన రైతులకు అధునాతన శాస్త్రీయ సలహాలు, సూచనలు అందించేందుకుగాను అన్ని హంగులతో కూడిన ఉద్యాన టెక్నాలజీ సమాచార కేంద్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం విసి డాక్టర్ డి. రాజిరెడ్డి చెప్పారు. యూనివర్సిటి ప్రధాన పరిపాలన కార్యాలయంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ మేరకు ప్రముఖ వ్యవసాయరంగ నిపుణులు డాక్టర్ దిలీప్ ఉద్యానవర్సిటీని సందర్శించిన నేపథ్యంలో బుధవారం ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రైతులకు విస్తరణ సేవలు మరింత బలోపేతం చేసేందుకు ఈ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉద్యాన పంటల్లో డ్రోన్ టెక్నాలజీని పంటల చీడ, పీడల నిఘా, నియంత్రణ తద్వారా దిగుబడి, నాణ్యత పెంపొందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఉద్యాన పంటల్లో మోడల్ డ్రోన్ వాడకం దేశానికే ఆదర్శంగా ఎదిగేందుకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఉద్యాన రంగంలో ఆవిష్కరణల పెంపొందింపు, అంకుర పరిశ్రమల ఏర్పాటుకు ఊతమిచ్చేందుకు హార్టి ఇన్నోవేషన్ సెంటర్ నెలకొల్పుతామని తెలిపారు.

## మారిషస్ ఉగాది వేడుకలకు జూపల్లికి ఆహ్వానం

**రవీంద్రభారతి, మార్చి 11 ప్రభాతవార్త:** మారిషస్ దేశంలో ఈ నెల 19న అంగరంగ వైభవంగా జరిగే ప్రతిష్టాత్మక శ్రీ పరాభావ నామ తెలుగు ఉగాది పండుగ వేడుకల ఆహ్వానపత్రికను మారిషస్ తెలుగు మహాసభ సమన్వయ కర్త విశ్వకర్మ డి.ఆర్.కె తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావును ఆయన కార్యాలయంలో కలిసి అందజేసి వేడుకలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. అనంతరం తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు పటేల్ రమేష్‌రెడ్డి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ ధనావత్ సూర్యను, అగ్రికల్చర్ కమిషన్ సభ్యురాలు మరికంటి భవానీలను కలిసి వారికీ ఆహ్వాన పత్రాలను విశ్వకర్మ అందజేశారు. మారిషస్ దేశ ప్రధాని ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ వేడుకల్లో ఆదేశ ఉపప్రధాని, ఇతర మంత్రులు కూడా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ పర్యటనలో అక్కడి రాష్ట్రపతి, విదేశాంగ మంత్రి, టూరిజంశాఖా మంత్రితో పర్యాటక అభివృద్ధిపై ఉంటాయన్నారు.

## గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్ల దుర్వినియోగంపై పౌరసరఫరాలశాఖ కొరడా

### రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల దాడులు ఎల్‌పిజి సిలిండర్లు, వాహనాలు స్వాధీనం

**హైదరాబాద్, మార్చి 11 ప్రభాతవార్త:** గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు మళ్లించడం, సిలిండర్ల నుంచి గ్యాస్ దోపిడీ చేయడంపై తెలంగాణ పౌరసరఫరాలశాఖ కొరఢా ఝుళిపించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. హన్మకొండ, వరంగల్, కర్మాన్‌ఘాట్ ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో అధికారులు 22 గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్లు, 25 చిన్న సిలిండర్లు, పలు గ్యాస్ రీఫిల్లింగ్ యూనిట్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ రూ.64,468గా ఉంటుందని తెలిపారు. ఇదిలా ఉండగా గత నెల 14న నిర్వహించిన తనిఖీల్లో ఒక నిందితుడిని పట్టుకుని 78 గృహ వినియోగ సిలిండర్లు, ఒక రవాణా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1,71,600గా ఉందని పౌరసరఫరాలశాఖ ప్రకటించింది. తాజా దాడుల్లో మొత్తంగా 100 గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు, 25 చిన్న సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.2,36,068గా ఉంటుందని అధికారులువెల్లడించారు. నిందితులపై ఎఫ్‌ఐఆర్ నమోదు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. కాగా.. ప్రజలు అవసరానికి మించి ఎల్‌పిజి సిలిండర్లను బుక్ చేయవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఎల్‌పిజి సిలిండర్ల అక్రమ వినియోగం లేదా ఇతర పౌర సరఫరాల సమస్యలపై సమాచారం ఇవ్వాలంటే టోల్ ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

## తెలంగాణ ఏర్పాటుపై తప్పుపట్టడం టిడిసి ఫ్లోర్‌లీడర్‌కు తగదు

### చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 11 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తప్పుపడుతూ లోక్ సభలో టిడిపి ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణ దేవరాయలు 14ఫిబ్రవరి 2014ను చీకటి రోజుగా అభివర్ణించడం ఆయన స్థాయికి తగదని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా అవిశ్వాస తీర్మానంపై చర్చ జరుగుతున్న సమయంలో టిడిపి లోక్ సభ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలంగాణ ఏర్పాటుపై మాట్లాడిన మాటలను కిరణ్ ఖండించారు. లోక్ సభలో తలుపులు మూసి బిల్లు పాస్ చేశారని, రాజ్యంగబద్ధంగా లోక్ సభలో తెలంగాణ బిల్లు పాస్ అయిన అంశాన్ని వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతుగా టిడిపి అధినేత, ఆంధ్రప్రదేశ్ సిఎం నారా చంద్రబాబు నాయుడు లేఖ ఇచ్చారని గుర్తుచేశారు.ఆ విషయం కృష్ణదేవరాయలకు తెలియదా...?తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయనీ, సుష్మాస్వరాజ్ లోక్ సభలో తెలంగాణ గురించి మాట్లాడారని బిజెపి వాళ్ళు ఇప్పటికీ గొప్పలు చెప్పుకుంటున్నారనీ అన్నారు. బిజెపి ప్రసన్నం చేసుకోవడానికి లోక్ సభలో టిడిపి ఎంపీ తెలంగాణ గురించి మాట్లాడారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్ళు అవుతుంది.ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను తప్పు పట్టడం ఏంటి...? అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్,బీహార్ ప్రజలు చంద్రబాబు నాయుడు,నితీష్ కుమార్ కు ఓట్లు వేసి గెలిపిస్తే వారు మోడీకి మద్దతు ఇస్తున్నారనీ ఆయన దుయ్యబట్టారు. రెండు తెలుగు రాష్ట్రాలు విడిపోయి సత్సంబంధాలతో ఉన్నాయనీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చరిత్రను టిడిపి తప్పుగా మాట్లాడటం సరికాదని అన్నారు.

# పారాక్వాట్ గడ్డి మందును నిషేధించాల్సిందే

- శాసనసభలో చర్చించేలా త్వరలో ప్రభుత్వానికి నివేదిక
- ప్రకృతి వ్యవసాయంతోనే నేల, పంట బాగుంటుంది
- రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** గడ్డి మందు కలుపు మందు రెండూ ప్రమాదకరమేనని తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి హెచ్చరించారు. కూలీల కొరతతో చాలామంది అమాయక రైతులు ఈ మందులను సాగులో వినియోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాల్లో తయారైన ఈ కలుపు, గడ్డి మందు రాష్ట్రంలో విచ్చల విడిగా అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. విష రసాయనాలతో తయారైన ఈ మందులతో నేలంతా పాడైపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు పారాక్వాట్ గడ్డి మందు దుష్ప్రభావాలపై బుధవారం రైతు కమిషన్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయ భూమిని కౌలుకు ఇచ్చిన కమిషన్ సభ్యుడు కెవిఎన్‌రెడ్డి భూమి కూడా పాడైపోయిందని గుర్తు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారానే నేల, పంట బాగుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గడ్డి మందు సేవించి ఎంతమంది చనిపోతున్నారని, ఆ వివరాలను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. గడ్డి మందు వినియోగం దుష్ప్రభావాలపై అసెంబ్లీలో చర్చ జరిగేలా కృషి చేస్తామన్నారు. ఈ అంశాన్ని సిఎంతోపాటు స్పీకర్‌కు, శాసనసభ వ్యవహారాల మంత్రికి నివేదిక ఇస్తామని ప్రకటించారు. పారాక్వాట్ గడ్డిమందును ఉత్పత్తి చేసే దేశాలు తమ దేశాల్లో నిషేధించాయని, కానీ ఇతర దేశాల్లో అమ్మకాలుకొనసాగిస్తున్నాయని మండిపడ్డారు. కాగా... ప్రతి ఒక్కరూ పారాక్వాట్ నిషేదించేలా ఉద్యమించాలని కమిషన్ సభ్యురాలు భవానిరెడ్డి పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదికగా పోరాటం చేద్దామని, నిషేదించకపోయినా నిలువరిదామని సూచించారు. అనంతరం కమిషన్ సభ్యుడు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఏడాది కాలంలో 200 మంది రైతులు గడ్డి మందు ప్రభావంతో చనిపోయారని, 99 శాతం గడ్డి మందు తాగినవాళ్లు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గడ్డిమందు చాలా ప్రమాదకరమైందని, తప్పని సరిగా నిషేధించాలని డిమాండ్ చేశారు. ప్యారాక్వాట్ నిషేదించాల్సిందేనని, గతంలో వర్షాకాలంలో ఆరుద్ర పురుగు కనిపించేదని, కానీ విషపూరితమైన గడ్డి మందు చల్లడం వల్ల క్రిమికీటకాలు కూడా కనుమరుగయ్యాయని కమిషన్ మరో సభ్యుడు కెవిఎన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో పారాక్వాట్ నిషేధంపై నిర్ణయం తీసుకోవాలని కమిషన్ సూచించనుందన్నారు. రసాయనాలతో సాగుచేసిన పంటలు తినడం వల్ల రోగుల సంఖ్యా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గడ్డిమందు నిషేధం కోసం ఐఎంఏ ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునివ్వడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ, వ్యవసాయశాఖ జెడి గీతారెడ్డి, ఎన్‌ఐపీహెచ్‌ఎం నిపుణులు డాక్టర్ ఒపిశర్మ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ కిషన్, డిఎంపి ప్రతినిధులు సతీష్‌నారాయణచౌదరి తదితరులు పాల్గొన్నారు.

## రబి పంటల సేకరణకు కేంద్రం ఆమోదం

### శనగ, మినుము, వేరుశనగ కొనుగోలుకు లైన్ క్లియర్

హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రబి సిజన్‌కు తెలంగాణలో 1,25,855 మెట్రిక్ టన్నుల పంటను కనీస మద్దతు ధర వద్ద సేకరించాలన్న తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్ ఆమోదం తెలిపారు. ఈ పంటల సేకరణను ధరల మద్దతు పథకం కింద చేపట్టనున్నారు. ఇందులో భాగంగా 29,860 మెట్రిక్ టన్నుల శనగలు, 37,020 మెట్రిక్ టన్నుల మినుములు, 55,285 మెట్రిక్ టన్నుల వేరుశనగ, 3,690 మెట్రిక్ టన్నుల పొద్దుతిరుగుడు పువ్వు కొనుగోలు చేయనున్నారు. ఈ సేకరణ విలువ రూ. 894 కోట్లకు పైగా ఉంటుంది. రైతులను మార్కెట్ ఒడిదుడుకుల నుంచి రక్షించి వారి కష్టానికి తగిన పూర్తి ధర లభించేలా చూడటమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని శివరాజ్‌సింగ్‌చౌహాన్ తెలిపారు. కేంద్రప్రభుత్వ ఆమోదంతో తెలంగాణ రైతులు పంటకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తికి కొత్త ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు.

## కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లపై అనర్హత పిటిషన్‌ను డిస్మిస్ చేయడం దారుణం

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్**

**హైదరాబాద్, మార్చి 11 ప్రభాతవార్త** కాంగ్రెస్ పాలనలో శాసన వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కన్నతల్లే బిడ్డను చంపడం ఎంత పాపమో శాసన వ్యవస్థే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం అంతకంటే పాపం అన్నారు. శాసన వ్యవస్థే ఫిరాయింపులను ప్రోత్సహించేలా స్పీకర్ తీర్పు ఇచ్చారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ టిక్కెట్‌పై ఎంపిగా పోటీ చేసినా అనర్హత వేటు వర్తించకపోవడం సిగ్గు చేటు అన్నారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని ప్రచారం చేసినా పార్టీ ఫిరాయించలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గాంధీభవన్‌లో సంసారం చేస్తూ...కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్నా ఫిరాయింపులు వర్తించకపోవడం ప్రజాస్వామ్యానికే చేటు అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి స్వయంగా కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించింది నిజం కాదా?సిఎం రేవంత్ రెడ్డి దీనిపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. స్పీకర్ తీర్పుపై హైకోర్టు కు వెళతాంన్యాయ వ్యవస్థపై మాకు సంపూర్ణ నమ్మకం ఉందని, బెంగాల్‌లో అనర్హత పిటిషన్‌పై స్పీకర్ ఇదే తరహా తీర్పు ఇస్తే హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలతో కొట్టేసిందన్నారు.

## 13 యేళ్లుగా కోమాలోనే..

**- ఓ యువకునికి కారుణ్య మరణం - సుప్రీం సంచలన తీర్పు**



**న్యూఢిల్లీ,మార్చి 11:** పదమూడేళ్లుగా జీవచ్ఛవంగా ఉన్న 32 ఏళ్ల హరీశ్ రాణాకు అందిస్తున్న వైద్య సహాయాన్ని నిలిపివేసేందుకు అతని తల్లిదండ్రులకు అనుమతి ఇచ్చింది. గౌరవంగా మరణించే హక్కుపై సుప్రీంకోర్టు ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం తీర్పు చెప్పింది. 13 ఏళ్ల క్రితం భవనంపై నుంచి కింద పడటంతో హరీశ్ రాణా మెదడుకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి అతను స్పృహ లేకుండా, పూర్తిగా ఇతరులపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఈ కేసును విచారించిన ధర్మాసనం, ఇలాంటి పరిస్థితుల్లో చికిత్స కొనసాగించడం రోగి ప్రయోజనాలకు మేలు చేస్తుందా లేదా అన్నదే కీలకమని వ్యాఖ్యానించింది. చదువులో చురుకుగా ఉండే యువకుడు ఇలా జీవచ్ఛవంగా మారడం బాధాకరమని కోర్టు పేర్కొంది. 13 ఏళ్లుగా అతని ఆరోగ్యంలో ఎలాంటి పురోగతి లేదని, కోలుకునేందుకు ఏమాత్రం అవకాశం లేదని వైద్య నివేదికలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో చికిత్సను కొనసాగించడం వల్ల ప్రయోజనం లేదని కోర్టు అభిప్రాయపడింది. ఈ సందర్భంగా పైపుల ద్వారా అందించే పోషకాహారం కూడా వైద్య చికిత్స కిందకే వస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వైద్యుల బృందం పరిశీలించి, రోగి కోలుకునే అవకాశం లేదని నిర్ధారించిన పక్షంలో లైఫ్ సపోర్ట్‌తో పాటు పోషకాహారాన్ని కూడా నిలిపివేయవచ్చని ఈ తీర్పుతో స్పష్టమైంది.

# స్పీకర్ తీర్పు అత్యంత అప్రజాస్వామికం

**నేర పూరిత ఆలోచన రాహుల్‌గాంధీదే - బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**

**హైదరాబాద్, మార్చి 11 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల పైన స్పీకర్ ఇచ్చిన తీర్పు అత్యంత అప్రజాస్వామికమని, దారుణమని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేవలం రాహుల్ గాంధీ ఆడిస్తున్న ఆటలో భాగంగానే తెలంగాణ స్పీకర్ ప్రసాద్ కుమార్ ఈ నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీ స్పీకర్ పైన రాహుల్ గాంధీ తీవ్రమైన ఒత్తిడి ఉన్నదని, రాహుల్ గాంధీ కూడా రాష్ట్రం నుంచి వస్తున్న అడ్డగోలు సంచుల కట్టల కోసం ఇలాంటి అనైతిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. శాసనసభ స్పీకర్ చేతుల్లో ఏమీ లేదని, మొత్తం కాంగ్రెస్ పార్టీనే ఈ ఫిరాయింపుల వ్యవహారాన్ని దగ్గరుండి నడిపించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్నది ప్రజాస్వామ్యం మరియు భారత రాజ్యాంగంపై దాడి అని, దీని వెనుక ఉన్న ప్రధాన నేరస్థుడు, ఆ నేరపూరిత ఆలోచన రాహుల్ గాంధీదే. ఆయనే అసలు దోషి అన్నారు. ఎందుకంటే ఆయన అనుమతి లేకుండా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గారు ఇంతటి దారుణమైన నిర్ణయం తీసుకునే సాహసం చేయలేరన్నారు.ఒకవైపు రాహుల్ గాంధీ భారత రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతూ దానికి రక్షకుడినని చెప్పుకుంటూ, పార్టీ ఫిరాయింపులకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పైన సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ఈ నిర్ణయంతో రాహుల్ గాంధీ ఒక జోకర్ గా నిలిచిపోయారని కేటీఆర్ అన్నారు. పార్టీ ఫిరాయిస్తే ఆటోమేటిక్ డిస్క్వాలిఫికేషన్ అని చెప్పిన రాహుల్ గాంధీ, తెలంగాణ వచ్చి న్యాయ పత్రాల గురించి ఉపన్యాసాలు దంచిన రాహుల్ గాంధీ, స్పీకర్ తీసుకున్న నిర్ణయం పైన ఏం సమాధానం చెబుతారని కేటీఆర్ ప్రశ్నించారు. ఒక పార్టీ బీఫారం పైన గెలిచిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ బీఫారంతో ఎంపీగా పోటీ చేసిన తర్వాత కూడా ఆ వ్యక్తిని అనర్హుడిగా ప్రకటించకుండా, విచారణ పేరుతో సాగదీసి ఈరోజు ఆ ఎమ్మెల్యేకు అనుకూలంగా తీర్పు చెప్పడం అంటే అత్యంత దుర్మార్గం అన్నారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుని తిరుగుతూ ఉపన్యాసాలు ఇచ్చే అదే రాహుల్ గాంధీ, తుక్కుగూడలో ఫిరాయింపుల నిరోధక చట్టం గురించి మాట్లాడారు. ఇది ఆ రాహుల్ గాంధీ చేస్తున్న మూర్ఖపు పని. రాహుల్ గాంధీకి కొంచెమైనా సిగ్గు, గౌరవం ఉంటే దీనికి సమాధానం చెప్పాలి.

ఒక పార్టీ బిఫారమ్ మీద ఎమ్మెల్యేగా గెలిచి, రాజీనామా చేయకుండానే మరో పార్టీ బిఫారమ్ మీద ఎంపీగా ఎలా పోటీ చేస్తారు? అని ప్రశ్నించారు. స్వతంత్ర భారత చరిత్రలో ఏ స్పీకర్ కూడా ఇంత అద్భుతమైన నిర్ణయం తీసుకోలేదని కెటిఆర్ వ్యంగ్యంగా అన్నారు. అందుకే మేము వారిని చప్పట్లతో, శాలువాలతో సత్కరించి మా కృతజ్ఞతలు తెలియజేయాలనుకుంటున్నాము.

ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ఏ బిఫారమ్ వాడారు, ఎంపీగా ఏ బిఫారమ్ వాడుతున్నారో అక్కడ స్పష్టంగా ఉంది. ఇంత ఉన్నా స్పీకర్ అనర్హత పిటిషన్‌ను తిరస్కరించారంటే, ఖచ్చితంగా ఆయనను, అయనను నడిపిస్తున్న కాంగ్రెస్ నేతలను సత్కరించాల్సిందే అని ఎద్దేవా చేశారు.



## చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ ఆలయాన్ని సందర్శించిన నూతన గవర్నర్, కుటుంబ సభ్యులు

**చార్మినార్,మార్చి 11 ప్రభాతవార్త:** చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో బుధవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గవర్నర్, కుటుంబానికి మందిరం ట్రస్టీ శశి కళ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ట్రస్టీ గవర్నర్‌కు అమ్మ వారి దీపావళి ఖజానా బహుకరించారు. రాష్ట్ర గవర్నర్ పాతబస్తీకి విచ్చేసిన సందర్భంగా చార్మినార్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

## రాష్ట్ర ప్రాజెక్టులపై కేంద్ర జలశక్తి అధికారులతో మంత్రి ఉత్తమ్ భేటి

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఢిల్లీలో పర్యటించారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక నీటిపారుదల ప్రాజెక్టులు, కృష్ణా-గోదావరి నదీ జలాల అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించడమే లక్ష్యంగా ఈ పర్యటన కొనసాగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర జలశక్తి శాఖ అధికారులతోపాటు సంబంధిత విభాగాల ప్రతినిధులను మంత్రి ఉత్తమ్ కలిశారు. రాష్ట్ర ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు, నిధులపై చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, నదీ జలాల వినియోగం, అలాగే అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం.

## కేంద్రరాష్ట్రాలచొరవతోనే బహ్రెయిన్‌నుంచి 60 మంది తెలంగాణకు..




**హైదరాబాద్, మార్చి 11:** కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల చొరవవల్లనే బహ్రెయిన్‌లో చిక్కుకున్న తాము సురక్షితంగా తెలంగాణలోని స్వస్థలాలకు చేరుకోగలిగామని బహ్రెయిన్‌లో చిక్కుకున్న తెలుగు కుటుంబాలవారు60 మంది వెల్లడించారు. గోనె సోలోమన్‌రాజు, జోసెఫ్‌కివోర్, దీవన్‌కుమార్; సిస్టర్ మొమానా, ప్రేమ్‌సాగర్, ఫెన్నీ, బెంజమిన్ తదితరులు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ల చొరవతోనే తామంతా స్వస్థలాలకు చేరుకోగలిగామని వారు ధన్యవాదాలు తెలిపారు. అలాగేతెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిసైతం తమపట్లచూపించిన చొరవ కేంద్రంతో సంప్రదింపులు చేయడంవల్లనే నేడు తాము సురక్షితంగా రాగలిగామన్నారు. దమ్మమ్‌నుంచి కోచికి ప్రత్యేక విమానంలో రాగలిగామని వారంతా హర్షంప్రకటించారు. బహ్రెయిన్, సౌదీ అరేబియాలతోకేంద్ర ప్రభుత్వం దౌత్యపరంగా నిర్వహించిన సంప్రదింపులు తమకు ఎంతో బలాన్నిచ్చాయని బహ్రెయిన్ తెలుగు అసోసియేషన్ కూడా ఇందుకు సంబంధించి కీలకమైన కృషిచేసిందన్నారు. గల్ఫ్‌ఎయిర్‌కూడా తమకు ఇతోధిక సాయం చేసిందన్నారు.

గతనెల 28వ తేదీనుంచి ఈనెల 10వ తేదీవరకూ స్థానిక తెలుగు కుటుంబాలు, చర్చులుతమకు అల్పాహారం, భోజనాలు అందించాయని, మొత్తం 60 మంది బహ్రెయిన్‌నుంచి సురక్షితంగా తెలంగాణకు రాగలిగామని చెప్పారు.

## ప్రమాదంలో మరో సాగునీటి ప్రాజెక్టు

**సింగూరు ప్రాజెక్టును పరిశీలించిన ఎన్‌డిఎస్‌ఎ నిపుణుల బృందం**

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** పిల్లర్లు కుంగిపోయి కాళేశ్వరం ప్రాజెక్టు మనుగడ ప్రమాదంలో పడిన నేపథ్యంలో రాష్ట్రంలో మరో ప్రాజెక్టు కూడా ప్రమాదపుటంచులో ఉన్నట్టు తెలుస్తోంది. సంగారెడ్డి జిల్లాలో మంజీరానదిపైన ఉన్న సింగూరు ప్రాజెక్టు డ్యామ్ సేఫ్టీపై ఆందోళన నెలకొంది. ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల పక్కన రివిట్‌మెంట్ కోతకు గురైంది. ఈ నేపథ్యంలో డ్యాం సేఫ్టీపై నెషనల్ డ్యామ్ సెఫ్టీ అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. కోతకు గురైన రివిట్‌మెంట్‌ను అధికారులు పరిశీలించారు. క్రస్ట్ గేట్ల పక్కన ఇంకా పనులు ప్రారంభించకపోవడంతో అధికారులపై డ్యామ్ సేఫ్టీ నిపుణులు అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. సింగూర్ ప్రాజెక్టు రివిట్‌మెంట్ దెబ్బతిన్న ప్రాంతంలో జరుగుతున్న మరమ్మతులపై కమిటీ ఆరా తీసింది. రివిట్‌మెంట్ పనులకు ఎలాంటి యాక్షన్ ప్లాన్ తీసుకున్నారని అధికారులను డ్యామ్ సేఫ్టీ కమిటీ బృందం అడిగింది. డ్యాం భద్రతకు సంబంధించి ఇరిగేషన్ అధికారులకు, ఇంజినీర్లకు పలు సూచనలు చేసింది. గతేడాది సింగూరు ప్రాజెక్టు ప్రమాదంలో ఉందని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ప్రభుత్వానికినివేదిక ఇచ్చింది.

## ఎస్‌హెచ్‌జి మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక స్క్రీనింగ్ టెస్ట్ కార్యక్రమం ప్రారంభం

**మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తోంది. సుమారు 46 లక్షల మంది మహిళలకు సంబంధించి సమగ్ర ఆరోగ్య సమాచారాన్ని సేకరించడంతోపాటు వారికి అవసరమైన వైద్య సహాయం అందించేలా యంత్రాంగం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు బుధవారం సచివాలయం నుండి ఆరోగ్యశాఖ, సెర్ప్ ఉన్నతాధికారులతో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ ప్రత్యేక స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా ఒక్కో మహిళకు సంబంధించి మొత్తం 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగానే కాకుండా ఆరోగ్యపరంగా కూడా దృఢంగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామాల్లోని పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు ఈ స్క్రీనింగ్ ప్రక్రియ నిరంతరాయంగా సాగాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. మహిళల ఆరోగ్యంపై రాజీ పడకుండా, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందేలా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని ప్రకటించారు. మహిళా సంఘాల సభ్యులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాగా.. హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా బ్లడ్ షుగర్, క్రియాటినిన్, లివర్ ఫంక్షన్ టెస్ట్, బిలిరుబిన్ వంటి కీలక పరీక్షలను నిర్వహించనున్నారు. హిమోగ్లోబిన్ శాతంతో పాటు తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్ కౌంట్ తదితర పరీక్షలు చేస్తారు. బిపి, బిఎంఐ, కంటి పరీక్షలు, ఓరల్ ఎగ్జామినేషన్, చర్మ, గోళ్ల పరీక్షలు.

**ఇమ్యునోకెమిస్ట్రి**

థైరాయిడ్ సమస్యలను గుర్తించేందుకు టి.ఎస్.హెచ్ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షల ద్వారా సేకరించిన డేటాను తెలంగాణ డయాగ్నోస్టిక్స్ ద్వారా విశ్లేషించి, నివేదికలను నేరుగా సంబంధిత మహిళల మొబైల్‌లకు పంపడంతోపాటు, భవిష్యత్ చికిత్సల కోసం ఈహెల్త్ రికార్డుల్లో భద్రపరుస్తున్నారు. ఒకవేళ స్క్రీనింగ్‌లో ఏదైనా దీర్ఘకాలిక సమస్యలు బయటపడితే, వారిని వెంటనే పెద్దాసుపత్రులకు రెఫర్ చేసి ఉచిత చికిత్స అందించేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

## 2029 ఎన్నికల నుండి మహిళా రిజర్వేషన్ల అమలు

**- కేంద్రం తాజా యోచన - ఈ సమావేశాల్లోనే సవరణ బిల్లు**

**న్యూఢిల్లీ, మార్చి 11:** పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. మహిళా రిజర్వేషన్ల అమలు జాప్యంపై ఆందోళనలు పెరుగుతున్న దృష్టి మోడీ సర్కార్ తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికలకు 33శాతం కోటా అమలులోకి వచ్చేలా చూసుకోవాలని మోడీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికార వర్గాల సమాచారం. 2023 నాటి నారీ శక్తి వందన్ అధినియం మొదట రిజర్వేషన్‌ను జనాభా లెక్కల పూర్తి, తదుపరి డీలిమిటేషన్ ప్రక్రియతో అనుసంధానించినప్పటికీ, ప్రభుత్వం ఇప్పుడు వీటిని విడదీయడాన్ని పరిశీలిస్తోంది. డిసెంబర్ 2025లో కేబినెట్ రెండు దశల డిజిటల్ జనాభా గణనను మాత్రమే ఆమోదించినందున, జనాభా లెక్కింపు, డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రామాణిక కాలక్రమం 2029 దాటి అమలును ముందుకు నెట్టే అవకాశం ఉంది. ప్రస్తుత అంచనాల ప్రకారం జనాభా గణన మార్చి 2027 వరకు ఖరారు కాకపోవచ్చు, ఆ తర్వాత నియోజకవర్గ సరిహద్దులను తిరిగి గీయడం చాలా సంవత్సరాలు ఉంటుంది. ఈ కాలక్రమాన్ని నివారించడానికి, డీలిమిటేషన్ స్థితితో సంబంధం లేకుండా రిజర్వేషన్లు అమలులోకి వచ్చేలా శాసనసభ మార్పు అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న సమావేశాల్లో ఒక ముఖ్యమైన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు సూచించాడు, అయితే అతను నిర్దిష్ట వివరాలను వెల్లడించలేదు. జనాభా గణనకు కోటాను ముడిపెట్టడం వ్యూహాత్మక ఆలస్యం అని గతంలో వాదించిన ప్రతిపక్ష పార్టీల నుండి వస్తున్న విమర్శల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## పార్టీ ఫిరాయింపుదారులకు క్లీన్ చీట్ ఇవ్వడం - తెలంగాణ ప్రజల తీర్పును కాలరాయడమే

**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్, మార్చి 11 ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యానికి అడుగడుగునా అగౌరవం ఎదురవుతుందని, దానం నాగేందర్, కడియం శ్రీహరి లాంటి పార్టీ ఫిరాయింపుదారులకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం తెలంగాణ ప్రజల తీర్పును కాలరాయడమే అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో.. నాడు బిఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరించిన తీరునే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. ఈ రెండు పార్టీల ఆలోచన శైలి, వ్యవహార శైలిలో ఏమార్పూ లేదన్నారు. ఫిరాయింపులను అరికట్టాల్సిన అత్యున్నతమైన, బాధ్యతాయుతమైన స్పీకర్ పదవిలో ఉండి, వాటికి చట్టబద్ధత కల్పించడం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయం. రక్షించాల్సిన వారే భక్షకులుగా మారి రాజ్యాంగ వ్యవస్థలను అధికార పార్టీ చేతిలో బందీగా మార్చారు. ఇది ప్రజల తీర్పును కాంగ్రెస్ పార్టీ అపహాస్యం చేసిన తీరుకు నిదర్శనం. వ్యక్తిగత ప్రయోజనాల కోసం, పదవుల కోసం ప్రజా తీర్పును అంగట్లో సరకులాగా మారిస్తే దానికి స్పీకర్ వత్తాసు పలకడం దురదృష్టకరం. పార్టీ ఫిరాయింపుల చట్టానికి తూట్లుపొడిచి ప్రజాస్వామ్యాన్ని కాలరాసి.. కాంగ్రెస్ నుంచి బిఆర్‌ఎస్ పార్టీలోకి పార్టీ ఫిరాయించడం. బిఆర్‌ఎస్ గుర్తుపై ఎన్నికల్లో గెలిచిన ప్రతినిధి కాంగ్రెస్ గుర్తుపై పోటీచేశారు. రెండు పార్టీలు తెలంగాణలో పార్టీఫిరాయింపుల చట్టాన్ని కాలరాయడమేనన్నారు.

## మూసీ పునరుజ్జీవనంపై 13న సిఎం రేవంత్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్

**ఎంపిలు,ఎమ్మెల్యేలు, వ్యాపారవేత్తలు, వివిధ పార్టీల నేతలు, మేధావులకు ఆహ్వానం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిది హైదరాబాద్,మార్చి11:** ఈ నెల 13న హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో మూసి రివర్ ఫ్రంట్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ 'మూసీ ఇన్‌వైట్స్' కార్యక్రమం నిర్వహించనుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. మూసీ నది పునరుజ్జీవనం, రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదిత ప్రణాళికలను ఈ వేదికపై ఆవిష్కరించనుంది. పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల ముఖ్య నేతలు, మేధావులు, పర్యావరణ నిపుణులు, అర్బన్ ప్లానర్లు, ఆర్కిటెక్టులు, వ్యాపార వాణిజ్య సంస్థల ప్రతినిధులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. క్రెడాయ్,సిఐఐ,ఫిక్కీ ప్రతినిధులు,మీడియా ప్రతినిధులు, విదేశీ దౌత్యవేత్తలు పాల్గొంటారు.హైదరాబాద్ నగరంతో చారిత్రాత్మక అనుబంధాన్ని పెనవేసుకున్న మూసీ నది ఆనాటి పరిస్థితి.. ఇప్పటి దుస్థితి, నగరానికి పొంచి ఉన్న ముప్పును విశ్లేషించటంతో పాటు భవిష్యత్తు కార్యాచరణను వెల్లడించనుంది. మూసీ పునరుజ్జీవనం, స్వచ్ఛమైన నీటి సరఫరా, పర్యావరణ పరిరక్షణ, నది తీరాల అభివృద్ధి, ప్రజోపయోగ మౌలిక వసతుల ఏర్పాటు వంటి అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించనుంది. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా తొలి దశలో గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## యూనిట్ విద్యుత్‌కు 13 పైసలు వడ్డింపు

**అదనపు సర్‌చార్జి కింద పంపిణీ సంస్థల వసూలు**

**ప్రతిపాదనల్లో కోతతో నియంత్రణ కమిషన్ గ్రీన్‌సిగ్నల్**

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** వినియోగదారుల నుండి అదనపు సర్‌చార్జి భారాన్ని వడ్డించేందుకు తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు సిద్ధమవుతున్నాయి. ఇందుకు తెలంగాణ విద్యుద్ నియంత్రణ కమిషన్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఓపెన్‌యాక్సెస ద్వారా కరెంట్ కొనుగోలు చేసే వినియోగదారుల నుంచి 2026-27 తొలి అర్థవార్షికం ఏప్రిల్ 1వ తేదీ నుండి సెప్టెంబరు 30 వరకూ యూనిట్‌కు 59 పైసల వసూలుకు అనుమతించాలని కోరుతూ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్‌లో పిటిషన్లు దాఖలు చేశాయి. ఓపెన్ యాక్సెస్ విధానంలో కరెంటు కొంటున్న వినియోగదారుల నుంచి యూనిట్‌కు 59 పైసల చొప్పున సర్‌ఛార్జి వసూలు చేస్తామంటూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించాయి. ఈ సర్‌ఛార్జి వసూలుకు అనుమతించాలని రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సీ)ని కోరాయి. అయితే వీటిపై విచారించిన విద్యుత్ నియంత్రణ కమిషన్ చివరకు 0.13 పైసల వసూలుకు అనుమతినిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఛైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ నేతృత్వంలోని కమిషన్ దీనికి సంబంధించి ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో వినియోగదారులపై ఈ మేరకు భారాన్ని వసూలు చేసేందుకు పంపిణీ సంస్థలు సన్నాహాలు చేస్తున్నాయి. కాగా కరెంటును సరఫరా, పంపిణీ (టీడీ) చేయడానికి అదనంగా రవాణా ఖర్చు యూనిట్‌కు 72 పైసలవుతోంది.

వినియోగదారులు బహిరంగ మార్కెట్‌లో కరెంట్ కొనేందుకు ఓపెన్ యాక్సెస్ కింద అనుమతిస్తారు.

భారీ పరిశ్రమలు ఈ పాలసీ కింద కరెంటు కొనుగోలు చేస్తుంటాయి. ఎవరైనా ఓపెన్ యాక్సెస్‌లో నేరుగా కొన్నా తాము సరఫరా,

పంపిణీ ఖర్చులు చెల్లించక తప్పదని, దీంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు పేర్కొంటున్నాయి.

## రైతు విద్యుత్ పంపిణీ సంస్థ కొత్త డిస్కం డైరక్టర్ల నియామకం

**పరిధిలోకి ఉచిత విద్యుత్ సేవలు ఉత్తర్వులు జారీ**

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఉచితాల నిమిత్తం ఏర్పాటు చేసిన మూడో డిస్కంకు పేరును ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త డిస్కంకు తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఆర్పీడీసీఎల్)గా నామకరణం చేసింది.

ఈ మేరకు దీనికి సంబంధించి బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ డిస్కంకు సిఎండిగా ముషారఫ్ ఫరూఖీ, డైరెక్టర్లుగా తిరుపతిరెడ్డి, కృష్ణరెడ్డి, మోహన్‌రావు. నరసింహులు వ్యవహరించనున్నారు. రాష్ట్రంలో ఉచితంగా సరఫరా చేస్తున్న విద్యుత్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కొత్త మూడో డిస్కంను ఇప్పటికే ఏర్పాటు చేసింది.

రాష్ట్రంలో ప్రస్తుతం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ రెండు డిస్కంలు పనిచేస్తున్నాయి. తాజాగా మూడవ డిస్కంగా రైతు విద్యుత్ పంపిణీ సంస్థను బుధవారం అధికారికంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుత ఎస్పీడీసీఎల్ కార్యాలయ ప్రాంగణంలోని బి బ్లాక్‌ను ఈ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ రిజిస్టర్డ్ కార్యాలయంగా పేర్కొంది. ఈ కొత్త సంస్థ పరిధిలోకి రాష్ట్రంలోని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, మిషన్ భగీరథ నీటి సరఫరా వ్యవస్థలు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై సీవరేజ్ బోర్డు (హెచ్‌ఎమ్‌డబ్ల్యూఎస్‌ఎస్‌బి) పరిధిలోని కనెక్షన్లు, అన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ఎల్‌టి 5-బి కేటగిరీ పరిధిలోని మునిసిపల్ నీటి సరఫరా కనెక్షన్లు ఈ రైతు డిస్కం పరిధిలోకి రానున్నాయి. ఆయా సర్వీసులకు విద్యుత్ సరఫరా విస్తరణ,

ఒప్పందాల వాటా ప్రకారం విద్యుత్ కొనుగోలు, కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల బోర్డింగ్ ప్రక్రియ నిర్వహణ, ఆస్తుల నిర్వహణ, మెయింటెనెన్స్, లిఫ్ట్ ఇరిగేషన్ మీటరింగ్, వినియోగదారుల మీటరింగ్ ద్వారా అకౌంటింగ్ చేయడం, అవసరమైన రెగ్యులేటరీ ఫైలింగ్స్, నిబంధనల అనుసరణ వంటి ముఖ్య కార్యకలాపాలు నిర్వహిస్తుంది.

## కేంద్ర సంస్థ ఎన్టీపీసీవిద్యుత్‌ను కొనుగోలు చేయం

**దీర్ఘకాలిక ఒప్పందాలు ఆర్థిక ప్రయోజనాలకు విరుద్ధం**

**కేంద్రానికి తెలంగాణ సర్కార్ లేఖ**

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) నుంచి అధిక ధరకు విద్యుత్తును కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తెలంగాణ సర్కార్ కేంద్రానికి లేఖ రాసింది. బహిరంగ మార్కెట్‌కు సంబంధించి పొరుగు రాష్ట్రాల్లో విద్యుత్ ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయని అందులో పేర్కొంది. ముఖ్యంగా సౌర, పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా అత్యంత తక్కువ ధరకే విద్యుత్ అందుబాటులో లభిస్తున్న తరుణంలో, రాబోయే ప్రాజెక్టుల కోసం దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకోవడం రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. ప్రధానంగా రామగుండం ఎన్టీపీసీ ఫేజ్ 11 ప్రాజెక్టును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. 2,400 మెగావాట్ల సామర్థ్యం గల ఈ రెండో దశ ప్రాజెక్టులో ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 85 శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని ఎన్టీపీసీ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు నుంచి వచ్చే విద్యుత్ ధర యూనిట్‌కు రూ.8 నుండి రూ.9 వరకు ఉండే అవకాశం ఉండటంతో అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎన్టీపీసీ ఫేజ్ 1 విద్యుత్ ధర యూనిట్‌కు దాదాపు రూ.5.90గా ఉంది. కానీ ప్రస్తుత బయట మార్కెట్ పరిస్థితుల రీత్యా పొరుగు రాష్ట్రాల నుంచి, సోలార్ ఎనర్జీ వంటి పునరుత్పాదక వనరుల ద్వారా యూనిట్ విద్యుత్ చాలా తక్కువ ధరకే లభిస్తోంది. ఇంత భారీ వ్యత్యాసం ఉన్నప్పుడు, రాబోయే 25 ఏళ్ల పాటు అధిక ధర చెల్లించేలా ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోవడం వల్ల విద్యుత్ పంపిణీ సంస్థలపై రూ.కోట్ల అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

## స్పీకర్ తీర్పు ప్రజస్వామ్యస్ఫూర్తికి విరుద్ధంగా ఉంది

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు**

**హైదరాబాద్, మార్చి 11 ప్రభాతవార్త** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు మండిపడ్డారు. ఒక వ్యక్తి ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఆరు నెలల లోపే మరో పార్టీలో చేరి అదే పార్టీ తరఫున లోక్‌సభకు పోటీ చేయడం మొత్తం రాష్ట్ర ప్రజలు చూసిన విషయమే అన్నారు. ఇంత స్పష్టమైన పరిస్థితులు ఉన్నప్పటికీ దాన్ని పార్టీ ఫిరాయింపుగా పరిగణించలేమని చెప్పడం ఆశ్చర్యకరంగా అన్నారు. ఒక పార్టీ నుంచి గెలిచిన వ్యక్తి మరో పార్టీ అభ్యర్థికి ప్రచారం చేయడం, అదే పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేయడం వంటి స్పష్టమైన రికార్డులు ఉన్నప్పటికీ కూడా ఇది పార్టీ ఫిరాయింపు కాదని చెప్పడం ప్రజాస్వామ్యాన్ని అవమానించే తీర్పు అన్నారు. ఇది ప్రజలు ఇచ్చిన తీర్పును కూడా అగౌరవపరిచినట్లే అన్నారు. యాంటీ డిఫెక్షన్ చట్టాన్ని తీసుకొచ్చింది రాజీవ్ గాంధీ అన్నారు. ఆ సమయంలో రాజ్యాంగ సవరణ ద్వారా ఆ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చారన్నారు. మరోవైపు మీ పార్టీకి చెందిన నాయకుల చర్యలను సమర్థించే విధంగా ఇలాంటి తీర్పులు రావడం ఎలా సమర్థించగలరు?.. ఈ రోజు వచ్చిన తీర్పు కేవలం ప్రజాస్వామ్యాన్ని మాత్రమే కాదు, రాజ్యాంగాన్ని, ప్రజల తీర్పును అగౌరవపర్చడమే, అవమానించడమే. ఈ తీర్పుపై పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుందన్నారు.

## డిజిపి ఎంపికపై ఢిల్లీలో యుపిఎస్‌సి నేతృత్వంలో ముగిసిన భేటీ

**ముగ్గురి పేర్లను ఎంపిక చేసిన ఉన్నతాధికారుల కమిటీ**

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నూతన డిజిపి ఎంపిక విషయమై యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (యుపిఎస్‌సి) నేతృత్వంలో బుధవారం నాడు ఢిల్లీలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణా రావు సహా యుపిఎస్‌సి ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చే ఏప్రిల్‌లో పదవీ విరమణ చేయనున్న శివధర్ రెడ్డి స్థానంలో డిజిపిగా ఎవరిని ఎంపిక చేయాలనే దానిపై రా ష్ట్ర కేడర్‌లో సీనియర్లుగా వున్న ఐపిఎస్ అధికారుల పేర్లను ఈ సమావేశంలో పాల్గొన్న ఉన్నతాధికారులు పరిశీలించారని తెలిసింది. ఇందులో డిజి కేడర్‌లో వున్న అందరికంటే సీనియర్ 1991 బ్యాచ్ అధికారి హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి ఆనంద్, 1994 బ్యాచ్ అధికారిలో సీని యర్, కేంద్ర సర్వీసులో వున్న వినాయక్ ప్రభాకర్ ఆప్టే, ఇదే బ్యాచ్‌కు చెందిన రాష్ట్ర జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా, మరో అధికారి రాష్ట్ర సైబర్ సె క్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) డైరక్టర్ శిఖా గోయల్‌ల పేర్లు ప్రధానంగా వున్నట్లు తెలిసింది. కేంద్ర సర్వీసులో వున్న ఆప్టే రాష్ట్ర సర్వీసులోకి వచ్చే ందుకు అయిష్టత వ్యక్తం చేసినట్లు ఇదివరకే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయన పేరును కేవలం పరిశీలన మాత్రమే చేసినట్లు తెలిసింది. కా గా వీరితో పాటు ప్రస్తుత డిజి శివధర్ రెడ్డి, పోలీసు అకాడమి డైరక్టర్ అభిలాష్ బిస్త్ పేర్లను కూడా యుపిఎస్‌సి ప్రాథమికంగా పరిశీలించినట్లు తెలి సింది. అయితే శివధర్ రెడ్డి వచ్చే ఏప్రిల్‌లో, అభిలాష్ బిస్త్ జూన్ నెలలో పదవీ విరమణ చేస్తుండడంతో వీరి పేర్లను డిజిపి ఎంపిక విషయంలో యుపిఎస్‌సి పరిగణలోకి తీసుకోలేదని తెలిసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం కావాలనుకుని, వీరిలో ఒకరిని డిజిపిగా ఎంపిక చేసుకున్న పక్షంలో స ర్వీస్ పొడిగింపు లభించే వీలుంది. ఎపిలో గతంలో జెవి రాముడు, ఇప్పుడు హరీష్ గుప్తా ఇలాగే డిజిపిగా పదవీ పొడగింపు పొందడం గమనార్హ ం.

### వరల్డ్ బాక్సింగ్ ఫ్యూచర్స్ కప్‌లో

# భారత్ బాక్సర్లకు ఐదు విజయాలు

**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ ఫ్యూచర్స్ కప్-2026లో భారత యువ బాక్సింగ్ జట్టు బలమైన ప్రదర్శనను అందించింది. రెండు సెషన్లలో ఐదు విజయాలను నమోదు చేసింది. చంద్రిక పూజారి (50 కిలోలు) ఆధిపత్య ప్రదర్శన చేసి వెనిజులాకు చెందిన తన ప్రత్యర్థిపై 5-0 తేడాతో ఏకగ్రీవంగా విజయం సాధించింది. జోయ్‌శ్రీ దేవి (54 కిలోలు) కూడా టోర్నమెంట్‌లో తన అద్భుతమైన ప్రదర్శన కొనసాగించింది. స్థిరమైన దాడులతో బౌట్‌ను నియంత్రించిన తర్వాత



కజకిస్తాన్‌తో జరిగిన మూడవ రౌండ్‌లో రిఫరీ స్టాప్డ్ కాంటెస్ట్ విజయాన్ని సాధించింది. పురుషుల విభాగంలో కూడా భారత్‌కు చెందిన ఎల్. అంబేకర్ (50 కిలోలు) ఈక్వెడార్‌పై 5-0 ఏకగ్రీవ నిర్ణయాత్మక విజయంతో ముందుకు సాగాడు. రెండో సెషన్‌లో భారత జట్టు మరో రెండు విజయాలు సాధించి, ఫలవంతమైన రోజును ముగించింది. గుంజన్ (48 కిలోలు) తన ఇటలీ ప్రత్యర్థిని తీవ్రంగా ఎదుర్కొని, తీవ్రమైన పోటీ తర్వాత 3-2 తేడాతో విజయం సాధించింది. ప్రాచి (60 కిలోలు) తన బౌట్ ప్రారంభ రౌండ్‌లో ఈక్వెడార్ ప్రత్యర్థిని ఓడించి భారత్‌కు ఐదవ విజయాన్ని నమోదు చేసింది.



# టి20లో నం.1 అభిషేక్

**న్యూఢిల్లీ:** ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్ దుమ్ము రేపాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో మెరుగైన ప్రదర్శనతో కెరీర్ బెస్ట్ ర్యాంక్ అందుకున్నాడు. రెండు స్థానాలు ఎగబాకి 871 రేటింగ్ పాయింట్స్‌తో రెండో స్థానంలో నిలిచాడు. మెగా టోర్నీలో ఇషాన్ కిషన్ 9 మ్యాచ్‌లు ఆడి 317 పరుగులు చేశాడు. న్యూజిలాండ్‌తో ఫైనల్లో హాఫ్ సెంచరీతో సత్తా చాటిన అభిషేక్ శర్మ తన అగ్రస్థానాన్ని కాపాడుకున్నాడు. 875 రేటింగ్ పాయింట్స్‌తో నెంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మకు మధ్య 4 రేటింగ్ పాయింట్సే ఉన్నాయి. పాకిస్థాన్ ఓపెనర్ షాహిబ్జాదా ఫర్హాన్ ఒక స్థానం దిగజారి మూడో స్థానంలో నిలవగా, ఫిల్ సాల్ట్, పాతుమ్ నిస్సంక, టీమ్ సీఫెర్ట్ వరుసగా టాప్6లో కొనసాగుతున్నారు. తెలుగు తేజం తిలక్ వర్మ ఒక స్థానం దిగజారి 7వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.

టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 9వ స్థానంలో నిలిచాడు. టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన అగ్రస్థానాన్ని కోల్పోయాడు. సూపర్8 దశ నుంచి వరుణ్ తడబడటంతో 740 రేటింగ్ పాయింట్స్‌తో ఒక స్థానం దిగజారి రెండో స్థానంలో నిలిచాడు. 753 రేటింగ్ పాయింట్స్‌తో అఫ్ఘనిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అగ్రస్థానాన్ని అందుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా ఒక స్థానం ఎగబాకి టాప్6లో నిలిచాడు. అర్ష్‌దీప్ సింగ్ మూడు స్థానాలు దిగజారి 16వ స్థానానికి పడిపోగా, అక్షర్ పటేల్ 6 స్థానాలు ఎగబాకి 17వ స్థానాన్ని సరిపెట్టుకున్నాడు.

ఆట

### మహిళల ఆసియా కప్:

# చైనీస్ తైపీ చేతిలో భారత్ ఓటమి



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాలోని వెస్ట్రన్ సిడ్నీ స్టేడియంలో జరిగిన ఎఎఫ్‌సి మహిళల ఆసియా కప్-2026, చివరి గ్రూప్ గేమ్‌లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు చైనీస్ తైపీ చేతిలో ఓటమిపాలై, టోర్నీ నుండి నిష్క్రమించింది. గత మ్యాచ్‌లలో రెండు పరాజయాలను చవిచూసిన తర్వాత భారత్ ఈ టోర్నమెంట్‌లో సజీవంగా ఉండాలంటే కనీసం 2 గోల్స్ చేసి, ఆ తర్వాత మ్యాచ్ గెలవాల్సి ఉంటుంది. ఆటలో ఎక్కువ భాగం ఆధిపత్యం చెలాయించినప్పటికీ వరుసగా మూడవ ఓటమిని ఎదుర్కొంది. ఫలితంగా 3-1 తేడాతో ఓటమి చెందిన భారత్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు గ్రూప్ దశ నుండి వైదొలగింది. ఈ మ్యాచ్‌లో ఎక్కువ భాగాన్ని నియంత్రించి అనేక అవకాశాలను సృష్టించినప్పటికీ, వారు పూర్తి చేయకపోయింది. 2వ నిమిషంలో భారత జట్టు చేసిన ఘోర తప్పిదంతో చైనీస్ తైపీ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. సంజు ఇచ్చిన పేలవమైన బ్యాక్ పాస్ రిజూ చెన్ బంతిని తీసుకొని స్కోర్ చేయడానికి వీలు కల్పించింది. మనీషా కళ్యాణ్ వ్యక్తిగత ప్రతిభతో 39వ నిమిషంలో భారత్ ధీటుగా స్పందించి స్కోరును సమం చేసింది. వింగర్ అద్భుతమైన లాంగ్‌రేంజ్ స్ట్రైక్‌తో గోల్ కీపర్‌ను ఓడించి సమంచేశాడు. మొదటి అర్ధభాగంలో ఆటముగిసే సమయానికి చైనీస్ తైపీ తిరిగి ఆధిక్యాన్ని సాధించింది. ప్యారీ జాక్సా పెనాల్టీ ఏరియా లోపల బంతిని హ్యాండిల్ చేసిన తర్వాత, రిఫరీ స్పాట్‌కిక్ ఇచ్చాడు. దీంతో చైనీస్ తైపీ హాఫ్ టైంముగిసే సమయానికి2-1 ఆధిక్యంలో ఉంది. రెండవ అర్ధభాగంలో సమంచేసే ప్రయత్నంలో భారత్ ముందుకు సాగింది, కానీ 77వ నిమిషంలో మళ్ళీ క్యాచ్ అవుట్ అయింది. యు చిన్ చెన్ పాంథోయ్‌ను ఓడించి గోల్‌తో భారత్ ఓటమిని శాసించాడు.



### స్విస్ ఓపెన్‌లో 16వ రౌండ్‌కు

# సాత్విక్- చిరాగ్, హరిహరన్- అర్జున్

**న్యూఢిల్లీ:** స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో జరిగిన 2026 స్విస్ ఓపెన్ సూపర్ 300లో ప్రపంచ నం.4 జంట సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి 16వ రౌండ్‌కు దూసుకెళ్లారు. వారు చాలా తక్కువ ర్యాంక్‌లో ఉన్న సింగపూర్ జంట ఇంగ్ కో-జునుసుకే కుబోలను 21-19, 21-19 తేడాతో వరుస గేమ్‌లలో ఓడించి విజయంతో ప్రచారాన్ని ప్రారంభించారు. మరో భారత పురుషుల డబుల్స్ జత హరిహరన్ అంసకరుణన్-ఎంఆర్ అర్జున్ కూడా వరుస గేమ్‌ల విజయంతో రెండవ రౌండ్‌లో తమ స్థానాన్ని బుక్ చేసుకున్నారు. రెండో గేమ్‌లో 21-16, 24-22 తేడాతో సుదీర్ఘ డ్యూస్ పాయింట్ల తర్వాత వారు చైనీస్ తైపీ జత చెన్ ఝ రే-లిన్ యు చిహ్‌లను ఓడించారు. మహిళల డబుల్స్‌లో, భారత అగ్రశ్రేణి జంట ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ గాయం కారణంగా మొదటి గేమ్ సగంలోనే వైదొలగడంతో దురదృష్టకర ముగింపును ఎదుర్కొన్నారు. 713 స్కోరు వద్ద, ట్రీసా తన కుడి కాలులో కొంత నొప్పిగా అనిపించి ఆట నుండి వైదొలగాలని నిర్ణయించుకుంది. ఈ నిర్ణయంతో తైపీ జంట హు లింగ్ ఫాంగ్-జెంగ్ యు చీహ్‌లకు విజయాన్ని అందించింది. గత వారం ఆల్ ఇంగ్లాండ్ తర్వాత ఈ భారత్ డబుల్స్ వరుసగా రెండో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించడం ఇది రెండో సారి.

# ఔషధ తయారీ రంగంపై వార్ ఎఫెక్ట్

### తడిసిమోపెడవుతున్న నిర్వహణ వ్యయం

**న్యూఢిల్లీ, మార్చి 11:** భారత ఔషధ రంగాన్ని ఇరాన్ యుద్ధం తీవ్ర సంక్షోభంలోకి నెడుతోంది. యుద్ధం కారణంగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతినడం, మందుల తయారీ ముడి సరకు ధరలు పెరగడమే ఇందుకు కారణం. దేశీయంగా పారాసిటమాల్ సహా పలు రకాల మందుల ధరలు పెరుగుతున్నట్లు ట్రేడర్లు చెపుతున్నారు. ఔషధాల తయారీలో కీలకమైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్ (ఎపిఐ), ద్రావకాల ధరలు గత 2 వారాల్లో ఏకంగా 30 శాతం పెరిగాయి. భారత్ ఫార్మా అవసరాల కోసం, ముడి పదార్థాల కోసం చైనాపైనే అధికంగా ఆధారపడుతుంది. ఇరాన్ యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో రవాణా సంక్షోభంతో కంటైనర్ల కొరత ఏర్పడింది. సరకు రవాణా నౌకల మళ్లింపుతో చైనా నుంచి వచ్చే ముడి పదార్థాల సరఫరాకు అంతరాయం ఏర్పడింది. యుద్ధం కారణంగా సముద్రపు మార్గాల్లో రవాణాకు ముప్పు ఏర్పాడింది. షిప్పింగ్ కంపెనీలు సరకు రవాణా ఛార్జీలు ఒక్కసారిగా పెంచేశాయి. ప్రతి షిప్‌మెంట్‌పై 4 8 వేల డాలర్ల వరకు అదనపు ఛార్జీలు విధిస్తున్నాయి. ఇది దిగుమతి చేసుకునే దేశాలకు పెను భారంగా మారింది.



అదనపు భారాన్ని భరించలేక ఔషధ తయారీ కంపెనీలపై వేస్తున్నారు. గత డిసెంబర్ నెలతో పోలిస్తే గ్లిజరిన్ ధర 64 శాతం పెరిగింది. అత్యంత అవసర ఔషధాల్లో ఒకటైన పారాసిటమల్ తయారీ ముడి పదార్థాల ధర 26 శాతం మేర పెరిగింది. మందుల తయారీలో వాడే ద్రావకాలు పెట్రోకెమికల్స్ నుంచి తయారవుతాయి. ముడి చమురు ధరలు పెరగడం వల్ల ఈ ద్రావకాల ధరలు వారం రోజుల్లోనే భారీగా పెరిగాయి. ఔషధాల ఉత్పత్తిలో ఉపయోగపడే పదార్థాలు కావడంతో తయారీ ఖర్చు తడిసి మోపెడవుతోంది. భారత్‌లో నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ రూల్స్ ప్రకారం ధరలు నిర్ణయిస్తారు. ధరల నియంత్రణ నిబంధనల కారణంగా కంపెనీలు నష్టపోతున్నాయని, మరో 15 రోజులు ఇలాగే కొనసాగితే నిత్యావసర మందుల కొరతా ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రూ.25 లక్షలకోట్లతో అమెరికాలో

# అంబానీ అతిపెద్ద రిఫైనరీ!

**ముంబయి, మార్చి 11:** అమెరికా ఇంధన రంగంలో ఒక చారిత్రాత్మక అధ్యాయం మొదలైంది. గత 50 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా, అమెరికాలో మొట్టమొదటి కొత్త ఆయిల్ రిఫైనరీని నిర్మిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. టెక్సాస్‌లోని బ్రౌన్స్‌విల్లే పోర్ట్ వద్ద నిర్మించబోయే ఈ భారీ ప్రాజెక్టులో భారతీయ దిగ్గజ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ భాగస్వామిగా ఉందని ట్రంప్ తన సోషల్‌మీడియా ట్రూత్‌లోప్రకటించారు. ఈ ప్రాజెక్టు విలువ సుమారు 300 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 25 లక్షల కోట్లు. ఇది అమెరికా చరిత్రలోనే అతిపెద్ద డీల్ అని ట్రంప్ అభివర్ణించారు. భారత దేశంలోని మా భాగస్వాములకు, అక్కడి అతిపెద్ద ప్రైవేట్ ఇంధన సంస్థ రిలయన్స్‌కు ఈ భారీ పెట్టుబడి పెట్టినందుకు ధన్యవాదాలని పేర్కొన్నారు. అమెరికా ఫస్ట్ రిఫైనింగ్ అనే సంస్థ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. ఇది ప్రపంచంలోనే అత్యంత స్వచ్ఛమైన రిఫైనరీగా నిలుస్తుందని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో చమురు సరఫరాకు ఆటంకాలు కలుగుతున్న సమయంలో, ఈ కొత్త రిఫైనరీ అమెరికా ఇంధన భద్రతను బలోపేతం చేయడమే కాకుండా, వేలాది మందికి కొత్త ఉద్యోగాలను కల్పిస్తుందని ఆయన చెప్పారు. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పటికే ప్రపంచంలోనే అతిపెద్ద రిఫైనరీని జామ్‌నగర్‌లో నిర్వహిస్తోంది. ఇప్పుడు అమెరికాలో నిర్మించబోయే ఈ భారీ ప్రాజెక్టులో రిలయన్స్ భాగస్వామ్యం కావడం ద్వారా ఇరు దేశాల ఆర్థిక సంబంధాలు మరో స్థాయికి చేరుకున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. పన్నుల తగ్గింపు, అనుమతుల సరళీకరణ వల్లే ఇలాంటి భారీ పెట్టుబడులు అమెరికాకు తిరిగి వస్తున్నాయని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.



## వాణిజ్యం




### ఇరాన్‌పై యుద్ధంతో

# కుప్పకూలిన సెన్సెక్స్, నిఫ్టీ

### భారీ కంపెనీల్లో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు విత్‌డ్రా

### మూడు పెద్దబ్యాంకులకు రూ.55వేల కోట్ల నష్టం

**ముంబయి, మార్చి 11:** ఎంపికచేసిన భారీ కంపెనీల్లో అమ్మకాల ఒత్తిడిపెరగడం, మధ్యప్రాచ్యంలో పెరిగిన ఉద్రిక్తతలతో స్టాక్ మార్కెట్లు భారీగా కుదేలయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు స్టాక్స్‌నుంచి పెట్టుబడులను విత్‌డ్రాచేసుకున్నారు. దీనితో మార్కెట్లపై ఒత్తిడిపెరిగింది. డాలరుతోరూపాయి మారకం కూడా మళ్లీ క్షీణించింది. దేశంలో మూడు అతిపెద్ద బ్యాంకులు హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ, ఎస్‌బిఐలు సమిష్టిగా 55 వేల కోట్ల రూపాయల మార్కెట్ విలువలు నష్టపోయాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 1342.27 పాయింట్లు క్షీణించి 76,863.71 పాయింట్లవద్ద ట్రేడింగ్‌ముగిస్తే ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 50 సూచీ కూడా 394.75 పాయింట్లు క్షీణించి 23,866.85 పాయింట్ల వద్ద ముగిసింది. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 1.13శాతం దిగజారితే స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.32శాతం క్షీణించింది. బ్యాంకింగ్ స్టాక్స్‌లో యాక్సిస్ బ్యాంకు 4.62శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.77శాతం రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.56శాతంచొప్పున క్షీణించాయి. మార్కెటపరంగా ప్రతికూలంగానే ముగిసాయి. బిఎస్‌ఇలో 1881 షేర్లు పెరిగితే 2381 షేర్లు దిగజారాయి. 169 కంపెనీల్లో మాత్రమే స్థిరంగా కొనసాగాయి. ఇక విదేశీ కరెన్సీ మార్పిడి మార్కెట్‌లో డాలరుతోరూపాయి మారకం విలువలు 92 వద్దముగిసింది. ముందురోజు 91.85తో పోలిస్తే మరింత క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్‌నాటి సెంటిమెంట్లుపరంగాచూస్తే 0.71శాతం క్షీణించి రూ.162,161గా నడిచాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు మేనెల డెలివరీకి సంబంధించి 3.28 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 91.8డాలర్లుగా కొనసాగింది. స్టాక్స్‌పరంగా జియోఫైనాన్షియల్, డాక్టర్ రెడ్డీస్, సన్‌ఫార్మా, కోల్ ఇండియా ఎన్టీపీసీ షేర్లు రాణిస్తే బజాజ్‌ఫైనాన్స్, యాక్సిస్‌బ్యాంకు బజాజ్ ఫిన్‌సెర్వ్, ఎంఅండ్‌ఎం, ఐషర్‌మోటార్స్ స్టాక్స్‌నష్టపోయాయి.

పశ్చిమాసియాలో యుద్ధంముగింపుపై స్పష్టత లేకపోవడం చమురుధరల్లో అస్థిరతలకారణంగానే అమ్మకాలు జోరందుకున్నాయి.

### సర్ ఛార్జిలపేరిట ఎయిరిండియా

# ఛార్జిల పెంపు!

**ముంబయి, మార్చి 11:** గల్ఫ్‌ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలవల్ల దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో ఇంధన సర్‌ఛార్జీలను దశల వారీగా పెంచాలని ఎయిరిండియా నిర్ణయించింది. విమాన టికెట్లపై విధించే ఈ ఫ్యూయల్ సర్‌ఛార్జీలు డొమెస్టిక్ సౌత్ ఏసియన్ అసోసియేషన్ ఫర్ రీజనల్ కోఆపరేషన్ విమానాలకు రూ.399 చొప్పున పెంచాలని నిర్ణయించింది. ఇంటర్నేషనల్ ఫ్లైట్ టికెట్లపై ఈ సర్‌ఛార్జీని 200 డాలర్లు పెంచాలని నిర్ణయించినట్లు ఎయిరిండియా గ్రూప్ ప్రకటించింది. ఈ సర్ ఛార్జీ పెంపు అనేది 3 దశల్లో అమలు చేయనున్నది. మొదటి దశ సర్ ఛార్జీలను గురువారం ఉదయం 1 గంట నుంచి అమలులోకి తీసుకొస్తున్నది. ఇక రెండో దశ సర్ ఛార్జీల అమలును ఈనెల 18, 2026 నుంచి అమలు చేస్తామని తెలిపింది. ఆ తర్వాతే మూడో దశ అమలు చేస్తామని వెల్లడించింది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ఎటీఎఫ్ ధరలు భారీగా పెరుగుతున్న క్రమంలోనే ఈ ఫ్యూయల్ సర్‌ఛార్జీలను పెంచాలని ఎయిరిండియా నిర్ణయించినట్లు వివరించింది. ఒక్కసారిగా ప్రయాణికులపై భారం మోపకుండా దశల వారీగా అమలు చేస్తున్నట్లు తెలిపింది. విమాన కంపెనీ ఆపరేటింగ్ ఖర్చులో 40 శాతం మేర ఈ జెట్ ఫ్యూయల్ ఉంటుంది. ఏటీఎఫ్ ధర పెరిగితే ఆపరేషన్స్ ఖర్చు భారీగా పెరుగుతుంది. విమాన సంస్థలు భారీ నష్టాల్లో కూరుకుపోకుండా ఉండేందుకు విమాన టికెట్లపై ఫ్యూయల్ సర్ ఛార్జీలు విధిస్తుంటాయి. దేశీయ మార్గాల్లో విమాన ప్రయాణికులకు టికెట్లపై రూ.400 మేర అదనపు భారం పడుతుంది. ఇంటర్నేషనల్ టికెట్లపై ఇప్పటికే ఫ్యూయల్ సర్‌ఛార్జీ ఉంటుంది. ఇప్పుడు అది మరింత పెరగనుంది. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో ఎయిర్ లైన్స్ సర్ ఛార్జీలను పెంచక తప్పదని కంపెనీలు వాదిస్తున్నాయి. ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగి ఫ్యూల్ ఛార్జీలు తగ్గిన తర్వాత పెంచిన సర్ ఛార్జీల విషయంలో విమాన సంస్థలు పునఃసమీక్ష చేస్తాయనే నమ్మకం ఉందని, ఈ ఛార్జీలను ఎత్తివేయవచ్చన్న అంచనాలున్నాయి.




### ఆర్‌బిఐ రూ.50 వేల కోట్ల

# ప్రభుత్వ బాండ్ల కొనుగోళ్లు

**ముంబయి, మార్చి 11:** ఆర్థికవ్యవస్థలోకి నగదును మరింతగా చొప్పించేందుకు వీలుగా భారత రిజర్వుబానయంకు రూ.50 వేల కోట్ల విలువైన ప్రభుత్వ బాండ్లను ఓపెన్ మార్కెట్ ఆపరేషన్‌ద్వారా వేలంలో కొనుగోలుచేస్తోంది. శుక్రవారం ఈ బాండ్లకొనుగోలు ప్రక్రియతో ఆర్థికవ్యవస్థలోకి నగదు చెలామణి పెరిగి సమతుల్యత పెరుగుతుందని అంచనా. మల్టీప్రైస్ అంటే బహుళధరల పద్ధతిలో ఈసెక్యూరిటీలను కొనుగోలుచేస్తుంది. 2029వరకూ ఉండే ప్రభుత్వ సెక్యూరిటీలు 6.45శాతం, 2032వరకూ చెల్లుబాటయ్యే ప్రభుత్వ సెక్యూరిటీలు 7.95శాతం, 2034వరకూ ఉన్న సెక్యూరిటీలు 6.79శాతం, 2035వరకూ ఉండే ప్రభుత్వ సెక్యూరిటీలు 6.64శాతం, 2036వరకూ ఉన్న జిసెక్స్ 7.41శాతం, 2039వరకూ ఉన్న సెక్యూరిటీలు 7.62శాతం, 2046 వరకూ ఉండే సెక్యూరిటీలు 7.06శాతం వరకూ కొనుగోళ్లు ఉంటాయి. అయితే మొత్తం కొనుగోళ్లు రూ.50వేల కోట్లకు మించకుండా ఉంటుంది. ఎంపికచేసిన ప్రభుత్వ సెక్యూరిటీలను మాత్రమే కొనుగోలుచేస్తుంది.

ప్రతి ప్రభుత్వ బాండ్‌కొనుగోలులోనూ ఎంతమొత్తం వేలంలో కొనుగోలుచేయాలన్న సడలింపులు ఆర్‌బిఐకి ఉంటుందని తెలిపింది. ఎక్కువమొత్తం లేదా తక్కువ మొత్తం కొనుగోలుకు కూడా ఆర్బీఐకి పూర్తి అధికారాలుంటాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.